
బుధవారం 4-10-2023


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావం తుదు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 194

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పసిడి పారుల్.. అన్ను బంగారం

భారత్ ఖాతాలో మరో 2 స్వర్ణాలు, 2 రజతాలు, 5 కాంస్యాలు - 14లో



భారత్ వృద్ధి 6.3 శాతం

2023–24 ఆర్థిక సంవత్సరంపై ప్రపంచ బ్యాంక్ అంచనా - 15లో



న్యూస్‌క్లిక్ ఆఫీసుల్లో సోదాలు

భారత్‌లో చైనాకు ప్రచారం చేసేందుకు నగదు స్వీకరించిందన్న ఆరోపణలపై 'న్యూస్‌క్లిక్' ఆఫీసుల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు చేపట్టారు.


వివరాలు 6లో ▸



దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించండి

భారత్‌లో ఉన్న దౌత్యవేత్తల సంఖ్యను ఈనెల 10లోగా తగ్గించాలని కెనడాకు భారత్ అల్టిమేటమ్ జారీ చేసింది.

వివరాలు 6లో ▸



స్వర్ణ దేవాలయంలో రాహుల్

కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం లంగర్‌లో కూరగాయలు తరిగి.. గిన్నెలు తోమారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీలో భూప్రకంపనలు

నేపాల్‌లో సంభవించిన భూకంపాల ప్రభావం ఉత్తర భారతాన్ని వణికించింది. ఢిల్లీలో భూ ప్రకంపనలకు ప్రజలు బెంబేలెత్తిపోయారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్



'ప్రగతి రథం'పై 'పిచ్చి' కథ

- ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బ తీసేలా అవాస్తవాలతో రామోజీ కథనం
- 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆర్టీసీ చరిత్రలో మేలి మలుపు తిప్పిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ సాకారం.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం.. కోవిడ్‌లోనూ ఉద్యోగులకు ప్రభుత్వం అండ
- కారుణ్య నియామకాలకు తక్షణం ఆమోదం.. కార్పొరేట్ శాలరీ ప్యాకేజీతో ప్రయోజనం
- అలవెన్స్‌లు, సర్వీసు నిబంధనల దిశగా అడుగులు

16 లో


సుప్రీంకోర్టులోనూ

దక్కని ఉపశమనం

స్కిల్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

బాబు నేరం చేశారా? లేదా? అనే వాదనల జోలికెళ్లని ఆయన లాయర్లు

- గవర్నరు అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్టు చేయకూడదని వాదన
- అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం అనుమతి తప్పనిసరి..
- కాబట్టి ఈ అరెస్టు చెల్లదు.. కేసును క్వాష్ చేయండంటూ వాదనలు
- బాబు తరఫున వాదించిన హరీష్ సాల్వే, సిద్దార్థ లూథ్రా, అభిషేక్ సింఘ్వీ..
- ఎంతమంది సీనియర్లు బాబు తరఫున వాదిస్తారని అడిగిన ధర్మాసనం
- 2018 జులైలో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ)కు సవరణ
- ఆ తర్వాత జరిగిన నేరాలకే 17ఏ వర్తిస్తుందన్న సీఐడీ న్యాయవాది రోహత్గీ
- స్కిల్ కుంభకోణం 2015-16 మధ్య జరిగిందని వెల్లడి.. విచారణ కూడా 2018కి ముందే ప్రారంభమయిందని వివరణ
- మరి 17ఏ ఎలా వర్తిస్తుందని బాబు లాయర్లను ప్రశ్నించిన కోర్టు.. దీనికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని సీఐడీకి ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నకిలీ ఒప్పందాలు చేసుకుని... షెల్ కంపెనీల్లోకి ప్రభుత్వ ధనాన్ని పంపించారు. వాటిని విత్‌డ్రా చేసుకుని తన జేబులో వేసుకున్నారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని అడుగుతూ ఆదాయపు పన్ను విభాగం నోటీసులిచ్చింది. ఆ నోటీసులు ఇచ్చే అధికారం మీకు లేదంటూ జవాబిచ్చారు చంద్రబాబు. ఆ డబ్బుల్ని మనీ లాండరింగ్ చేసిన వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు కూడా చేసింది. ఇలా అన్ని వేళ్లూ సీఎం హోదాలో ఈ స్కామ్‌కు పాల్పడింది చంద్రబాబేనని చూపించాయి. పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్టు చేసింది. ఆధారాలన్నీ చూపించటంతో కోర్టు జైలుకు పంపించింది. చంద్రబాబు కుటుంబీకు లేమో... ఆయనకు బోలెడంత డబ్బుందని, ఈ నేరం చెయ్యాల్సిన అవసరం లేదని

మిగతా 2వ పేజీలో ▶

టీడీపీ

దుశ్శాసన పార్టీ

రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై దిగజారుడు ఆరోపణలు

స్త్రీలను అవమానిస్తున్న వారిని సమర్థించడం సిగ్గుచేటు



మీడియాతో మాట్లాడుతూ కన్నీరు పెడుతున్న మంత్రి ఆర్కే రోజా

- మీడియా సమావేశంలో మంత్రి రోజా కన్నీరు
- మహిళా సాధికారతకు పాటుపడుతున్న నా గొంతు నొక్కాలని చూస్తున్నారు
- దమ్ముంటే సీడీలను ప్రజల ముందుకు తీసుకురండి
- రోజా భయపడేరకం కాదు
- బండారును వదిలిపెట్టను.. న్యాయపోరాటం చేస్తా

> ఒక మహిళపై టీడీపీ నేత బండారు అభ్యంతరకర ఆరోపణలు చేస్తే లోకేశ్‌తో పాటు టీడీపీ నేతలు మద్దతివ్వడం సిగ్గు చేటు. ఆడ పుట్టుకను అపహాస్యం చేసిన వ్యక్తి ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడు.. ఆడపిల్ల కనిపిస్తే ముద్దుపెట్టాలని చెప్పిన వ్యక్తి ఆ పార్టీ ఎమ్మెల్యే.. ఇలాంటి వారున్న టీడీపీకి మహిళలంటే ఎలా గౌరవం ఉంటుంది?

తిరుపతి రూరల్/సాక్షి అమరావతి: విశ్వ వ్యాప్తంగా అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్న నేటి రోజుల్లో ఇంకా పాతకాలం నాటి సంకుచిత ఆలోచనలతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి బండారు సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, మంత్రి ఆర్కే రోజాను ఉద్దేశిస్తూ నీచాతి నీచంగా విమర్శించడంపై సభ్య సమాజం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా, టీడీపీ అధిష్టానం

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

12 గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు..



తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లిదండ్రుల పక్కన నిద్రిస్తున్న ఓ బాలుడు తెల్లవారుజామున కిడ్నాప్ కాగా... 12 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించి తిరిగి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

వివరాలు 5లో ▸

విక్రమ్ ల్యాండర్ మళ్లీ గెంతింది



చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు శాశ్వత నిద్రలోకి జారుకుంటున్నాయని భావిస్తున్న వేళ ఇస్రో మరో ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టింది. ల్యాండర్‌ను కాస్త ఎగిరేలా చేసి పక్కన దిగేలా చేశారు.

వివరాలు 6లో ▸

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE — Vencobb CHICKEN

సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

గ్రుడ్డ రిటైల్ ధర ₹ 72 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 127	డ్రెస్డ్ స్కిన్‌తో 218
	రిటైల్ లైవ్ బర్డ్ 149	స్కిన్‌లెస్ 248




పియరీ అగోస్తినీ


ఫెరెంక్ క్రౌజ్


అన్నె ఎల్ హుయిలర్

ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌పై అధ్యయనానికి ప్రతిష్టాత్మక బహుమతి

'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ప్రకటన

6 లో

భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన పియరీ అగోస్తినీ, జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్వాంటమ్ ఆప్టిక్స్, లుడ్విగ్ మాక్సిమిలియన్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన ఫెరెంక్ క్రౌజ్, స్వీడన్‌లోని లుండ్ యూనివర్సిటీకి చెందిన అన్నె ఎల్ హుయిలర్‌ను ఈ బహుమతి వరించింది.

సూక్ష్మస్థాయి కాంతి పుంజాల తయారీకి ఫిజిక్స్ నోబెల్

మరింత సమర్థంగా పనిచేసే ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవకాశం

6 లో

10న సీఐడీ ముందుకు

నారా లోకేశ్..



ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో హైకోర్టు ఆదేశాలు

ఇదే కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

మరో నిందితుడు నారాయణ పిటిషన్‌పై నేడు విచారణకు అవకాశం

సాక్షి, అమరావతి: రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో ఈనెల 10వ తేదీన సీఐడీ అధికారుల ఎదుట విచారణకు స్వయంగా హాజరు కావాలని మాజీ మంత్రి నారా లోకేశ్‌ను హైకోర్టు ఆదేశించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 41 ఏ కింద నోటీసులకు అనుగుణంగా విచారణకు హాజరు కావాలని లోకేశ్‌కు స్పష్టం చేసింది. ఇదే కేసులో బెయిల్ కోరుతూ మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద సీఐడీ తనకు జారీ చేసిన నోటీసును రద్దు చేయాలని, లేదంటే ఇంటివద్దే తనను విచారించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపే అవకాశం ఉంది.

కనిపించేంత దూరంలో న్యాయవాది

ఇన్నర్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో నారా లోకేశ్‌ను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించవచ్చని, మధ్యాహ్నం గంట పాటు భోజన విరామం ఇవ్వాలని హైకోర్టు సూచించింది. విచారణ సమయంలో లోకేశ్ కనిపించేంత దూరం వరకు మాత్రమే

మిగతా 3వ పేజీలో ▶

గుంటూరు కోర్టు వద్ద టీడీపీ నేత బండారు సత్యనారాయణ



సీఎం జగన్, మంత్రి రోజాను దూషించిన కేసులో బండారుకు బెయిల్

- అంతకుముందు గుంటూరు జీజీహెచ్‌లో వైద్యపరీక్షలు
- ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రిలో ఉంచాలని కోరిన టీడీపీ నేత బండారు
- ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని నిర్ధారించిన ఆస్పత్రి సూపరింటెండెంట్.. అనంతరం కోర్టుకు తరలింపు
- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన కోర్టు

- వివరాలు 3లో



కేసీఆర్ వస్తే.. వద్దన్నాం

ఎన్డీయేలో చేరతామని బీఆర్ఎస్ కోరితే తిరస్కరించాను..

- కేటీఆర్‌ను సీఎం చేస్తానంటే ఇది రాచరికం కాదని చెప్పాను
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ కుటుంబం కబ్జా చేసింది
- ఆయన కొడుకు, అల్లుడు కలసి భారీ అవినీతికి పాల్పడుతున్నారు
- కిలాడీ పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్‌కు చీకటి సంబంధం
- ఆ పార్టీలను నమ్మి అధికారం ఇవ్వొద్దు
- తెలంగాణలోని నిజామాబాద్ ప్రజాగర్జన సభలో ప్రధాని మోదీ


నిజామాబాద్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'ఒకట్రెండు సార్లు కేసీఆర్ నన్ను కలిశారు. తాను తప్పుకోవాలనుకుంటున్నానని, తన కొడుకు కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నానని నాతో చెప్పారు. కేటీఆర్‌ను పంపిస్తా, ఆశీర్వదించాలని కోరారు. అప్పుడు నువ్వేమైనా రాజువా, మహారాజువా? నీ తర్వాత నీ కొడుకు కూర్చోవడానికి? అని ప్రశ్నించాను. ఎవరిని సీఎంగా కూర్చోబెట్టాలో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారని చెప్పాను. నేను ఇలా చెప్పిన రోజు నుంచి కేసీఆర్ నన్ను కలవలేదు. కనీసం నా కళ్లలోకి చూసే సాహసం కూడా చేయడం లేదు. ఆ తర్వాతి రోజుల్లో నాపై, బీజేపీపై ఇష్టం వచ్చినట్టు విమర్శలు, ఆరోపణలు మొదలుపెట్టారు. మీడియా వాళ్లు కూడా ఈ తేదీలు చెక్ చేసుకోవచ్చు. నా పక్కన అవినీతిపరులకు ఛాన్స్ లేదు' అని

మిగతా 3వ పేజీలో ▶


సభలో అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

పెడనలో అల్లర్లకు వైఎస్సార్‌సీపీ ప్రణాళిక

జనసేన నేత పవన్ కళ్యాణ్ ఆరోపణ



'పెడనలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అల్లర్లు సృష్టించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అల్లరిమూకలను రప్పించి రాళ్లతో దాడి చేయించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఎటువంటి అల్లర్లు, గొడవలు జరిగినా హోం మంత్రి, డీజీపీ, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుంది' అని జనసేన అధ్యక్షుడు పవన్ ఆరోపించారు.

- వివరాలు 10లో

ఆ అల్లర్ల కుట్ర పవన్‌దే..



- అవనిగడ్డ సభ ఫ్లాప్‌తో ఆయనలో దిగులు
- అంగళ్లు మాదిరిగా గొడవల్ని సృష్టించేందుకు కుయుక్తులు.. వారాహిని అడ్డుకునే అవసరం మాకేంటి?
- పెడన ప్రజలు శాంతికాముకులు పవన్..
- దాడికి యత్నిస్తున్నారంటూ పిచ్చి ఆరోపణలా.. వాటిని నిరూపించే దమ్ముందా?
- జనసేన అధ్యక్షుడు పవన్‌కు మంత్రి జోగి రమేశ్ సవాల్

- వివరాలు 10లో

క్లుప్తంగా...

కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబానికి రూ.30లక్షలు ఎక్స్‌గ్రేషియా

నరేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని సీఎం వైఎస్ జగన్ హామీ

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఓ ఆకతాయి దాడి చేయడంతో మరణించిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.30లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. త్వరగా నిమజ్జనం పూర్తి చేయాలని సూచిస్తున్న కానిస్టేబుల్ నరేంద్ర తల వెనుక ఉలస రామకృష్ణ అనే ఆకతాయి కర్రతో గట్టిగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నరేంద్రను మొదట విజయవాడ ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ కానిస్టేబుల్ నరేంద్ర మృతిచెందారు. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణం స్పందించి కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబానికి రూ.30లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం చెప్పారు.

డిసెంబర్‌లో చేతివృత్తుల శిక్షణ

సాక్షి, అమరావతి: సాంకేతిక శిక్షణ సంస్థ ద్వారా అర్హులైన అభ్యర్థుల నుంచి చేతివృత్తుల (క్రాఫ్ట్స్ మెన్ ట్రైనింగ్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధి–శిక్షణ సంస్థ డైరెక్టర్ బండి నవ్య మంగళవారం తెలిపారు. డిసెంబర్‌లో చేతి వృత్తుల్లో మెలకువలపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 9లోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

ఏపీ రెరా ఇన్‌చార్జి చైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రభుత్వం ఈద రాజశేఖర్‌రెడ్డిని నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చార్టర్డ్ అకౌంటెంట్ అయిన రాజశేఖర్ రెడ్డి ఏపీ రెరాలో సీనియర్ సభ్యుడిగా కొనసాగుతుండగా, ఇప్పుడు ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కొనుగోలుదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పరిశ్రమ వృద్ధికి ఏపీ రెరా పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

గ్రామ పంచాయతీ నిధులకు ఆడిట్ తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పీఆర్‌అండ్‌ఆర్‌డీ శాఖకు లోకాయుక్త నోటీసులు

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీల నిధులు దుర్వినియోగం కాకుండా తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించాలని ఏపీ ప్రభుత్వానికి లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లె, టి.సుందూరు, మేడికొండూరు మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో ఏళ్లుగా వినియోగించిన నిధులపై ఆడిట్ నిర్వహించడం లేదని, అందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, తిమ్మపూడికి చెందిన సాంబశివరావు లోకాయుక్తను ఆశ్రయించగా విచారణకు ఆదేశించారు. తమ ఆదేశాలు అందిన 3 నెలల్లో ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సీఎస్, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖను ఆదేశించారు.ఆడిట్ నిర్వహణకు రాష్ట్రస్థాయిలో ఒక హైలెవల్ సంస్థను ఏర్పాటు చేసి పర్యవేక్షించేలా చూడాలని స్పష్టం చేశారు.

అమృత్‌నోని బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెటర్ సూర్యకుమార్



సాక్షి, హైదరాబాద్: అమృత్‌నోని బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ నియమితులయ్యారు. 'అమృత్ నోని కుటుంబంలో నేను భాగమైనందుకు సంతోషంగా ఉంది' అంటూ ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. 'అమృత్ నోని భారతదేశంలోని ప్రముఖ ఆయుర్వేద సంస్థ. దశాబ్దాలుగా ఆయుర్వేద ఉత్పత్తులను తయారు చేస్తోంది. అమృత్‌నోని ఫ్లాగ్‌షిప్ ఆయుర్వేద ఉత్పత్తి పెయిన్ రిలీఫ్ స్ప్రే అందరి దృష్టిని ఆకర్షించింది.అమృత్ నోని ఆయుర్వేద ఉత్పత్తుల్లో అమృత్ నోని పవర్ ప్లస్, అమృత్ నోని డి-ప్లస్, అమృత్ నోని ఆర్థోప్లస్, అమృత్ నోని గ్యాస్ట్రిన్, అమృత్ నోని పెయిన్ ఆయిల్, అమృత్ నోని క్యాన్సి కేర్ వంటివి ఉన్నాయి. పెయిన్ రిలీఫ్ స్ప్రే అన్ని ఆయుర్వేద, మెడికల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది' అని తెలిపారు.

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పెట్రోల్ ఉత్పత్తుల్లో వినియోగించే ఇథనాల్ తయారీ పరిశ్రమను బాపట్ల జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ముందడుగు పడింది. కొరిశపాడు మండలం తమ్మవరం వద్ద శర్వాణి బయో ఫ్యూయెల్ సంస్థ ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తోంది. 45 ఎకరాల్లో రూ.250 కోట్లతో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్‌లో భూమిపూజ చేస్తున్నారు. రోజుకు 2 లక్షల లీటర్ల ఇథనాల్‌ను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తారు. దీని ఏర్పాటుతో 400 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సుమారు 14 నెలల్లో పరిశ్రమ నిర్మాణం పూర్తి

- బాపట్ల జిల్లా తమ్మవరం వద్ద పరిశ్రమ
- రోజుకు 2 లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం
- నేడు సీఎం జగన్ చేతుల మీదుగా వర్చువల్‌గా భూమిపూజ

చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌ను ప్రకాశం జిల్లా సూరారెడ్డిపాలెంలోని ఐవోసీ, ఇతర ఇంధన ప్లాంట్లకు సరఫరా చేయనున్నారు. ఇప్పటివరకు ప్రకాశం, గుంటూరు



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటయ్యే ప్రాంతం

జిల్లాల్లో ఇథనాల్ ప్లాంట్ లేదు. ఇప్పుడు బాపట్ల జిల్లా పరిధిలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు.

ఇథనాల్ తయారీ ఇలా..

ఇథనాల్‌ను బియ్యం, నూకలు, పాడైపోయిన బియ్యం, మొక్కజొన్న గింజలు, మొలాసిస్ తదితరాలను వినియోగించి తయారు చేస్తారు. దీనిని పెట్రోలియం ఉత్పత్తుల్లో వినియోగిస్తారు. ఇథనాల్ ఉత్పత్తి తరువాత వచ్చే ఉప ఉత్పత్తిని పశువుల మేతగా వినియోగించవచ్చు. ఇథనాల్‌ను స్థానికంగా ఉత్పత్తి చేయడం వల్ల పెట్రోలియం ముడి సరుకు దిగుమతులను తగ్గించుకోవచ్చు. దీనిని పెట్రోలియం ఉత్పత్తులలో కలపడంవల్ల పొల్యూషన్ కూడా తగ్గుతుంది. ప్రస్తుతం పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్‌ను మాత్రమే కలుపుతున్నారు. రాబోయే కాలంలో దీనిని 20 శాతానికి పెంచాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. బ్రెజిల్‌తోపాటు కొన్ని దేశాల్లో ఇప్పటికే 50 శాతానికి పైగా ఇథనాల్‌ను పెట్రోలియం ఉత్పత్తుల్లో వినియోగిస్తున్నాయి.

రైతులకు లబ్ధి



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ఈ ప్రాంత రైతులకు మరింత ఉపయోగం కలుగుతుంది. 50 కిలోమీటర్ల పరిధిలో మొక్కజొన్న పండించే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. వరి రైతులకు కూడా ఈ పరిశ్రమతో మేలు జరుగుతుంది. తడిసిన ధాన్యంతోపాటు నూక ఇతరత్రా ధాన్యం ఇథనాల్ పరిశ్రమకు అవసరముంటుంది.

– పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి,
ఎండీ, శర్వాణి బయో ఫ్యూయల్

సుప్రీంకోర్టులోనూ దక్కని ఉపశమనం

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. ఆయన నిజంగా నేరం చెయ్యకపోతే ఆయన లాయర్లు కోర్టులో అదే విషయాన్ని చెప్పొచ్చు కదా? అదే వాదన వినిపించొచ్చు కదా? కానీ ఈ దేశంలోనే అత్యంత ఖరీదైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ చంద్రబాబు విషయంలో వాదిస్తున్నదేంటో తెలుసా? ఆయనకు దీంతో సంబంధం లేదనో, ఆయన నేరం చెయ్యలేదనో కాదు. చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రి కనుక ఆయన్ను అరెస్టు చేసే ముందు గవర్నరు అనుమతి తీసుకోవటం తప్పనిసరి అని... అలా తీసుకోలేదు కనక ఈ అరెస్టుతో పాటు ఆయనపై పెట్టిన కేసు కూడా చెల్లదని... కాబట్టి మొత్తం కేసునే కొట్టేయాలని వాదిస్తున్నారు.

మంగళవారం సుప్రీంకోర్టులో సైతం... చంద్రబాబు నేరం చేశారా? లేదా? అనే జోలికి తాము వెళ్లబోవటం లేదని, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం ఆయన అరెస్టు చెల్లదని మాత్రమే తమ వాదన వినిపిస్తున్నామని స్పష్టంచేశారు. విచిత్రమేంటంటే చంద్రబాబు నాయుడి తరఫున కాకలు తీరిన లాయర్లు సిద్ధార్థ లూత్రా, అభిషేక్ మను సింఘ్వీ, హరీష్ సాల్వే ముగ్గురూ వాదనలు వినిపించారు. ముగ్గురూ కూడా సెక్షన్ 17ఏ కింద గవర్నరు అనుమతి తీసుకోలేదు కనక కేసు చెల్లదని, క్వాష్ చేయాలని మాత్రమే వాదించారు. దాదాపు 50 నిమిషాలసేపు జరిగిన విచారణలో... 90 శాతం సమయం ఈ చట్టం చంద్రబాబుకు వర్తిస్తుందా? లేదా? అన్న దానిపైనే సాగటం గమనార్హం. అయితే అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్ 17(ఏ)ను 2018లో సవరించడానికన్నా ముందు ఈ నేరం జరిగింది కనక ఆ సవరణ దీనికి ఎలా వర్తిస్తుందని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. చివరకు దీనికి సంబంధించిన పత్రాలన్నీ సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ కేసును వచ్చే సోమవారానికి వాయిదా వేయటంతో... చంద్రబాబుకు ఆశించిన ఉపశమనమైతే దొరకలేదు.

దీనికి సెక్షన్ 17ఏ వర్తించదు: రోహత్గీ

ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ... స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసుకి పీసీ చట్టం సెక్షన్ 17ఏ వర్తించదని స్పష్టం చేశారు. జులై 2018లో చట్ట సవరణతో సెక్షన్ 17ఏ చేర్చారని, ఎఫ్ఐఆర్ 2021 నాటిదైనా దర్యాప్తు చట్ట సవరణ కన్నా ముందుగానే ప్రారంభమైందని ధర్మాసనానికి తెలియజేశారు. 2018 కన్నా ముందుగా విచారణ ప్రారంభించినట్లు సంబంధిత పత్రాలు ఏమైనా ఉన్నాయా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆయా పత్రాలు సమర్పిస్తామని రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. కేసు దర్యాప్తు చట్ట సవరణ కన్నా ముందుగానే ప్రారంభమైందని, కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ కేసును పరిశీలించిందని తెలిపారు. ఇలాంటప్పుడు రాజకీయ కక్ష అని ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. ''నేరం జరిగింది 2015–16లో. దర్యాప్తు కూడా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు కాకముందే మొదలైంది. అలాంటపుడు రాజకీయ కక్ష అనడం సబబు కాదు కదా?'' అని దని రోహత్గి చెప్పారు. హైకోర్టుకు డాక్యుమెంట్లు అన్నీ సమర్పించారా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉందని, ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తునకు సంబంధించిన అన్ని పత్రాలు సమర్పిస్తామని రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. తదుపరి విచారణకు సంబంధించి పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయని, విచారణ సోమవారానికి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. అప్పుడే ఈ పిటిషన్ విచారణకు తీసుకోవాలా వద్దా అనేది నిర్ణయిస్తామని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని, విచారణకు సీఐడీ కస్టడీ కోరుతున్నారని అదే కష్టంగా ఉందని లూత్రా కోర్టుకు తెలిపారు. పదిహేను రోజుల గడిచిన తర్వాత కూడా కస్టడీ కోరటం సరికాదని సిద్ధార్థ లూత్రా ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. బెయిలుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించిన ధర్మాసనం... విచారణ సోమవారం చేపడతామని స్పష్టం చేసింది.

చంద్రబాబు తరఫున ఎందరు వాదిస్తారు?: సుప్రీం

స్కిల్ కుంభకోణానికి సంబంధించి తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన క్రిమినల్ ఎస్సెల్పీని మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీతో కూడిన ధర్మాసనం విచారించింది. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు ప్రారంభిస్తూ... పీసీ యాక్టులోని సెక్షన్ 17ఏను హైకోర్టు తప్పుగా అర్థం చేసుకుందన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రతినిధులు అధికార విధులు నిర్వర్తించడంలో చేసే చర్యలకు సంబంధించినదిగా చూడాలన్నారు. ''2018 జులై కన్నా ముందు జరిగిన నేరాలకు ఈ సెక్షన్ వర్తించదని హైకోర్టు న్యాయమూర్తి చెప్పడం సరికాదు. ఎందుకంటే ఈ సెక్షన్ నేరం ఎప్పుడు జరిగిందనే అంశానికి సంబంధించినది కాదు. ఓ ప్రక్రియకు సంబంధించినది, విచారణ తేదీకి సంబంధించినది'' అని వాదన వినిపించారు. అందుకోసమే తమ క్లయింట్‌కు ఈ రక్షణ కావాలని కోర్టును కోరుతున్నామని సాల్వే చెప్పారు. కేసు విచారణ 2021, సెప్టెంబరు 7న ప్రారంభమైనట్లుగా అడిషనల్ డీజీపీ రాసిన లేఖ చెబుతోందన్నారు. కాబట్టి ఈ కేసులో సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి ఆమోదం లేకుండా విచారణ చేయొచ్చా? అని సందేహం వ్యక్తంచేశారు. ఈ దశలో జస్టిస్ అనిరుద్ధ బోస్ జోక్యం చేసుకొని 'అంటే విచారణ ప్రారంభమైన తేదీని పరిగణించాలన్నది మీ ఉద్దేశమా?' అని సాల్వేను ప్రశ్నించారు. చట్టం తీసుకొచ్చిన వాళ్లు చెప్పింద దేనని సాల్వే బదులిచ్చారు. ''చంద్రబాబును అరెస్టు చేసిన విధానం సరికాదని హైకోర్టుకు కూడా తెలిపాం. కానీ మా వాదన అంగీకరించలేదు. గవర్నర్ అనుమతి లేకుండా అరెస్టు చేయడం సరికాదు. మంత్రి మండలి అనుమతితోనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఆనాడు చంద్రబాబు సూచనలతోనే ఎక్స్ అఫిషియో నియామకాలు జరిగాయని అభియోగాలు మోపారు'' అని సాల్వే పేర్కొన్నారు.

చంద్రబాబు తరఫు మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. యశ్వంత్ సిన్హా వర్సెస్ సీబీఐ కేసు ప్రస్తావించారు. సెక్షన్ 17ఏ ప్రకారం దర్యాప్తునకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జస్టిస్ కేఎం జోసెఫ్ తీర్పులో ఉందన్నారు. దీన్ని బట్టి చూస్తే 2018 చట్టసవరణ కన్నా ముందువాటికి కూడా సెక్షన్ 17ఏ వర్తిస్తుందన్నారు. ఇంతలో చంద్రబాబు తరఫున మరో న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా లేచి... యశ్వంత్ సిన్హా కేసును ఉటంకిస్తూ 'రఫేల్ డీల్ 2015–16 నాటిది. ఇది 2018 నాటి చట్టసవరణ కన్నా ముందుదే'' అని చెప్పారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... చంద్రబాబు తరఫున ఎంత మంది సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తారని చమత్కరించింది. నలుగురం వాదిస్తున్నామని, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తున్నారని హరీశ్ సాల్వే చెప్పారు. ఈ దశలో ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ... వాళ్లే ఒకరి తర్వాత ఒకరు వాదనలు వినిపిస్తున్నారని తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని. పిటిషనర్ తరఫున ఎవరో ఒకరే వాదనలు చేయాలని పేర్కొన్నారు. అయితే కింది కోర్టుల్లో ఒక సీనియర్ మించి వాదించే అవకాశం లేదు కానీ సుప్రీంకోర్టు ఆ ప్రత్యేక హక్కు కల్పించిందని జస్టిస్ బేలా ఎం త్రివేది పేర్కొన్నారు.



ఈ దశలో కేసు మెరిట్స్ జోలికి వెళ్లం: సుప్రీం

రిమాండు రిపోర్టు ప్రకారం లావాదేవీలు 2015–19 నాటివని, అంటే 2018 చట్ట సవరణ తర్వాతకూడా ఓ ఏడాది ఉంది కాబట్టి నిందితుడికి చట్టప్రకారం రక్షణ తప్పనిసరి అని సింఘ్వీ పేర్కొన్నారు. చట్ట సవరణ చేసింది నిర్దిష్ట రక్షణ కోసమేనని తెలిపారు. కేబినెట్ నిర్ణయం అని హైకోర్టు జడ్జి పేర్కొన్నారంటే ఇది అధికారిక విధులకు సంబంధించినదే కదా? అన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకొని.. ఈ దశలో కేసు మెరిట్స్ జోలికి వెళ్లే ఉద్దేశం లేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ తర్వాత ఎఫ్ఐఆర్‌తో ఇబ్బందిపెడుతోందని, ఇది రాజకీయ కక్షసాధింపేనని లూత్రా పేర్కొన్నారు. ''అసలు ప్రశ్న ఏంటంటే సెక్షన్ 17ఏ పీసీ యాక్టుకు మాత్రమే వర్తిస్తుందా లేక ఐపీసీకి కూడా వరిస్తుందా?'' అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. దీంతో పీసీ యాక్టు సెక్షన్ 17ఏ ను సింఘ్వీ చదువుతూ 'ఎనీ అఫెన్స్' అని ఉంది కనక పీసీ యాక్టుకు, ఐపీసీ నేరాలకు తేడా ఏమీ ఉండదని ధర్మాసనానికి చెప్పారు. సీఆర్‌పీసీ కోడ్ ప్రకారం సెక్షన్ 17ఏ సవరణ పాటించాలని లేదు కదా? అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. పీసీ యాక్టు చూడాలని మరోసారి సింఘ్వీ పేర్కొనగా.. ఎఫ్ఐఆర్‌లో పీసీతోపాటు ఐపీసీ కూడా ఉందిగా? అని జస్టిస్ త్రివేదీ తిరిగి ప్రశ్నించారు. 'సెక్షన్ 17ఏ కేవలం పీసీ చట్టానికే వర్తిస్తుంది. మరి ఐపీసీ కింద నమోదైన కేసుల పరిస్థితి ఏంటి?'' అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించగా.. ఏ కేసుకైనా వర్తిస్తుందని సాల్వే పేర్కొన్నారు. చట్ట ప్రకారం సదరు వ్యక్తికి ఉన్న స్థాయిని మాత్రమే పరిగణిస్తున్నామని జస్టిస్ అనిరుద్ధ బోస్ పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు పరిశీలించాల్సింది ఒకే ఒక అంశమని, ఐపీసీ కింద నమోదైన కేసులకు 17ఏ సవరణ వర్తిస్తుందా లేదా అనేది మాత్రమే అని జస్టిస్ బేలా ఎం త్రివేది వ్యాఖ్యానించారు.

ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘం విధి విధానాలు ఖరారు

- గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు పన్నులు పంపిణీపై సిఫార్సు
- పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితి మెరుగుకు సూచనలు
- రాబడి, వ్యయాల మధ్య అంతరాలను తగ్గించేందుకు సూచనలు
- వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా నివేదిక ఇవ్వాలి
- ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘం విధి విధానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు పన్నులు పంపిణీతో పాటు ఆ సంస్థల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు సూచనలు, సిఫార్సులు చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, నగర పంచాయతీలు,మున్సిపల్ కార్పొరేషన్లకు పన్నులు, ఫీజులు ఎంత మేర పంపిణీ చేయాలో సిఫార్సు చేయాలి. రాష్ట్ర సంచిత నిధి నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ పంపిణీని కూడా సిఫార్సు చేయాలి. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు అందుబాటులో ఉన్న వనరులను మెరుగ్గా నిర్వహించడం ద్వారా ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులు మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలి. సంస్థలు సొంత వనరుల ద్వారా పౌర సేవలందించడంపై అధ్యయనం చేయాలి.

గవర్నర్ సూచించిన అంశంపై తగిన సిఫార్సులు చేయాలి

పంచాయతీలు, మున్సిపాలిటీ సంస్థల ఆర్థిక పరిస్థితులపై గవర్నర్ ఏదైనా అంశాన్ని సూచిస్తే ఆ అంశంపై తగిన సిఫార్సులు చేయాలి. స్థానిక సంస్థల అప్పులు అధ్యయనం చేసి రాబడి, వ్యయం మధ్య అంతరాన్ని తగ్గించడంతో పాటు ఆస్తుల కల్పనకు అవసరమైన మిగులు నిధులు ఉండేలా సిఫార్సులు చేయాలి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు స్థానిక సంస్థలు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించేందుకు తగిన సిఫార్సులు చేయాలి. స్థానిక సంస్థల విధుల్లో జవాబుదారీతనం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలి. స్థానిక సంస్థల సిబ్బంది, పాలన నిర్వహణకు అయ్యే ప్రణాళికేతర వ్యయాన్ని రహదారులు, నీటి సరఫరా, చిన్న నీటి వనరుల వంటి ఆస్తుల కల్పనకు ప్రణాళిక వ్యయాన్ని అంచనా వేయాలి. ఆస్తుల నిర్వహణ వ్యయాన్ని అంచనా వేసి సిఫార్సు చేయాలి. సంస్థల అకౌంట్స్‌ను కంప్యూటరీకరణ అవకాశాలను పరిశీలన చేయాలి. 2025 మార్చి 31 నాటికి సంస్థలు ఆస్తులు, అప్పులను అంచనా వేసి, అప్పులను తగ్గించడానికి తగిన సిఫార్సులు చేయాలి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి. గవర్నర్ కోరితే మధ్యంతర నివేదికను ఇవ్వాలి. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా నివేదిక ఇవ్వాలి.

అవ్వా తాతలకు 'ఆత్మీయుడి' అండ


రాష్ట్రంలో వయోవృద్ధులకు భరోసా ఇస్తున్న సీఎం వైఎస్ జగన్

- 41.05 లక్షల మందికి వృద్ధాప్య పింఛన్లు
- ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్స్‌కి 25 శాతం రాయితీ
- ఏడు ఫిజియోథెరపీ సెంటర్లు.. రెండు వృద్ధాశ్రమాలు
- సమస్యల పరిష్కారానికి ఎల్డర్ లైన్ 14567

సాక్షి, అమరావతి: జీవితంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని, పిల్లల కోసం ఎంతో కష్టపడి వయస్సు మీద పడిన వృద్ధులకు కావాల్సింది ఓ ఆత్మీయ పలకరింపు. అవ్వా బాగున్నావా.. తాతా బాగున్నావా.. అంటూ మలి సంధ్యలో ఉన్న వారి అవసరాలను తీరిస్తే వారికి అదే ఆనందం. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలోని వయో వృద్ధులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వమే పెద్ద భరోసా అన్నట్లుగా వారికి అవసరమైన అన్ని వసరులు సమకూరుస్తున్నారు. అవ్వా.. తాతా.. అంటూ ఆత్మీయతను అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల నుంచి వైద్యం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. సంక్షేమంతో పాటు భద్రత, హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

గతంలోలా వృద్ధులు పింఛను కోసం మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఎవరెవరినో బతిమాలుకోవాల్సిన పని లేకుండా వారు ఉన్న చోటుకే వచ్చి పింఛను డబ్బు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు సీఎం వైఎస్ జగన్. గతంలో వృద్ధులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక, సొమ్మసిల్లి పడిపోయిన సందర్భాలు అనేకం. సీఎం జగన్ ఆ కష్టాల నుంచి అవ్వా తాతలను గట్టెక్కించారు. ఇప్పుడు వలంటీర్లు స్వయంగా వారు ఉన్న చోటుకు వచ్చి పింఛను డబ్బు అందిస్తున్నారు. వైద్యం కోసం ఆస్పత్రుల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్యులే గ్రామాలకు వచ్చి, పరీక్షలు చేసి, మందులు కూడా ఇస్తున్నారు.

సామాజిక భద్రతలో భాగంగా నెలకు రూ.2,750 చొప్పున వృద్ధాప్య పింఛన్లు అందిస్తోంది. గతంలో వృద్ధాప్య పింఛన్ 65 ఏళ్ల వయోపరిమితి ఉంటే దాన్ని 60 ఏళ్లకే కుదించి ఎక్కువ మందికి వైఎస్సార్ పెన్సన్ కానుక అందిస్తోంది. వృద్ధాప్య, ఇతరత్రా పింఛన్లతో మొత్తం 41,05,501 మంది వృద్ధులు లబ్ధి పొందుతున్నారు. ఏడాదికి సగటున రూ.13,260.41 కోట్లు వృద్ధులకు పింఛన్ రూపంలో ప్రభుత్వం అందిస్తోంది.



- ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ చార్జీపై 25 శాతం రాయితీ ఇస్తోంది. బస్సుల్లో ముందు డోర్ సమీపంలోని మూడు సీట్లు వృద్ధుల కోసం కేటాయించింది. బస్టాండ్లలో వీల్‌చైర్లు అందుబాటులో ఉంచింది. వృద్ధుల కోసం మచిలీపట్నం, చిత్తూరులో రాష్ట్ర ప్రభుత్వం 2 వృద్ధాశ్రమాలను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవోలు) 68 వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నాయి. శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, కర్నూలు, వైఎస్సార్, తిరుపతి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 7 ఫిజియోథెరపీ కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 47,490 మంది వృద్ధులు వీటిని ఉపయోగించుకున్నారు.
- వృద్ధుల సమస్యలు, అవసరాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టేందుకు 2021 డిసెంబర్ నుంచి ఎల్డర్ లైన్ 14567 (హెల్ప్‌లైన్) నిర్వహిస్తోంది. 26 జిల్లాల నుంచి 39,332 మంది దీని సేవలు ఉపయోగించుకున్నారు.

సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 50,08,662 మంది వృద్ధులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వృద్ధుల సంక్షేమంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. మలి సంధ్యలో ఎవరూ అవస్థలు పడకూడదనే ఉద్దేశంతో వారి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. వయోవృద్ధుల సమస్యలు, అవసరాలు గుర్తించి సకాలంలో చర్యలు తీసుకునేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. – బి.రవిప్రకాశ్‌రెడ్డి,
సంచాలకులు, రాష్ట్ర వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ

5న వయో వృద్ధుల రాష్ట్ర కౌన్సిల్ తొలి సమావేశం

ఏపీ వయో వృద్ధుల రాష్ట్ర కౌన్సిల్ తొలి సమావేశం అక్టోబర్ 5న నిర్వహించనున్నారు. మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అధ్యక్షతన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో తొలి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ట్రిబ్యునల్స్, అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల ఫిర్యాదుల పరిస్థితి, వారి వైద్య సంరక్షణ, జీవనం, వంటి ప్రధాన అంశాలపై ఈ సమావేశంలో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

■ తెలంగాణ

విద్యుత్ బకాయిల చెల్లింపుపై తీర్పు వాయిదా

- రూ.6,756.92 కోట్లు ఇవ్వాల్సిందే అంటున్న ఏపీ
- చెల్లింపుపై గతంలో ఇచ్చిన స్టేను పొడిగించాలన్న తెలంగాణ
- వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలన్న ఏపీ
- సీజే ధర్మాసనం వద్ద వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదంలో హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలంటూ ఏపీ.. దీనిపై ఇప్పటికే ఇచ్చిన స్టేను పొడించాలంటూ తెలంగాణ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా వాదనలు వినిపించగా.. హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తమకు తెలంగాణ నుంచి రూ.6,756.92 కోట్లు (అసలు రూ.3,441.78 కోట్లు, వడ్డీ, సర్‌చార్జీలు కలిపి మరో రూ.3,315.14 కోట్లు) రావాల్సి ఉందని ఏపీ వాదిస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఏపీకి 30 రోజుల్లోగా రూ.6,756.92 కోట్లు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న తెలంగాణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు వేశాయి. వాటిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. బకాయిల విషయంలో తెలంగాణ సర్కార్‌పై ఒత్తిడి తేవొద్దని స్టే ఇచ్చింది. ఈ వ్యవహారం ఇలా కోర్టులో ఉండగానే.. విద్యుత్ బకాయిలు తప్పకుండా చెల్లించాలని ఆదేశించినా తెలంగాణ ఇవ్వడం లేదని.. అందువల్ల రిజర్వు బ్యాంకులోని తెలంగాణ ఖాతా నుంచి సొమ్మును మినహాయించుకుని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చింది. దీనితో కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని, చెల్లింపులపై స్టేను పొడిగించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులోని ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది.

బకాయిల వల్ల ఇబ్బందుల్లో ఏపీ డిస్కమ్‌లు

తెలంగాణ బకాయిలు చెల్లించకపోవడంతో ఏపీ విద్యుత్ డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సి వచ్చిందని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పునర్విభజన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన ఈ బకాయిలకు, పునర్విభజన చట్టానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభజన తర్వాత 2017 వరకు కూడా ఏపీ డిస్కమ్‌లు తెలంగాణకు విద్యుత్ సరఫరా చేశాయన్నారు. బకాయిలు చెల్లించక బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, తెలంగాణకు విద్యుత్ నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. బకాయి ఉన్న విషయాన్ని తెలంగాణ కూడా అంగీకరిస్తోందని గుర్తు చేశారు. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకిరణ్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేంద్రం జోక్యంతోనే తెలంగాణకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందని, బకాయిల చెల్లింపుపై ఉత్తర్వులు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు రిజర్వు చేసింది.

పింఛన్ల పంపిణీ 96% పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 63,16,216 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 1740.83 కోట్ల పింఛన డబ్బులు చేరాయి. మంగళవారం సాయంత్రానికి 96.01% మందికి పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు సెర్ప్ అధికారులు తెలిపారు. మిగిలిన వారి కోసం బుధ, గురువారాల్లో వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.


నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న బాలాజీనగర్‌కు చెందిన గంగయ్యకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ కళావతి


విజయవాడ రామలింగేశ్వర నగర్‌లో దుర్గాదేవికి దివ్యాంగ పింఛన్ ఇస్తున్న వలంటీర్ ప్రియదర్శిని, సచివాలయం కన్వీనర్ కాము


ఏలూరులో జంతల లక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎస్.లక్ష్మీ రమాదేవి


ఏలేశ్వరానికి చెందిన చిట్టిరాజుల గిరికి పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ అశోక్



ఫైబర్ గ్రిడ్ కేసులో లోకేశ్ పిటిషన్ మూసివేత

- సీఐడీ తరఫున ఏజీ చెప్పిన వివరాలను రికార్డ్ చేసిన హైకోర్టు
- ముందస్తు బెయిల్‌పై తదుపరి విచారణ అవసరం లేదన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: ఏపీ ఫైబర్ గ్రిడ్ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ నారా లోకేశ్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు మూసివేసింది. ఈ కేసులో లోకేష్ ఇప్పటివరకు నిందితుల జాబితాలో లేరని, ఒకవేళ నిందితుడిగా చేర్చాలని నిర్ణయిస్తే చట్ట ప్రకారం ఆయనకు సీఆర్‌పీసీ సెక్షన్ 41 ఏ కింద నోటీసులిస్తామని హైకోర్టుకు సీఐడీ తెలిపింది. సెక్షన్ 41ఏ (3), (4)లను అనుసరించి ముందుకు వెళతామని పేర్కొంది. ఈ వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు దీనిపై తదుపరి విచారణ అవసరం లేదని, అందువల్ల వ్యాజ్యాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు లోకేశ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. లోకేశ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుబ్రమణియం గురు కృష్ణకుమార్ వాదనలు వినిపించారు. అంతకు ముందు సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుబ్రమణియం శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ లోకేశ్‌ను ఇప్పటి వరకు నిందితుడిగా చేర్చలేదన్నారు. ఈ రోజు వరకు అరెస్ట్ విషయంలో ఆయనకు ఎలాంటి భయం అవసరం లేదన్నారు. నిందితుడే కాని వ్యక్తి ముందస్తు బెయిల్ పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని హైకోర్టుకు నివేదించారు. ఫైబర్ గ్రిడ్ కేసులో లోకేష్‌ను విచారించాలనుకుంటే సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేస్తామన్నారు. ఒకవేళ సెక్షన్ 41ఏను ఉల్లంఘిస్తే అప్పుడు లోకేశ్‌ను అరెస్ట్ చేయవచ్చని, తమకు ఆ మేరకు చట్టం అవకాశం కల్పిస్తోందని చెప్పారు. 41ఏ నోటీసు పేరుతో లోకేశ్ ముందస్తు బెయిల్ కోరుతున్నారని, ఈ దశలో హైకోర్టు సీఆర్‌పీసీ సెక్షన్ 438 కింద తనకున్న పరిధిని ఉపయోగించడానికి వీల్లేదన్నారు. అరెస్ట్ చేస్తారన్నది కేవలం భయాందోళన మాత్రమేనని, ముందస్తు బెయిల్ మంజూరుకు అది కారణం కాకూడదన్నారు.

ఓటర్ల పేర్లు తీసేయడం సులభం కాదు

అందుకు ఓ నిర్దిష్టమైన విధానం ఉంది

హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితా నుంచి ఫలానా వ్యక్తుల పేర్లను తీసేయాలంటూ దరఖాస్తులు రాగానే.. ఆటోమేటిక్‌గా వారి పేర్లను తొలగించడం సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మంగళవారం హైకోర్టుకు నివేదించింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించేందుకు నిర్దిష్ట విధానం ఉందని సీఈసీ తరఫు న్యాయవాది డీఎస్ శివదర్శన్ హైకోర్టుకు వివరించారు. ఓటర్ల తొలగింపు విషయంలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినప్పుడు వాటిపై నిర్ణయం తీసుకోవడానికి త్రిసభ్య కమిటీ ఉంటుందన్నారు. అసలు దరఖాస్తులు పెట్టిన వ్యక్తులు ఎవరు? వారి చిరునామాలు, ఫోన్ నంబర్లను కూడా తెలుసుకుంటామన్నారు. పిటిషనర్ ఆరోపిస్తున్నంత సులభంగా ఓటర్ల తొలగింపు ఉండదని పునరుద్ఘాటించారు. ఓటర్ల తొలగింపు విషయంలో తమకొచ్చిన దరఖాస్తులు తప్పుడువని తేలితే, అలా దరఖాస్తు చేసిన వారిపై ఎఫ్ఐఆర్‌ల నమోదుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అన్నింటికంటే ముఖ్యంగా ఎవరి పేర్లయితే ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని కోరుతున్నారో అలా తొలగించే వ్యక్తులకు ముందుగా నోటీసులు ఇచ్చి వారి వివరణ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆకాశ రామన్న ఉత్తరాలు రాగానే ఓటర్ల పేర్లు తొలగించామనడం సరికాదన్నారు.

పర్చూరు ఎమ్మెల్యే పిటిషన్ నేపథ్యంలో..

పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఏకపక్షంగా ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని, దీనిపై ఎన్నికల సంఘం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను, నిబంధనలను అమలు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఓటర్లను జాబితా నుంచి తీసేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను పోలీసులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. అసలు ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించేందుకు సాధారణంగా అమల్లో ఉన్న విధానం ఏమిటని ప్రశ్నించింది. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది శివదర్శన్ స్పందిస్తూ.. పూర్తి విధానాన్ని వివరించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను కూడా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ వాదనలను విన్న ధర్మాసనం వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని శివదర్శన్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

టీడీపీ దుశ్శాసన పార్టీ

▶ మొదటి పేజీ తరువాయి

అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పైగా.. అతని వ్యాఖ్యలను సమర్థిస్తూ.. ఆయన అరెస్టును తెలుగుదేశం పార్టీ నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తోంది. మహిళలంటే టీడీపీకి ఇంత చిన్నచూపా అని మహిళా లోకం ప్రశ్నిస్తోంది. ఇంతలా స్త్రీలను కించపరుస్తున్న ఆ పార్టీ నేతలను కట్టడి చేయకుండా ఇంకా ప్రోత్సహించేలా వ్యవహరించడం ఏమిటని నిలదీస్తోంది. ఈ నేపథ్యంలో.. తనకు ఎదురైన అవమానంపై మంత్రి రోజా మంగళవారం తిరుపతి మీడియా సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అసత్య ఆరోపణలు, విమర్శలతో మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న టీడీపీ దుశ్శాసన పార్టీ అని ఆమె ఘాటుగా విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహిళా లోకాన్నే అవమానించేలా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యక్తిగత విమర్శలపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు.


బండారు తనపై చేసిన వ్యాఖ్యలను మీడియాకు వినిపిస్తున్న మంత్రి రోజా

తాను టీడీపీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచి వేధిస్తున్నారంటూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

బ్లూ ఫిలిమ్స్‌లో నటించింది అంటూ నన్ను టార్చర్ చేస్తున్నారు.. అసెంబ్లీలో సీడీలను కూడా చూపించారు.. కానీ, ఎప్పుడూ నిరూపించలేదు. మహిళలు నచ్చినట్లు బతకమని సుప్రీంకోర్టే చెప్పింది. మీరెవరు నా క్యారెక్టర్‌ను జడ్జ్ చేయడానికి? మహిళల్ని టీడీపీ ఆట వస్తువుల్లా చూస్తోంది. దమ్ముంటే సీడీలను ప్రజల్లోకి విడుదల చేయాలి. నాపై బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు సమర్థించడం సరికాదు. లోకేశ్‌తో పాటు ఇతర టీడీపీ నేతలు సత్యనారాయణ అరెస్టును ఖండించారు. వారి తల్లులు, భార్యలు, కూతుళ్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైతే ఇలాగే చేస్తారా? మహిళపై అభ్యంతరకర ఆరోపణలు చేస్తే బండారు కుటుంబం, టీడీపీ ఖండించకుండా ఆయనకు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు. ఎన్టీయార్‌కు అన్నం కూడా పెట్టని వాళ్లు ఈరోజు మాట్లాడుతున్నారు. లోకేశ్ ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం బ్రాహ్మణి మానుకుని జగనన్న చేస్తున్న అభివృద్ధిని స్వాగతించాలి.

మహిళలంటే టీడీపీలో చిన్నచూపు..

టీడీపీ అంటే దండుపాళ్యం పార్టీ.. తెలుగు దొంగల పార్టీ, తెలుగు దుశ్శాసన పార్టీ. ఆడ పుట్టుకను అపహాస్యం చేసిన వ్యక్తి ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడు.. ఆడపిల్ల కనిపిస్తే ముద్దుపెట్టాలి అని చెప్పిన వ్యక్తి ఆ పార్టీ ఎమ్మెల్యే.. మహిళలంటే అంత చిన్నచూపు చూసే టీడీపీలో మహిళలంటే ఎలా గౌరవం ఉంటుంది? మహిళలు రాజకీయాల్లోకి రావటమే తప్పు అన్నట్లు దండుపాళ్యం నేతలు ఒళ్లు బలిసి విమర్శలు చేస్తున్నారు. రాజకీయాల్లో 20 ఏళ్లుగా ఉన్నా.. మహిళా సాధికారికతకు పాటుపడుతున్నా. మహిళలను కానీ, మా నాయకుడు జగనన్నను కాని విమర్శిస్తే ఊరుకోను. ఇలాంటి దిగజారుడు విమర్శలతో తన గొంతు నొక్కాలని ప్రయత్నించినా ఊరుకోను. బండారును వదిలిపెట్టేది లేదు. అతనిపై పరువు నష్టం దావావేసి న్యాయపోరాటం చేస్తా. ఇక నగరి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా నా పనితీరుపై చర్చకు రావాలి. ధమ్ముంటే నా నియోజకవర్గానికి వచ్చి అభివృద్ధి చూడండి. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే చెప్పండి. అంతేగానీ.. చేతకాని దద్దమ్మల్లాగా ఆడవాళ్ల వ్యక్తిత్వ హననానికి పాల్పడొద్దు.

మానవమృగం బండారు ఆకృత్యాలను సమర్థిస్తారా?

జాతీయ మీడియాను ప్రశ్నిస్తూ రోజా 'ఎక్స్'లో పోస్ట్

పురుషాధిక్య ప్రపంచంలో మహిళల అణచివేతకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం పోరాడుతున్న తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా దారుణమైన వ్యాఖ్యలు చేసిన మానవమృగం టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి బండారు సత్యనారాయణను సమర్థిస్తారా? అంటూ జాతీయ మీడియాను ప్రశ్నిస్తూ మంత్రి ఆర్కే రోజా మంగళవారం 'ఎక్స్'లో (ట్వీట్) పోస్టు చేశారు. 'ఎందుకు మౌనంగా ఉన్నారు? మహిళలను కించపరిచిన మానవమృగం బండారును ఎందుకు ప్రశ్నించరు?'.. అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. బండారు వంటి పురుషాహంకారం కలిగిన వారు, వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలలుగనే ప్రతి అమ్మాయి స్వప్నం సాకారం కాకుండా దెబ్బతీస్తారని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పోస్టును ఆమె ఇండియా టీవీ, ఎన్డీటీవీ, సీఎన్ఎన్ న్యూస్18, రిపబ్లిక్ టీవీ ఛానళ్లను ట్యాగ్ చేశారు. 'అన్ని రంగాల్లో మహిళలు ప్రగతిపథంలో దూసుకెళ్తున్నా బండారు సత్యనారాయణ వంటి కొంతమంది మానవమృగాల మధ్యయుగం నాటి ఆలోచనలు మారలేదు. నా వ్యక్తిత్వంపై పాశవికంగా దాడిచేస్తూ.. నన్ను కించపరుస్తూ అత్యంత దారుణమైన నిరాధారమైన ఆరోపణలు నాపై చేశారు'.. అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

10న సీఐడీ ముందుకు లోకేశ్

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాదిని అనుమతించాలని నిర్దేశించింది. విచారణకు వచ్చేటప్పుడు నిర్దిష్ట డాక్యుమెంట్లు తీసుకురావాలని లోకేశ్‌ను ఒత్తిడి చేయబోమని సీఐడీ చెప్పిన విషయాన్ని హైకోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలు, దీన్ని అడ్డం పెట్టుకుని సాగించిన భూదోపిడీ కేసులో నారా లోకేశ్‌ను 14 నిందితుడిగా సీఐడీ చేర్చింది. ఈ కేసు విచారణ నిమిత్తం ఈ నెల 4న తమ ముందు హాజరు కావాలంటూ ఇటీవల సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. విచారణకు వచ్చే సమయంలో హెరిటేజ్ భూముల కొనుగోలుకు సంబంధించిన డాక్యుమెంట్లను తేవాలని పేర్కొంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లోకేశ్ మంగళవారం అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోకేశ్ తరఫున టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ హెరిటేజ్‌లో లోకేశ్ ఓ వాటాదారు మాత్రమేనన్నారు. హెరిటేజ్‌కు సంబంధించిన కీలక విషయాలు ఆయనకు తెలిసే అవకాశం లేదన్నారు. ఆ డాక్యుమెంట్లను ఇవ్వలేదన్న కారణంతో లోకేశ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. విచారణ సమయంలో న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీఐడీ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ పీపీ శివ కల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ నిర్దిష్టంగా ఫలానా డాక్యుమెంట్లు తేవాలని ఒత్తిడి చేయబోమన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఇతర నిందితులతో కలిపి లోకేశ్‌ను కూడా విచారించాల్సి ఉందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 10న సీఐడీ ముందు హాజరు కావాలని లోకేశ్‌ను ఆదేశిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రింగ్ రోడ్డు కేసులో బాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, తదనుగుణంగా సాగిన భూ దోపిడీపై సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన వివరాలన్నీ ఆయా ఫైళ్లలో భద్రంగా ఉన్నాయన్నారు. అందువల్ల సాక్ష్యాలను తారుమారు చేస్తారన్న ప్రశ్నే తలెత్తదన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణమే జరగనప్పుడు అవకతవకలకు ఆస్కారం ఎక్కడ ఉందన్నారు. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ చంద్రబాబు మరో కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు కాబట్టి ఈ కేసులో కూడా ఆయన అరెస్టయినట్లు (డీమ్డ్) భావించాలన్న పిటిషనర్ తరఫు న్యాయవాదుల వాదన సరికాదన్నారు. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసే ముందు సరెండ‌ర్ పిటిషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆ పని చేయకుండా డీమ్డ్ అరెస్ట్ పేరుతో నేరుగా బెయిల్ పిటిషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. ఈ వ్యాజ్యానికి అసలు విచారణార్హతే లేదన్నారు. చంద్రబాబు పిటిషన్‌ను కొట్టి వేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

41 ఏ నోటీసును రద్దు చేయండి

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద సీఐడీ తనకు జారీ చేసిన నోటీసును రద్దు చేయాలని కోరుతూ ఈ కేసులో నిందితుడైన మాజీ మంత్రి పొంగూరు నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ తన వాంగ్మూలాలను నమోదు చేయడం తప్పనిసరి అని దర్యాప్తు అధికారి భావిస్తే తన ఇంటి వద్దనే విచారించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. విచారణ సమయంలో న్యాయవాదిని సైతం అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తాను వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, పలు మేజర్ సర్జరీలు కూడా జరిగాయని పిటిషన్‌లో నారాయణ పేర్కొన్నారు. డాక్టర్లు తనను ఇంటి వద్దే ఉండాలని సలహా ఇచ్చారన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం విచారణ జరిపే అవకాశం ఉంది.

సీఎం జగన్, మంత్రి రోజాలను దూషించిన కేసులో

బండారుకు బెయిల్

- అంతకుముందు గుంటూరు జీజీహెచ్‌లో వైద్యపరీక్షలు
- ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రిలో ఉంచాలని కోరిన బండారు
- ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని నిర్ధారించిన ఆస్పత్రి సూపరింటెండెంట్.. అనంతరం కోర్టుకు తరలింపు
- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన కోర్టు


బండారు సత్యనారాయణను గుంటూరు జిల్లా కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

గుంటూరు లీగల్/గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైన, మంత్రి రోజా పైన అనుచిత వ్యాఖ్యలు చేసి, దూషించిన కేసులో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మంగళవారం గుంటూరు మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో విశాఖపట్నం సమీపంలోని వెన్నలపాలెంలో సోమవారం రాత్రి అరెస్టు చేసిన బండారు సత్యనారాయణమూర్తిని పోలీసులు మంగళవారం ఉదయం గుంటూరు నగరంపాలెం స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు వచ్చిన టీడీపీ నేతలు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సత్యనారాయణమూర్తిని కలిసేందుకు విశాఖపట్నానికి చెందిన న్యాయవాదులు పి.ఎస్.నాయుడు, బి.వి.రమణ, గుంటూరు న్యాయవాది ముప్పాళ్ల రవిశంకర్, టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఒక ఎస్ఐ తన తండ్రిపై ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సత్యనారాయణమూర్తిని పోలీసులు బందోబస్తు మధ్య మధ్యాహ్నం జీజీహెచ్‌కు తరలించారు. ఆయనకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. తనకు అనారోగ్యంగా ఉన్నందున ఆస్పత్రిలోనే ఉంచాలని సత్యనారాయణమూర్తి కోరారు. వైద్యపరీక్షల అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ నిర్ధారించారు. తరువాత సత్యనారాయణమూర్తిని పోలీసులు కోర్టుకు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ వాదనలు వినిపిస్తూ.. సెక్షన్లు బెయిల్ ఇవ్వదగినవి అయినప్పటికీ నేర తీవ్రతను, వ్యక్తి చరిత్రను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి జి.స్రవంతి.. బండారు సత్యనారాయణమూర్తిని రూ.25 వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

చట్టప్రకారమే వ్యవహరించాం..

సీఎం జగన్, మంత్రి రోజాలపై అసభ్య, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేసుల్లో టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తిని అరెస్ట్ చేసే విషయంలో చట్టప్రకారమే వ్యవహరించామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. తన సోదరుడు సత్యనారాయణమూర్తిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ బండారు సింహాద్రిరావు హైకోర్టులో సోమవారం హౌస్‌మోషన్ రూపంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. సత్యనారాయణమూర్తిపై గుంటూరు అరండల్‌పేట, నగరంపాలెం స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. నగరంపాలెం స్టేషన్‌లో నమోదైన కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద సత్యనారాయణమూర్తికి నోటీసులు ఇవ్వలేదన్నారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నోటీసు జారీచేస్తే.. దాన్ని తీసుకోవడానికి సత్యనారాయణమూర్తి నిరాకరించారని, దీంతో చట్ట నిబంధనల మేరకు ఆయన్ని అరెస్ట్ చేశామని వివరించారు. ఒకవైపు నోటీసు తీసుకోవడానికి నిరాకరించి, మరోవైపు హైకోర్టులో నోటీసు తీసుకున్నట్లు చెబుతున్నారని, ఇది కోర్టును తప్పుదోవ పట్టించడమేనని తెలిపారు. 41ఏ నోటీసును తీసుకున్నట్లు పెట్టిన సంతకం సత్యనారాయణమూర్తిది కాదన్నారు. అరెస్ట్ తరువాత సత్యనారాయణమూర్తిని గుంటూరు కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. పిటిషనర్ న్యాయవాది వి.వి.సతీష్ వాదనలు వినిపిస్తూ.. 41ఏ నోటీసు ఇచ్చి దానిపై పోలీసులు సంతకం కూడా తీసుకున్నారని తెలిపారు. 41ఏ నోటీసు ఇచ్చి విచారణకు రావాలని చెప్పి, ఆ వెంటనే అరెస్ట్ చేశారన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సత్యనారాయణమూర్తి అరెస్ట్ విషయంలో చట్టనిబంధనలను పాటించలేదని తేలితే దర్యాప్తు అధికారిపై చర్యలుంటాయని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణ ఈ నెల 5కి వాయిదా వేసింది.

తెలంగాణ

కేసీఆర్ వస్తే.. వద్దన్నాం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మంగళవారం ఆయన నిజామాబాద్‌లోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో జరిగిన బీజేపీ 'ఇందూరు ప్రజాగర్జన' బహిరంగ సభలో ప్రసంగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నుంచి 48 మంది కార్పొరేటర్లు గెలిచాక.. మా సపోర్ట్ కోసం ఎన్డీయేలో చేరతామంటూ సీఎం కేసీఆర్ తనను కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. కానీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, ఎన్డీయేలోకి రాకను నిరాకరించానని చెప్పారు. ఈ సభలో మోదీ ఇంకా ఏమన్నారంటే..

బీఆర్ఎస్, కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు

- నేను బీఆర్ఎస్ అవినీతి గురించి ప్రశ్నించాను. అప్పటి నుంచి దూరంగా వెళ్లిపోవడం మొదలుపెట్టారు. రాష్ట్రంలో అవినీతికి పాల్పడటం,


ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ప్రజలను పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. అందుకే ఈసారి బీఆర్ఎస్ ఓటమి తథ్యం. బీఆర్ఎస్, కిలాడీ కాంగ్రెస్ రెండూ ఒకటే. ఈ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉంది. ప్రజలు ఈ పార్టీల హామీలు నమ్మితే తర్వాత పశ్చాత్తాప పడాల్సిందే.

- బీఆర్ఎస్ ప్రభుత్వం లూటీ చేసింది. కొడుకు, బిడ్డ, అల్లుడు, మరో కొడుకు, అత్తింటి వారు.. ఇలా అంతా తెలంగాణను లూటీ చేస్తున్నారు. కొడుకు, అల్లుడు కలసి భారీ అవినీతికి పాల్పడుతున్నారు. తెలంగాణలో ఆ ఒక్క కుటుంబమే బాగుపడింది.
- దక్షిణ భారతానికి అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ. అలాంటి వారిని దక్షిణాది అక్కున చేర్చుకుంటుందా? తమిళనాడు ప్రభుత్వం ఆలయాలను కబ్జా చేసింది. కానీ మైనారిటీల పూజా స్థలాలపై మాత్రం చేయి పెట్టే సాహసం చేయలేదు.
- నిజామాబాద్‌లో మొత్తం రూ.8,021 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నిజాం పాలనలోని హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం రాలేదు. నిజాంలను తరిమికొట్టేందుకు అందరూ భయపడ్డారు. కానీ ఓ గుజరాతీ బిడ్డ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వచ్చాకే హైదరాబాద్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు మళ్లీ ఇంకో గుజరాతీ బిడ్డ మోదీ వచ్చాడు. అతడు మీ కోసం మరో పటేల్‌లా అభివృద్ధితో ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తాడు.

కేసీఆర్ ఫైటర్.. చీటర్‌తో కలవరు

- ప్రధాని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు
- మోదీని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పచ్చి అబద్ధాలకోరు. బీజేపీ జుమ్లా, జూటా పార్టీ ఆఫ్ ఇండియా. ఆ పార్టీ ఒక వాట్సాప్ యూనివర్సిటీ. దానికి చాన్సలర్ ఆయన. కథలు చెప్పడంలో ఆరితేరిన ప్రధాని సినిమా కథలు రాసేందుకు ప్రయత్నించాలి. ఆయన నటనకు తప్పకుండా ఆస్కార్ అవార్డు వస్తుంది. ముఖ్యమంత్రితో జరిగిన అధికారిక సమావేశాలను నీచమైన రాజకీయాలకు వాడుతున్న మోదీ.. ప్రధాని పదవి స్థాయిని దిగజార్చేలా మాట్లాడుతున్నారు. నన్ను ఆశీర్వదించాలని మోదీని కేసీఆర్ కోరారట! నేను సీఎం కావడానికి ఆయన అనుమతి తీసుకోవాలా? మా పార్టీలో ఎవరు ముఖ్యమంత్రి కావాలో నిర్ణయించేది ప్రధాని కాదు.. మా పార్టీ ఎమ్మెల్యేలనే విషయం కూడా ఆయనకు తెలియదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు స్పష్టం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన బంజారాహిల్స్‌లోని వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 'ఎన్డీయేలో చేరేందుకు మాకేమైనా పిచ్చి కుక్క కరిచిందా? శివసేనతో సహా ఇప్పటికే ఎన్నో పార్టీలు ఎన్డీయే కూటమి నుంచి బయటికి వచ్చాయి. ఆ పార్టీలో ఉన్నవి ప్రస్తుతం ఈడీ, సీబీఐ, ఐటీ మాత్రమే. సీఎం కేసీఆర్ ఒక ఫైటర్. నరేంద్ర మోదీ లాంటి చీటర్‌తో ఆయన కలిసి పనిచేయరు' అని స్పష్టం చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం పీఎంఓకు బెదిరింపు కాల్

గద్వాల క్రైం: త్వరలోనే ప్రధాని మోదీని హతమారుస్తానంటూ పీఎంఓకు చేసిన బెదిరింపు కాల్‌పై ఎన్ఐఏ విచారణ జరిపింది. ఆ కాల్ చేసింది జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన ఎస్పీజీ మాజీ ఉద్యోగి అని, ఇతడు రెండేళ్ల క్రితం రిటైర్ అయినట్లుగా గుర్తించింది. దీంతో ఇతడిని మంగళవారం అదుపులోకి తీసుకుని ఎన్ఐఏ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పటికీ అందకపోవడంతో తాగిన మైకంలోనే పీఎంఓకు బెదిరింపు కాల్ చేసినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్పీ సృజనను 'సాక్షి' సంప్రదించగా..అలంపూర్ పీఎస్‌లో కేసు నమోదు చేశామని, సదరు వ్యక్తికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతోనే ఇలా చేసినట్లు విచారణ తేలిందన్నారు.



నాశనం గావించే, నయం చేయగలిగే శక్తి మాటలకు ఉంది. ఎప్పుడు మాటలు నత్యవంతం, దయాపూరితం అవుతాయో అవి ప్రపంచాన్ని మార్చగలవు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 4 అక్టోబర్ 2023

ఇన్నేళ్ళకు న్యాయం!

మూడు దశాబ్దాల పైచిలుకు క్రితం కేసులో బాధితులకు ఎట్టకేలకు కాసింత ఊరట దక్కింది. పోలీసుల దమనకాండకు ప్రతిరూపమైన తమిళనాడు వాచాత్తి ఘటనలో సెప్టెంబర్ 29న మద్రాస్ హైకోర్ట్ ఇచ్చిన తీర్పు ఆ రకంగా చిరకాలం గుర్తుండిపోతుంది. మారుమూల గ్రామంలోని గిరిజనులపై దాడి చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణమైన కేసు అది. అటవీ, పోలీసు అధికారులతో సహా మొత్తం 269 మంది దోషులంటూ కింది కోర్టు ఏనాడో తీర్పు ఇచ్చింది. దోషులు పైకోర్టును ఆశ్రయించి, జాగు చేశారు. తాజాగా మద్రాస్ హైకోర్ట్ ఆ అప్పీళ్ళను కొట్టివేసింది. కింది కోర్ట్ తీర్పును హైకోర్ట్ సమర్థించడమే కాక, 215 మందినీ దోషులుగా తీర్మానిస్తూ, ఒక్కొక్కరికీ 1 నుంచి 10 ఏళ్ళ పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితులకు ఇన్నాళ్ళకైనా న్యాయం దక్కిందనే భావన కలుగుతోంది. ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల నమ్మకం మిగులుతోంది.

నిజానికి, తమిళనాట ధర్మపురి జిల్లాలో తూర్పు కనుమల్లో నెలకొన్న గిరిజన గ్రామం వాచాత్తి గురించి ముప్ఫయ్యేళ్ళ క్రితం ఎవరూ విననైనా విని ఉండరు. కేవలం 655 మంది, అందులోనూ 643 మంది మలయాళీ షెడ్యూల్డ్ తెగల వారున్న 200 గడపల గ్రామం అది. కానీ, ఆ రోజు జరిగిన ఆ దారుణ ఘటనతో ఒక్కసారిగా ఆ గ్రామం వార్తల్లో నిలిచింది. గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ, పోలీసులు, అటవీ అధికారులు గ్రామంపై దాడి చేశారు. అక్కడ గిరిజనులపై సాగించిన అమానుషం, బడికెళ్ళే ఓ చిన్నారి సహా 18 మంది మహిళలపై సామూహిక అత్యాచారం, తాగునీటిలో విషం కలిపిన తీరు, పశువుల్ని ఊచకోత కోసి ఊరి బావిలో పడేసిన వైనం... ఆ గ్రామం రూపురేఖల్నే మార్చేశాయి. 'గంధపు చెక్కల స్మగ్లింగ్ గ్రామం' అని ముద్రవేస్తూ అమాయకులపై అధికారులు సాగించిన ఆ దమనకాండ ఓ మాయని మచ్చ. కేంద్ర నేర దర్యాప్తు సంస్థ (సీబీఐ) లోతుగా విచారించి అధికారుల తప్పు తేల్చినా, ఏళ్ళ తరబడి వాయిదా పడుతూ వచ్చిన న్యాయం ఇన్నాళ్ళకు దక్కింది. బాధితులకు కాస్తయినా ఊరట దక్కింది.

1992 జూన్ 20 నుంచి మూడు రోజులు సాగిన అమానుష ఘటనలో మొత్తం 269 మంది నిందితులు కాగా, వారిలో 54 మంది న్యాయ విచారణ కాలంలోనే కన్నుమూశారు. మిగిలినవారికి ఇప్పుడు శిక్ష పడింది. ఈ కథ ఇక్కడి దాకా రావడం వెనుక న్యాయం కోసం సుదీర్ఘంగా సాగిన పోరాటం ఉంది. అప్పట్లో అధికారులపై కేసులు నమోదు కాకపోగా, గిరిజనులపైనే స్థానిక పోలీసులు ఎదురు కేసులు పెట్టిన పరిస్థితి. గిరిజనులు తమ ఇళ్ళను తామే ధ్వంసం చేసుకున్నారని అధికారులు బుకాయించారు. హైకోర్ట్ ఆదేశిస్తే గానీ చివరకు సీబీఐ దర్యాప్తు జరగలేదు. అంతరాయాలతో విచారణ సుదీర్ఘంగా 19 ఏళ్ళు సాగి, చివరకు 2011లో ధర్మపురి సెషన్స్ కోర్ట్ అధికారులను దోషులుగా తేల్చి, శిక్ష వేసింది. దోషులు మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించడంతో మరో 11 ఏళ్ళ సుదీర్ఘ కాలం గడిచిపోయింది. ఈ కేసు విచారణ సత్వరమే పూర్తి చేయాలని హైకోర్ట్ న్యాయమూర్తి ఒకరు ఈ ఏడాది మొదట్లో పట్టుబట్టడంతో ఇప్పటికైనా కథ ఓ కొలిక్కి వచ్చింది.

చిత్రం ఏమిటంటే – వాచాత్తి దమన కాండపై అప్పట్లోనే ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైతే, ప్రభుత్వంలో ఉన్నత హోదాల్లో ఉన్నవారు అలాంటి నేరాలకు పాల్పడరంటూ జడ్జి దాన్ని కొట్టేయడం! జయలలిత సారథ్యంలోని అప్పటి అన్నాడీఎంకె పాలకులు, స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు ఈ ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఆ తరువాత అధికారంలో ఉన్న డీఎంకె, అన్నాడీఎంకె సర్కార్లూ తమ బ్యూరోక్రాట్లకు కాపు కాసేందుకే ప్రయత్నించాయి. కొందరు ఉద్యమకారులు, లాయర్లు, నిజాయతీపరులైన అధికారులు, జడ్జీల వల్ల చివరకు న్యాయం జరిగింది. అత్యాచార బాధితులు పట్టువిడవకుండా పోరాడడంతో ఇప్పటికైనా సత్యం గెలిచింది. కళ్ళకు గంతలు కట్టుకున్న న్యాయదేవత సాక్షిగా ధర్మం నిలిచింది. కేవలం 655 మంది ఆదివాసీలు బలమైన రాజ్యవ్యవస్థతో తలపడి, విజయం సాధించడం చరిత్రాత్మకం. ఆ రకంగా ఇది బలవంతులపై బలహీనుల గెలుపు. ఆదివాసీల హక్కుల గెలుపు. న్యాయవ్యవస్థ స్వతంత్రమనీ, పాలకుల తప్పులను సైతం సహించదనీ రుజువైంది. ఎస్సీ– ఎస్టీ చట్టం ఇప్పటికీ బలంగానే ఉందని తేలింది.

అయితే, నేటికీ కొనసాగుతున్న అనేక దమనకాండ కేసుల్లో ఇంత సుదీర్ఘ పోరాటం, సత్యాన్ని వెలికితీసి దోషులకు శిక్షపడేలా బృహత్ యత్నం సాధ్యమేనా? న్యాయం దక్కడంలో ఆలస్యమైతే, న్యాయం చేయనట్టే! వాచాత్తి ఘటనలో అపరిమిత ఆలస్యమైంది. దోషుల్లో పలువురు బెయిల్‌పై బయట గడిపి, ఉద్యోగ ప్రయోజనాలన్నీ పొంది, హాయిగా రిటైరయ్యారు. ఇప్పటికైనా దోషులను శిక్షించడమే కాక, బాధితులకు తగిన న్యాయం చేయాలి. నష్టపరిహారాలిస్తే సరిపోదు. నలుగురిలో గౌరవంగా బతికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. వలసవాద బ్రిటీషు పాలన లక్షణాలను పోలీసులు, అధికారులు ఇప్పటికైనా వదిలించుకొంటే మేలు.

తమిళనాట గిరిజనులపై అమానుషాల నుంచి మిజోరమ్‌లో గ్రామాల దహనం, కశ్మీర్‌లో నిరసనకారులపై కాల్పుల దాకా దశాబ్దాలుగా చూస్తున్నవే. బ్రిటీషు దౌర్జన్యానికి మన భారతీయ పోలీసులు వారసులుగా మారిన వైనానికి ఇవి ప్రతీకలు. పదే పదే సాగుతున్న మానవహక్కుల ఉల్లంఘనకు సాక్ష్యాలు. అందుకే, "దాడుల పేరిట చట్టవ్యతిరేక చర్యలకు" పోలీసులు బరి తెగించడం దుస్సహమని కోర్ట్ అన్న మాట కీలకం. నిన్నటికి నిన్న కూడా వార్తల్లో కనిపిస్తున్న ఇళ్ళపై దుర్మార్గ దాడుల ధోరణిని వ్యవస్థ సత్వరమే వదిలించుకోవాలి. వాచాత్తి కేసు గుర్తుచేస్తున్న పాఠం అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.పంచమి ఉ.8.55 వరకు
తదుపరి షష్ఠి, **నక్షత్రం:** రోహిణి రా.10.42 వరకు, తదుపరి మృగశిర,
వర్జ్యం: తె.4.28 నుండి 6.07 వరకు (తెల్లవారితే గురువారం).
దుర్ముహూర్తం: ప.11.26 నుండి 12.14 వరకు,
అమృత ఘడియలు: రా.7.24 నుండి 9.02 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇంటింటా ఇంగ్లిష్ వసంతం

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

ఈ 2023 అక్టోబర్ 5... 206వ భారతీయ ఇంగ్లిష్ దినోత్సవం. భారతదేశంలో పరిపాలనా భాషగా మనుగడ సాగించిన ఈ 206 సంవత్సరాల్లో ఇంగ్లిష్ అతి సంపన్నుల ఆస్తిగా మిగిలిపోయింది. దేశంలో అతి ధనవంతులు లేక స్థిరమైన వేతనం పొందేవారు మాత్రమే తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్యను చెప్పించగలిగారు. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత నాలుగేళ్ల కాలంలో భారతదేశంలోని విద్యా నమూనానే మార్చివేశారు. ఈ నమూనాలో వ్యవసాయ కార్మికుల పిల్లలు, ఆదివాసీలు, చేతివృత్తుల వారితోపాటు, పేదల్లోకెల్లా నిరుపేదలు కూడా కేవలం ఇంగ్లిష్ మాధ్యమం విద్యనే కాదు, పూర్తిగా భిన్నమైన విద్యను పొందుతున్నారు.

మన దేశంలో అతి ధనవంతులు లేక సక్రమంగా ఉద్యోగం చేస్తూ స్థిరమైన వేతనం పొందేవారు మాత్రమే తమ పిల్లలకు పరిమితమైన స్థాయి నుండి ఉన్నత తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యను చెప్పించగలిగారు. దేశంలోని అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులందరూ తమ పిల్లలను ఇంగ్లిషు మీడియంలో చదివించేవారు. నాగాలాండ్ వంటి చిన్న ఈశాన్య రాష్ట్రాలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలందరికీ ఏదో ఒక రకమైన ఇంగ్లిష్ మాధ్యమ విద్యను అందిస్తున్నాయి.

రాజధాని ఢిల్లీ నుంచి దేశాన్ని అత్యధిక కాలం పాలించిన భారత జాతీయ కాంగ్రెస్, 15 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన బీజేపీ వంటి జాతీయ పార్టీలు ఇప్పుడు ఇంగ్లిష్ భాషా విద్యను ధనవంతులకు సొంతం చేశాయి. ఈ పార్టీల అభివృద్ధి నమూనాలో పాఠశాల విద్యకు అతితక్కువ ప్రాధాన్యత మాత్రమే లభించింది.

వెనుకబడిన నైజాం రాష్ట్రంలో సరైన తెలుగు మీడియం పాఠశాల కూడా లేని ఒక కుగ్రామంలో పుట్టి, ఇంగ్లిష్ నేర్చుకోవడంలో దుర్భరమైన కష్టాన్ని అనుభవించిన వ్యక్తిగా బతికిన నేను, జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్నట్టుగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పాఠశాల విద్యపై ఇంత శ్రద్ధ చూపుతారని ఎన్నడూ ఊహించలేదు. నా 71 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, విడిపోయిన ఏపీ, తెలంగాణలలో అనేక మంది ముఖ్యమంత్రులను చూశాను. నేను అనేక రాష్ట్రాల్లో పర్యటించాను. ముఖ్యమంత్రుల, ప్రధాన మంత్రుల పరిపాలనా పద్ధతుల గురించి చదివాను. అయితే పాఠశాల విద్యా కార్యక్రమాలకు ఏపీ ముఖ్యమంత్రి వెచ్చిస్తున్నంత సమయాన్ని ఏ ముఖ్యమంత్రి కానీ, ప్రధాన మంత్రి కానీ వెచ్చించలేదు.

గతంలో సిద్ధరామయ్య కర్ణాటకకు మొదటి దఫా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, పినరయి విజయన్ రెండు పర్యాయాలు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను వారితో మాట్లాడి ఆ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని అభ్యర్థించాను. అయితే అగ్రవర్ణ మేధాజీవులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఆ ఇద్దరూ భయపడ్డారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో పేదల్లోకెల్లా నిరుపేదలకు ఈ రోజువరకూ ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడం లేదు. దీన్ని అలా పక్కన బెడితే రాష్ట్ర విద్యావ్యవస్థ పనితీరును సమీక్షించడానికి ఏ ముఖ్యమంత్రీ జగన్‌లా పాఠశాల విద్యపై ఇంత డబ్బు, సమయం, శక్తి వెచ్చించలేదు. 'నా రాష్ట్ర పిల్లలకు ఉత్తమమైన విద్యను అందించాలని కోరుకుంటున్నాను, అదే వారి భవిష్యత్ ఆస్తి' అని జగన్‌మోహన్ రెడ్డి పదేపదే చెప్పారు. పాఠశాల, కళాశాల పిల్లల తల్లుల ఖాతాల్లో ఏడాదికి సుమారు 35 వేల రూపాయలు జమ అవుతున్నాయి. ఆ డబ్బును వారు తమ విద్యా అవసరాలకు ఖర్చు చేస్తారు. పిల్లల బూట్లు, బ్యాగుల నాణ్యత, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల సౌకర్యాలు



వంటివాటిపై ఏపీ ముఖ్యమంత్రి నిత్యం సమీక్షిస్తున్నారు.

దేశంలోని ఏ భాగానికి చెందిన పాఠశాల మౌలిక సదుపాయాలు కూడా భారతదేశ చరిత్రలో ఏపీలోని పిల్లలకు ఉన్న నాణ్యతతో ఎన్నడూ లేవు. ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి అని ఎప్పుడూ నిర్వచించలేదు. బడా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి వారిని బలిపించడం నుంచి చిన్న కాంట్రాక్టర్ల దిశగా అభివృద్ధి ఆలోచనలను జగన్‌మోహన్ రెడ్డి మార్చివేశారు. ఇలాంటి చిన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు గ్రామ, పట్టణ మార్కెట్లలో డబ్బు ఖర్చు చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో వేతనాలు పొందే కార్మికులు గ్రామాలు, పట్టణాలలో విస్తరించారు. ఈ నమూనాలో అభివృద్ధి పెద్ద నగరాల్లో మాత్రమే కేంద్రీకృతం కాదు. గ్రామ మార్కెట్లు ఎంతగానో పుంజుకుంటాయి.

అదే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి ఐదేళ్ల చంద్రబాబు పాలనను, తెలంగాణలో చంద్రశేఖర్ రావు పదేళ్ల పాలనను చూశాను. వారు తమ తమ రాష్ట్రాల్లోని పాఠశాల విద్యా నిర్మాణాలను ఎప్పుడూ సమీక్షించలేదు. ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పుడూ రాష్ట్ర పేద పిల్లల జీవితం, అభివృద్ధి గురించి చర్చించే స్థలంగా ఉండలేదు. పాఠశాల, కళాశాల విద్యను కార్పొరేట్ వ్యాపార సంస్థలకు అప్ప జెప్పడంలో వీరు పేరొందారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ పాఠశాలలకు వైఫై, స్మార్ట్ టీవీలు ఇవ్వడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ వినూత్న విద్యా పద్ధతులను సమీక్షిస్తూ, గ్రామీణ పాఠశాలలకు వాటిని జోడిస్తూనే ఉన్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల ఆధ్వర్యంలో నడిచే దేశం, రాష్ట్రాలు ఈ ఏడాది భారతీయ ఇంగ్లిష్ దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన నేపథ్యం ఇది.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన తర్వాత ఆయన కుమారుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి మాట్లాడటం నేను టీవీ ఛానళ్లలో చూశాను. తెలుగు కంటే వారి ఇంగ్లిష్ చాలా బాగుంది. ఎందుకు? వారు అగ్రశ్రేణి ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలల్లోనూ, అమెరికాలో కూడా చదువుకున్నారు. కానీ ఆ కుటుంబం, ఆయన పార్టీ 2019లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి జగన్ కోర్టు పోరాటాలు, మీడియా పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఏపీకి చెందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమణ ఆ విధానాన్ని వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువుతున్న నిరుపేదలకు, తల్లులకు ఆర్థిక సాయంతో జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారు. అలాంటి కార్మిక పిల్లలు ఇంగ్లిష్ మాట్లాడే సుసంపన్న దేశమైన అమెరికాకు వెళ్లి ఐక్యరాజ్యసమితి విద్యా సమావేశాలలో, వైట్ హౌస్‌లో ధైర్యంగానూ, విశ్వాసంతోనూ మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకుల నుంచి చప్పట్లు స్వీకరించారు. ఇది కచ్చితంగా భారతదేశ భవిష్యత్ పాఠశాల విద్యా వ్యవస్థకు ప్రేరణాత్మక ఉదాహరణ.

ఈ రోజు పేదలు, గ్రామ పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోవడంపై సంబరాలు జరుపుకోవాల్సిన అవసరం ఉంది. 1817లో మన జాతీయ జీవనంలోకి వచ్చిన ఇంగ్లిష్ విద్య కొత్త మార్గాన్ని సుగమం చేసింది. కొత్త ఆశను సృష్టించింది. మన విద్యావ్యవస్థలో ఇద్దరు సంస్కర్తలు విలియం కేరీ, రాజా రామ్మోహన్ రాయ్ 206 సంవత్సరాల క్రితం అక్టోబర్ 5న మొదటి పాఠశాలను ప్రారంభించారు. అయితే ఆ భాషా ఫలాలు వ్యవసాయాధారిత ప్రజానీకానికి, పట్టణ పేదల పిల్లలకు ఇప్పటికీ చేరలేదు. ఉన్నత స్థాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్య నుండి వచ్చిన ఏ విద్యావేత్త కూడా సమాన విద్యా మాధ్యమం కోసం పోరాడలేదు.

మన దేశంలో ప్రాంతీయ భాషల వేడుకలను ఎవరూ వ్యతిరేకించరు. కానీ అదే సమయంలో భారతీయ ఇంగ్లిష్‌ను సెలబ్రేట్ చేసుకోవడం, ఆ ప్రపంచ భాషని మన గ్రామాల్లోకి విస్తరించడం అనేది మన సొంత రూపాంతరంలో ఇంగ్లిష్‌ని తీర్చిదిద్దుతుంది. 206 సంవత్సరాల పాటు ఇంగ్లిష్ అగ్రవర్ణ ధనవంతులు భద్రపరుచుకున్నదిగా ఉండిపోయింది. ఇంగ్లిష్ భాషను ధనవంతుల ఇళ్లకు, ఉన్నత కార్యాలయాలకు, మాల్ మార్కెట్‌లకు, విమానాశ్రయాలకు పరిమితం చేయడం నేరం. ఇది గ్రామ మార్కెట్లు, గ్రామ బస్టాప్‌లతోపాటు వ్యవసాయ క్షేత్రాలకు చేరుకోవాలి. అక్కడే అది మరింతగా భారతీయతను సంతరించుకుంటుంది. ఏ భాషనూ ఒక వర్గ ప్రజల ఆస్తిగా పరిగణించకూడదు.

జగన్ ప్రభుత్వం ఆ తొలి అడుగు వేసింది. ఇక నుంచి ప్రతి సంవత్సరం ఇండియన్ ఇంగ్లిష్‌ను వేడుకగా జరుపుకొని, ఆ రోజున మన పిల్లలను, యువతను ఒక పుస్తకాన్ని చదివేలా చేద్దాం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త ఎత్తుగడ



'పాకిస్తాన్ వెళ్లిపోండి' అని ఇప్పుడు ఎవరూ చెప్పడం లేదు. 'చైనీస్ ఏజెంట్' అనేది 2023 ఇండియాకు సంబంధించిన మెకార్తీయిజం (విపక్షాన్ని అణిచేందుకు వాడే రాజకీయ ఆచరణ).

– శివమ్ విజ్, వ్యాఖ్యాత

కొత్త స్నేహం



యూఏఈ అరబ్బులు హసిడిక్ (జుడాయిజం, యూదులకు చెందిన) పాటలు పాడుతున్నారు (వీడియో షేర్ చేశారు). ఇలాంటిది జరగగలదని కొన్నేళ్ల క్రితం ఎవరు ఊహించారు! ఇజ్రాయిల్, యూఏఈ సంబంధాలు బలపడుతున్నాయి.

– బెమెర్ బహార్, లౌకికవాది

చెత్త తిండి



ప్రపంచంలోనే చెత్త ప్యాకేజ్డ్ ఫుడ్ ఇండియాదని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నాలుగు లక్షల ఉత్పత్తులను పరిశీలించిన 'జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్' అధ్యయనం ప్రకారం, ఇండియా ఉత్పత్తుల్లో చక్కెర, ఉప్పు, శాచురేటెడ్ ఫ్యాట్, కేలరీలు అధికం. ఈ తక్కువ నాణ్యత ఆహారాన్నే చాలామంది ఇళ్లలో తింటున్నారు. కాబట్టి ఇంట్లో తినడం, ఇంటి వంట తినడం రెండూ వేరని గుర్తుంచుకోండి.

– హేమంత్ హిమత్‌సింగ్కా, యాక్టివిస్ట్

ఆరోగ్యమే ఉత్సవం



క్యాన్సర్‌కు చికిత్స తీసుకున్న రెండేళ్ల తర్వాత, నేను ఈ మధ్యే నా మొదటి హెయిర్ కట్ చేయించుకున్నాను. ఆరోగ్యమైన మనిషిగా నేను అప్పుడప్పుడూ పెద్ద మైలురాళ్లను దాటుతున్నాను. మీరు ఒక పోరాటం గెలిస్తే, ఆ మైలురాళ్లను ఆస్వాదించడం మానవద్దు.

– దేవికా చోప్రా, జర్నలిస్ట్

ఎర్ర సంబంధం



ఎక్కడైనా జర్నలిస్టుల మీద పోలీస్ దాడులు జరగడాన్ని నేను ఇష్టపడను. కానీ ఈ ఢిల్లీకి చెందిన 'న్యూస్ క్లిక్'కు చైనీస్ ప్రాపగాండాను ముందుకుతోసే మనిషితో సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆయన భాగస్వామి సిరియాకు అనుకూలం, రష్యాకు అనుకూలం.

– ఇయాన్ హాల్, హానరరీ ఫెలో

థ్యాంక్యూ!



ఇరవై ఏళ్ల క్రితం, స్కాలర్‌షిప్ మీద ఆక్స్‌ఫర్డ్ (విశ్వవిద్యాలయం)లో చేరేందుకు భుజాన బ్యాగు, సూట్‌కేసుతో మొదటిసారి హీత్రూ విమానాశ్రయం(లండన్)లో దిగాను. విదేశంలో ఒకటో, రెండో ఏళ్లు ఉంటాననుకున్నాను. కానీ జీవితం చిత్రమైన మలుపులు తీసుకుంది. వలసజీవులకు ఇంత సానుకూలంగా, సొంతింటిలా ఉన్నందుకు బ్రిటన్‌కు ధన్యవాదాలు.

– దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

ఇదీ విభజన



బిహార్ కులగణన నివేదిక ఆధారంగా బిహార్ ముస్లింలకు సంబంధించిన నా ప్రాథమిక అంచనా ఇదీ: రాష్ట్రంలో మొత్తం ముస్లింల జనాభా: 17.4 శాతం. ఇందులో ఉన్నత వర్గ ముస్లింలు (సయ్యద్, షేక్, పఠాన్ (ఖాన్)లు): 4.8 శాతం. బీసీ+ ఈబీసీ (పాస్మందా) ముస్లింలు: 12.6 శాతం. (నాలుగు వెనుకబడిన కులాలు: 2.03 శాతం. అత్యంత వెనుకబడిన 31 కులాలు: 10.58 శాతం).


– ఖాలిద్ అనీస్ అన్సారీ, సోషియాలజీ ప్రొఫెసర్

ఇన్ బాక్స్

అభినవాంధ్ర భోజుడు!

ఆధునిక ఆంధ్రదేశపు సంస్కరణకూ, విద్యాభివృద్ధికీ ఎనలేని కృషి చేసినవారు పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ (1885–1964). రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తలకు వీరు అండదండలు అందించారు.

సూర్యారావు రసజ్ఞత కలిగిన కవి, రచయిత, తత్వవేత్త, నిరంతర పాఠకుడు, సద్విమర్శకుడు. వివిధ రంగాల్లో సూర్యారావు చేపట్టిన కార్యక్రమాలు ఎన్న దగినవి. దక్షిణాఫ్రికాలోని భారతీయుల కోసం గాంధీజీ పిలుపునందుకుని పాతిక వేలు అందించి, ఆనాటి జమీందార్లలో దేశభక్తికి స్ఫూర్తిగా నిలిచారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ స్థాపించిన 'శాంతినికేతన్' అభ్యున్నతి కోసం, కలకత్తాలోని సిటీ కాలేజి అభివృద్ధికీ, రాజమండ్రిలోని ఆస్తిక కళాశాల, టౌన్ హాలు నిర్మాణానికీ ఆర్థికంగా సాయం చేశారు. కాకినాడలోని పి.ఆర్. కళాశాల స్వయంగా ఏర్పాటు చేశారు. సంఘ సంస్కరణోద్యమానికి ఆదర్శంగా నిలిచిన 'బ్రహ్మసమాజ' ఉద్యమానికి ప్రాచుర్యం కలిగించి, దక్షిణ భారతదేశంలో ఈ ఉద్యమానికి ఎనలేని సేవ చేశారు. మత సామరస్యం కొరకు పరిశ్రమిస్తూ 'నాల్గవ అంతర్జాతీయ సర్వమత సమ్మేళనా'నికి అధ్యక్షుడిగా పనిచేశారు. అసంఖ్యాక విశిష్ట గ్రంథాలను ప్రచురించారు. 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'ను మద్రాసులో స్థాపించి, దానికి శాశ్వత నిధిని ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ లాంటి పరిపూర్ణమైన నిఘంటువు తెలుగులో అవసరమనే ఆలోచనతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' నిర్మాణాన్ని ఒక యజ్ఞంలా చేపట్టి తెలుగుజాతికి అందించారు.



పిఠాపురం రాజా వారు

దక్షిణ భారతదేశం లోనే మొట్టమొదటి అనాథ ఆశ్రమంగా 'కరుణాలయం' స్థాపించారు. దళిత వర్గాలలోని వ్యక్తుల పేరు చివర గాడు అని చేర్చి, పిలవడాన్ని నిషేధించాలనే బిల్లును మద్రాస్ శాసనసభలో ప్రవేశపెట్టి విజయం సాధించారు. అక్టోబర్ 5న ఈ చిరస్మరణీయుని జయంతి!

– ర్యాలి ప్రసాద్, చారిత్రక పరిశోధకులు

భూసంస్కరణలతోనే సామాజిక న్యాయం

స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచి అమృత ఉత్సవాలు జరుపుకున్నప్పటికీ దేశంలో అత్యధిక మంది ప్రజానీకానికి కనీసం సెంటు భూమి లేదు. వ్యవసాయ రంగ అభివృద్ధి పునాదులే ఇతర రంగాల అభివృద్ధికి మూలమని ప్రముఖ ఆర్థికవేత్త గున్నార్ మిర్డాల్ చెప్పారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే దున్నే వానికే భూమి ఉండాలని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ లాంటి ఆర్థికవేత్తలు సైతం అభిప్రాయ పడ్డారు. కానీ ఇప్పటికీ సేద్యపు భూమిలో అత్యధికం భూస్వాముల చేతుల్లోనే ఉండిపోయింది.

1952లో ప్రారంభించిన 'కమాండ్ ఏరియా డెవలప్మెంట్ పథకం'తో వ్యవసాయ రంగంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టి 1965 నాటికి దానిని హరిత విప్లవంగా మార్చారు. ఉత్పాదకతను పెంచడానికి, సామాజిక న్యాయ సాధనకు హరిత విప్లవం ఒక్కటే సరిపోదని వ్యవస్థాగత మార్పులు ఆవశ్యమని, భూ సంస్కరణలను ప్రారంభించి రెండు దశలలో అమలు పరిచారు.

భూ సంస్కరణల చట్టాలను 1948–53 మధ్య కాలంలో దాదాపు అన్ని రాష్ట్రాలు అమలు జరిపాయి. కానీ చట్టంలో లొసుగులు, పాలకుల చిత్త శుద్ధి లోపం, తదితర అనేక కారణాల వల్ల భూ సంస్కరణల అమలులో రాష్ట్రాల మధ్య తీవ్ర అంతరాలు ఏర్పడి అవి విఫలమైనాయి. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన అశాంతి, 1969లో వచ్చిన నక్సల్‌బరీ ఉద్యమం కారణంగా భూ సంస్కరణల రెండో దశ చట్టాలు 1970లో అమలు జరిపారు. అయితే ఇప్పటివరకు పంచింది ఈ దేశంలో 65.5 లక్షల ఎకరాలు మాత్రమే.

భారీ పరిశ్రమల వ్యూహం కారణంగా రుణభారం పెరిగి 1990 కల్లా అప్పులు పుట్టని స్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 'సంస్థాగత సర్దుబాటు పద్దు' క్రింద ఐఎమ్ఎఫ్ నుండి అప్పు తేవడంతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కాస్త ప్రైవేటీకరణ వైపు మళ్ళింది. ప్రపంచీకరణలో భాగస్వాములం అయ్యాం. దీంతో మన దేశంలో వినియోగదారి తత్వం, కేరీరిజం పెరిగిపోయాయి. ఈ రెండింటికీ డబ్బు అవసరం పెరిగిపోయింది. ప్రతి రంగములో ధరలు పెరిగాయి. దీనితో జీవన వ్యయాలు పెరిగి మధ్య తరగతి వర్గాలు మొత్తం ప్రభుత్వ పథకాల



పైననే ఆధారపడే స్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు 'అభివృద్ధి – సంక్షేమం' అనే విధానాన్ని ముందుకు తెచ్చాయి. అభివృద్ధిలో వ్యవసాయం కీలకమని ఏడు దశాబ్దాల తరువాత గ్రహించారు. ఫలితంగా 'పీఎమ్ కిసాన్ యోజన', 'రైతు బంధు', 'రైతు బీమా', 'నదుల అనుసంధానం', 'లిఫ్ట్ ఇరిగేషన్', 'వాటర్ షెడ్స్' పథకాలను ముందుకు తెచ్చారు. కొంత సంతోషమే!

అనేక చట్టాల మూలంగా 2013 నాటికి 57.3 లక్షల మందికి 65.5 లక్షల ఎకరాల భూమిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేశాయి. అయితే మిగులు భూమి విషయంలో 1969 నాటికి పీసీ మహలనోబిస్ 6 కోట్ల 80 లక్షల ఎకరాల మిగులు భూమి ఈ దేశంలో ఉందని అంచనా వేయగా, 2013 నాటికి ప్రభుత్వాలు ప్రకటించిన మిగులు భూమి 92.5 లక్షల ఎకరాలు మాత్రమే. ప్రకటించిన మిగులు భూమిలో కూడా ప్రభుత్వాలు పంచి పెట్టింది కేవలం 64 శాతం మాత్రమే. కమ్యూనిస్టుల పాలనలో ఉన్న పశ్చిమ బెంగాల్ లోనే అత్యధిక భూ పంపిణీ జరగడం గమనార్హం.

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలుగా భావించే శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, మీడియా స్వతంత్ర ప్రతిపత్తితో ఉండాలి. రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పొందుపరిచిన భూ పంపిణీ చట్టాలను అమలు జరపటానికి ఈ నాలుగు వ్యవస్థలూ పూనుకుంటే చైనాలో మాదిరిగా 17 రోజులలో భూ సంస్కరణలు ఎందుకు అమలు కావు? దక్షిణ కొరియా లాంటి దేశాల్లో సైతం భూ గరిష్ఠ పరిమితిని 7.5 ఎకరాలే ఉన్నది. దీనిని మన ప్రజా ప్రతినిధులు ఆలోచించాలి.

ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలలో భూ పంపిణీ చట్టాలపై హామీ ఇవ్వాలి. సామాజిక న్యాయ సాధనకు సమరశీల పోరాటాలే ఏకైక మార్గమని చైతన్యవంతులైన ప్రజలు గ్రహించాలి.

– పొందూరు ప్రభాకర్ రావు,
అర్థశాస్త్ర అధ్యాపకుడు

గురువే కీలకం

చీకట్లో గుంతలు, వాగులు, వంకలు ఎగుడు దిగుళ్ళు కనిపించని అయోమయంలో నడుస్తున్నవారి సమయం వృథా! అజ్ఞానంలో కూరుకుని, జీవితానికి అర్థం, పరమార్థం లేకుండా ఉండడం అవిద్య వల్లనే! అందుకే 'మొక్కలు, సాగు చేస్తే ఎదుగుతాయి, మనిషి విద్యా వ్యాసంగం, అధ్యయన పరిజ్ఞానంతో వర్ధిల్లుతాడు' అన్నాడు జాన్ లాక్. ప్రఖ్యాత భారతీయ తత్త్వవేత్త, రాష్ట్రపతి పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజైన సెప్టెంబర్ 5న మనం 'జాతీయ ఉపాధ్యాయ దినోత్సవా'న్ని జరుపుకొంటున్నాం. ఐక్యరాజ్య సమితి అంగమైన యునెస్కో అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరపాలని 1966లో నిర్ణయించినప్పటి నుంచీ ప్రపంచవ్యాప్తంగా గురువుల ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకొంటూ ఉత్సవాలను జరుపుకొంటున్నారు. ఒక దేశం కానీ, సమాజం కానీ అభివృద్ధి చెందడంలో విద్య పాత్రా, విద్యను బోధించే ఉపాధ్యాయుల పాత్రా ముఖ్యమైనవి. అందుకే ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొనేది.

'పేదరికాన్ని విద్య మూలంగా తొలగించగలం!' అన్న నినాదం అక్షరసత్యం. అయితే ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఎందరో బాలలు అక్షరానికి దూరంగా బతుకుతున్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా 25 మిలియన్ల మంది టీచర్ల కొరత ఉందనేది ఒక అంచనా. అంటే చదువుకోవలసిన పిల్లలు చదువుకు దూరంగా ఉంటే... చదువు చెప్పవలసిన గురువుల సంఖ్య తగినంతగా లేకపోవడం ఇప్పటి ప్రపంచ విద్యారంగ ముఖచిత్ర మన్నమాట. ఇంతటి సూపర్ సోనిక్ స్పీడ్‌తో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా విద్యారంగంలో ప్రపంచం ఇంత వెనుకబడి ఉండటం నిజంగా శోచనీయం. ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇకనైనా మేల్కోవాలి. మనకందరికీ తెలుసు అన్ని వృత్తులవారి విజయాల వెనుక గురువులే మార్గదర్శకులని! నిన్నమొన్నటి మన చంద్రయాన్ విజయబావుటా గగన వీధుల్లో ఎగిరింది అంటే ఆ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన టీచర్ల ఘనతా ఇందుకు కారణమే!

– పరిమి శ్యామలా రాధాకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్, మదనపల్లి
(అక్టోబర్ 5న ప్రపంచ గురు దినోత్సవం సందర్భంగా)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

'జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర'కు ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) ఆధ్వర్యంలో భారతదేశంలోని పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను దర్శించుకునే యాత్రికుల కోసం ప్రత్యేక పర్యాటక రైళ్లు నడుపుతోంది. అందులో భాగంగా దక్షిణ భారతదేశంలో 'జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర' పేరుతో ప్రత్యేక భారత్ గౌరవ్ పర్యాటక రైలును నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక రైలు ఈ నెల 31న సికింద్రాబాద్‌లో బయలుదేరి, నవంబర్ 8న తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలుకు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్‌ల నుంచి ప్రయాణికులు ఎక్కి, దిగేందుకు హాల్ట్‌లు ఏర్పాటు చేశారు. ఈ యాత్ర ప్రత్యేక రైలు ద్వారా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తంజావూరు తదితర పర్యాటక, పుణ్యక్షేత్రాలను యాత్రికులు దర్శించుకోనున్నారు. స్లీపర్ క్లాస్ రూ.14,100, 3ఏసీ రూ.21,500, 2ఏసీ రూ.27,900 ధరగా నిర్ణయించారు. యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా కానీ, విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం, 8287932312లో సంప్రదించాల్సి ఉంటుంది.

యువకుడిపై మహిళ యాసిడ్‌తో దాడి

గుంటూరు రూరల్: సహజీవనం చేస్తున్న యువకుడిపై ఓ మహిళ యాసిడ్‌తో దాడి చేసింది. ఈ ఘటన మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగింది. నల్లపాడు సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణలోని ఖమ్మం జిల్లా వైరాకు చెందిన మంజు రాధ (42) భర్త మృతిచెందాడు. తన కుమార్తెకు వివాహం చేసిన అనంతరం ఆమె నల్లపాడు వచ్చి శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటోంది. కుమార్తె గుంటూరులో ఉంటూ తల్లి వద్దకు వచ్చి వెళుతుంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసకాలనీకే చెందిన మినరల్ వాటర్ క్యాన్లు సరఫరా చేసే ఓర్సు వెంకట్(22) అనే యువకుడితో రాధకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఆరు నెలలుగా అదే కాలనీలో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో పది రోజుల కిందట రాధ, వెంకట్ గొడవపడ్డారు. ఒకరిపై మరొకరు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే, మంగళవారం నల్లపాడులో వాటర్ క్యాన్లు సరఫరా చేస్తున్న వెంకట్ వద్దకు రాధ వచ్చి గొడవపడింది. తనవెంట తెచ్చుకున్న యాసిడ్‌ను వెంకట్‌పై పోసింది. దీంతో భయాందోళనలకు గురైన వెంకట్ కేకలు వేయడంతో రాధ అక్కడి నుంచి పారిపోయింది. స్థానికులు బాధితుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో వెంకట్‌కు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. వెంకట్ తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

తల్లి పొత్తిళ్లలోని పసికందు మాయం

గుంటూరు ఈస్ట్: గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో తల్లి పొత్తిళ్లలో నిద్రపోతున్న ఏడు రోజుల పసికందును ఓ మహిళ అపహరించిన ఘటన కలకలం రేపింది. వివరాలు.. షేక్ రబ్బాని, రోష్ని దంపతులు గుంటూరులోని సాంబయ్య కాలనీ 6వ లైనులో నివసిస్తుంటారు. సెప్టెంబర్ 26వ తేదీన రోష్నికి పురిటినొప్పులు రావడంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అనంతరం ఆమె.. పాపకు జన్మనిచ్చింది. మంగళవారం మధ్యాహ్నం జీజీహెచ్‌లోని 106వ వార్డులో పాపతో కలిసి రోష్ని నిద్రపోయింది. ఆ తర్వాత కొద్దిసేపటికి మెలుకువ వచ్చి చూడగా.. బిడ్డ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె.. చుట్టుపక్కల వెతికి జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీశ్, అవుట్‌పోస్టు సిబ్బంది సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ రోష్ని కుమార్తెను ఎత్తుకొని అత్యవసర విభాగం మీదుగా బయటకు వెళ్లి.. రోడ్డుపై ఆటో ఎక్కి వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీనిపై పాప తల్లిదండ్రులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పాప ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

నిర్లక్ష్యం.. మూడు నిండు ప్రాణాలు బలిగొంది

బనశంకరి: నిర్లక్ష్యంగా నడపడంతో కారు బోల్తా కొట్టి మంటల్లో చిక్కుకుని భార్య, ఇద్దరు కూతుళ్లు సజీవ దహనమయ్యారు, కారు డ్రైవ్ చేస్తున్న ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దుర్ఘటన బెంగళూరులో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు.. తమిళనాడులోని సేలం అలమాడుకుడు గ్రామానికి చెందిన మహేంద్రన్ (34), సింధు (30) దంపతులు, వీరికి నాలుగేళ్ల కుశాలి, ఆరేళ్ల ప్రణవి అనే ఇద్దరు కూతుళ్లు. మహేంద్రన్ బెంగళూరులో ఐటీ ఇంజనీరుగా పనిచేస్తూ రామమూర్తినగర విజనాపురలో నివాసం ఉంటున్నాడు. సోమవారం టాటా నెక్సాన్ అద్దె కారును ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని నగరంలో విహరించారు. అర్ధరాత్రి దాటాక నైస్ రోడ్డులో సోంపుర వద్ద ప్రయాణిస్తుండగా వాటర్ బాటిల్ పడిపోయి కాలి కిందికి రావడంతో దానిని తీయాలని మహేంద్రన్ కిందికి వంగాడు. ఆ ప్రయత్నంలో స్టీరింగ్ అదుపు తప్పి కుడివైపునకు దూసుకెళ్లిన కారు ఓ లారీని ఢీకొట్టి, మళ్లీ పక్కనే ఉన్న గోడను ఢీకొని పల్టీలు కొట్టింది. వెంటనే కారులో మంటలు ఏర్పడ్డాయి. సింధు, కుమార్తె కుశాలి ఆ మంటల్లో సజీవదహనం కాగా, ప్రణవి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో కన్నుమూసింది.

ఇంజన్ల మోత ఉండదిక!

- విద్యుత్ వాహనాలకు పెరుగుతోన్న ఆదరణ
- 2030 నాటికి ఈవీ చార్జర్ల విక్రయాల్లో 65% వృద్ధి!
- ఏపీలో ఇప్పటికే 266 ఈవీ స్టేషన్లు..ఈ ఏడాది మరో 115 స్టేషన్లు అందుబాటులోకి
- 2030 నాటికి దశల వారీగా పెట్రోల్, డీజిల్ వాహనాల తొలగింపు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా కర్బన ఉద్గారాలపై ఆందోళన ఎక్కువవుతోన్న నేపథ్యంలో విద్యుత్ వాహనాలు (ఈవీ)లకు ఆదరణ పెరుగుతోంది. ఏటా 10 లక్షలకు పైగా ఈవీలను వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది 10.4 లక్షల వాహన విక్రయాలు జరగ్గా..ఈ ఏడాది అది 13.8 లక్షలకు, 2030 నాటికి 30 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా. ఈ ఏడాది అమ్ముడవుతోన్న మొత్తం ద్విచక్ర వాహనాల్లో 4.5% ఎలక్ట్రిక్ వాహనాలే ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో వాటికి అవసరమైన చార్జింగ్ స్టేషన్లూ భారీగా ఏర్పాటవుతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి 6 వేల చార్జింగ్ స్టేషన్లు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నివేదిక ప్రకారం.. దేశంలో 9,113 పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్లు 15,493 ఈవీ చార్జర్లలో పనిచేస్తున్నాయి. వాహనాలకనుగుణంగా ఈవీ చార్జర్ల విక్రయాలూ పెరుగుతున్నాయి. అది ఎంతగా అంటే 2030 నాటికి దేశంలో ఈవీ చార్జర్ల డిమాండ్ ప్రస్తుతం ఉన్నదానికంటే 65% పెరుగుతుందని అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ లెక్కన ఏడేళ్లలో 30 లక్షల చార్జర్లు అవసరమని కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ (సీఈఎస్), ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ (ఐఈఎస్ఏ) సంయుక్త నివేదిక తెలిపింది.

అప్పగించే పని మొదలైంది



ఎలక్ట్రిక్ వాహనాల విప్లవాన్ని రాష్ట్రంలో తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2070 నాటికి నెట్ జీరో ఉద్గారాలను సాధించాలనే జాతీయ లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేస్తోంది. భవిష్యత్‌లో రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం, ఎన్ఆర్ఈడీసీఏపీ స్థలాలను గుర్తించాయి. నమోదు చేసుకున్న నిర్వాహకులకు చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు బాధ్యతలను అప్పగించే పని మొదలైంది.

– ఎస్ రమణారెడ్డి, వీసీ, ఎండీ, ఎన్ఆర్ఈడీసీఏపీ

ప్రత్యేక పాలసీ.. స్థిరమైన లక్ష్యం

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఈఎంఐ (వాయిదా)ప్రాతిపదికన లక్ష ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేస్తోంది. రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇంధన ఖర్చులు భారంగా మారిన నేటి కాలంలో దిగువ/మధ్య తరగతి ప్రజలకు సాయపడేలా సుస్థిర రవాణాను అభివృద్ధి చేయడానికి రాష్ట్రమంతటా చార్జింగ్ మౌలిక సదుపాయాలను న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఆధ్వర్యంలో 266 ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. మరో 115 స్టేషన్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. దీంతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల సంఖ్య 65,000 దాటింది. 2030 నాటికి పెట్రోల్ వాహనాలను దశల వారీగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా జాతీయ రహదారుల వెంబడి 25 కి.మీ ఒకటి చొప్పున, నగర పరిధిలో ప్రతి 3 కిలోమీటర్ల గ్రిడ్ లోపల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 4 వేల స్థలాలను గుర్తించింది.



12 గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు..

- తిరుపతి బస్టాండ్‌లో తెల్లవారుజామున 2.12 గంటలకు బాలుడి కిడ్నాప్
- ఉదయం 11.30 గంటలకు నిందితులను పట్టుకున్న పోలీసులు
- సురక్షితంగా తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



మీడియా సమక్షంలో తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి క్రైం: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లిదండ్రుల పక్కన నిద్రిస్తున్న ఓ బాలుడు తెల్లవారుజామున కిడ్నాప్ కాగా... 12 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించి తిరిగి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసు వివరాలను మంగళవారం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మీడియాకు వివరించారు. చెన్నైకి చెందిన చంద్రశేఖర్, మీనా దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలిసి సోమవారం అర్ధరాత్రి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లోని చెన్నై ప్లాట్‌ఫాం వద్ద నిద్రపోయారు. తెల్లవారుజామున మెలకువ వచ్చి చూడగా, రెండో కుమారుడు అరుల్ మురుగన్(2) కనిపించలేదు. దీంతో వెంటనే తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి డీఎస్పీ సురేందర్‌రెడ్డి, క్రైం డీఎస్పీ రవికుమార్, సీఐ మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు వెంటనే బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీ ఫుటేజ్ ఆధారంగా బాలుడిని తెల్లవారుజామున 2.12 గంటలకు కిడ్నాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ చేసిన వ్యక్తిని అవిలాల సుధాకర్‌గా నిర్ధారించుకుని పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో అవిలాల సుధాకర్ కిడ్నాప్ చేసిన బాలుడిని ఏర్పేడు మండలంలోని మాల గ్రామంలో తన అక్క నెల్లూరి ధనమ్మ వద్దకు తీసుకెళ్లి వదిలిపెట్టినట్టుగా సమాచారం అందింది. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో పోలీసులు వెళ్లి బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు సుధాకర్‌తోపాటు ధనమ్మ, మరికొందరిని ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని సమగ్రంగా విచారణ చేపడుతున్నారు.

డాక్టర్ గంగిరెడ్డి జీవితం ఆదర్శప్రాయం

- తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు
- దినేష్ నర్సింగ్ హోంలో ప్రత్యేక ప్రార్థనలు
- ఆయన పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి ప్రాణదాతగా నిలిచారు : వైఎస్ భారతి



వైఎస్సార్ జిల్లా పులివెందులలో డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్ భారతి, డాక్టర్ ఇ.సి.సుగుణమ్మ, డాక్టర్ ఇ.సి.దినేష్‌రెడ్డి

పులివెందుల: ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఇ.సి. గంగిరెడ్డి జీవితం ఆదర్శవంతమైనదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి కొనియాడారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో డాక్టర్ గంగిరెడ్డి తృతీయ వర్ధంతిని నిర్వహించారు. డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్ కుటుంబ సమాధుల తోటలో ఉన్న గంగిరెడ్డి ఘాట్ వద్ద ఆయన కుమార్తె, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి, గంగిరెడ్డి సతీమణి డా.ఇ.సి.సుగుణమ్మ, కుమారుడు డా.ఇ.సి.దినేష్‌రెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భాకరాపురంలో ఉన్న దినేష్ నర్సింగ్ హోం (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ భారతి మాట్లాడుతూ.. తన తండ్రి డాక్టర్ ఇ.సి. గంగిరెడ్డి పేద ప్రజల పట్ల ఎంతో ప్రేమ, దయతో ఉండేవారన్నారు. ఎంతోమంది పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించి ఈ ప్రాంతంలో ప్రాణదాతగా నిలిచారని గుర్తుచేశారు. పేదల జీవితాలను మెరుగుపరచాలని ఆయన తపనపడేవారన్నారు. తమ పిల్లలకు కూడా ఆయన పేదలపట్ల సేవాభావంతో ఉండాలని సూచించేవారని ఆమె చెప్పారు. ఆయనను చూసి తాము ఎంతో నేర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితో పాటు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, సీఎం కార్యాలయ కో–ఆర్డినేటర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్ ప్రమీలమ్మ, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగెళ్ల సాంబశివారెడ్డి, మిట్టా కరుణాకర్, రసూల్, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే నివాళి

తిరుపతి ఎంపీ గురుమూర్తి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు డాక్టర్ గంగిరెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాయలసీమ ప్రాంత ప్రజలకు గంగిరెడ్డి అందించిన వైద్యసేవలను కొనియాడారు.

అవినీతిపరులకు శిక్షలు పడాల్సిందే..

- 1,101వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: తను అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబు లాంటి అవినీతిపరులకు శిక్షలు పడినపుడే ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,101వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. పేదోడికి గూడు కల్పించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం ఇళ్ల స్థలమిస్తే.. తప్పుడు కేసులు వేసిన కుల వాదులు, లక్షల కోట్ల ప్రజాధనం లూటీ చేసిన చంద్రబాబుకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో ప్యాకేజీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అవినీతిపరులు, దోపిడీ దొంగలకు రాష్ట్రం నిలయంగా మారకుండా ఉండాలంటే షెల్ కంపెనీలతో రాష్ట్ర ఖజానాను దోచిన బాబు, లోకేశ్‌తో పాటు స్కామ్‌లతో సంబంధం ఉన్న నాటి మంత్రులు, కంత్రీలకు తగిన శిక్షలు పడాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థకు ధనిక, పేద తారతమ్యం ఉండదని, ఎంతటి వారైనా ప్రజాస్వామ్యంలో తప్పులు చేస్తే శిక్షలు పడాల్సిందే అనేందుకు చంద్రబాబు అరెస్టే సంకేతమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, రాజధానిలో పేదలకు ఇళ్ల నిర్మాణం తదితర విషయాల్లోనూ కోర్టులు న్యాయబద్ధ తీర్పులిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నాయకులు బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

రూ .50 కోట్ల విస్కీ బాటిల్



ఇది ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన మద్యం సీసా! ఆ ఏముందిలే... మహా అయితే దీని ధర రూ. వేలల్లోనో లేదా ఇంకా ఎక్కువనుకుంటే రూ. కొన్ని లక్షలు ఉండొచ్చనుకుంటున్నారా? అయితే మీరు పొరబడ్డట్లే..!! ఎందుకంటే దీని ధర ఏకంగా రూ .50 కోట్లపైనే!! ఈ సీసాను 8,500 వజ్రాలు, 300 కెంపులతో పొదగడంతోపాటు వైట్ గోల్డ్‌తో మెరుగులు దిద్దారు. యూకేకు చెందిన ద లగ్జరీ బెవరేజ్ కంపెనీ... ఇసబెల్లా ఐలా ఒరిజినల్ విస్కీ పేరుతో ప్రీమియం సింగిల్ మాల్ట్ విస్కీని ఈ సీసాలో విక్రయిస్తోంది. పైగా దీన్ని ఓ అందమైన చిన్న పెట్టెలో భద్రపరిచి కొనుగోలుదారులకు అందిస్తోంది.

సునిశిత దృష్టితో గొప్ప కళాఖండాలు

- 'ఫొటోగ్రఫీ–2023' విజేతలకు బహుమతుల ప్రదానంలో కొమ్మినేని, విజయబాబు



'ఫొటోగ్రఫీ-2023' విజేతలతో కొమ్మినేని, విజయబాబు తదితరులు

సాక్షి, అమరావతి: ఫొటో జర్నలిస్టుల సునిశిత దృష్టి గొప్ప కళా ఖండాలను సృష్టిస్తుందని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. మంగళవారం మీడియా అకాడమీ కార్యాలయంలో 'ప్రపంచ ఫొటోగ్రఫీ–2023' పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్క ఫొటో వెయ్యి పదాలకు సమానమన్నారు. రాజకీయ, సామాజిక చైతన్యాన్ని ప్రేరేపించడంలో ఫొటో జర్నలిస్టులు తీసే ఫొటోలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విపత్తుల సమయంలో ఫొటో జర్నలిస్టుల సాహసోపేత సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు, మీడియా అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, ఫొటో ఇండియా అధినేత శ్రీనివాసరెడ్డి, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ భాస్కరరావు, జనరల్ సెక్రటరీ రూబెన్ బేసాలియల్, ఇతర విజేతలు తమ వృత్తిలోని మరుపురాని, కీలక ఘట్టాలను గుర్తు చేసుకున్నారు.

15 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- 19న గరుడ వాహనం, 20న పుష్పకవిమానం సేవలు
- 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం



తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధిక మాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ప్రధానంగా ఈ నెల 19న గరుడ వాహనం, 20న పుష్పక విమానం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహనసేవ రాత్రి 7 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న అంకురార్పణం, 15న ఉదయం బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనం, 16న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 17న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 18న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 19న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 20న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం పుష్పకవిమానం, రాత్రి గజ వాహనం, 21న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 22న ఉదయం స్వర్ణ రథం, రాత్రి అశ్వవాహనం సేవ నిర్వహిస్తారు. 23న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన 9వ రోజు ఉదయం చక్రస్నానం వేడుకగా జరుగుతుంది.

7న ఘంటసాల గీతాలతో నృత్యరూపకం

- పలువురికి కళాప్రదర్శిని ఘంటసాల స్మారక పురస్కారాల ప్రదానం
- ఘంటసాల కోడలు, కళా ప్రదర్శిని డైరెక్టర్ పార్వతీ రవి వెల్లడి



పౌర గ్రంథాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఘంటసాల కోడలు పార్వతీ రవి తదితరులు

సీతంపేట(విశాఖ ఉత్తర): గాన గంధర్వుడు ఘంటసాల శత జయంత్యుత్సవాల సందర్భంగా ఈ నెల 7న ఘంటసాల పాడిన గీతాలతో నృత్యరూపకం ఏర్పాటు చేస్తున్నట్లు ఘంటసాల కోడలు, కళా ప్రదర్శిని డైరెక్టర్ పార్వతీ రవి తెలిపారు. ఆ రోజు సాయంత్రం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన భరతనాట్యం, కూచిపూడి కళాకారులతో నృత్యరూపక ప్రదర్శనతో పాటు ప్రఖ్యాత కళాకారుడు శివమణి డ్రమ్స్ వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమ పోస్టర్‌ను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళారంగంలో సేవలందిస్తున్న డాక్టర్ మీగడ రామలింగస్వామి, ఎ.బి.బాల కొండలరావు, వేదాంతం రామలింగస్వామిలకు కళాప్రదర్శిని ఘంటసాల స్మారక పురస్కారాలు అందజేస్తామని తెలియజేశారు. జాన్స్ మ్యూజిక్ అకాడమీ అధినేత ఎ.ఎస్.జాన్ సంగీత నిర్వహణలో ఘంటసాల సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. ఘంటసాలకు భారత రత్న ప్రకటించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఫ్లూటిస్ట్ ఎ.ఎస్.జాన్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, స్వర మాధుర్యం అధ్యక్షుడు ఎం.వి.ఆర్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 05/2023-24 తేది: 26-09-2023
పని పేరు : ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం, మాగుటూరు గ్రామము సమీపంలోని నల్లమల సాగర్ రిజర్వాయర్ పై నైలగలపాయ వ్యాలీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కొరకు లీడింగ్ ఛానల్ తవ్వకం మరియు జాక్ వెల్ పంప్ హౌస్ నిర్మాణం చేయుట. పని విలువ : రూ. 2997.07 లక్షలు. బిడ్ డౌన్‌లోడ్ చివరి తేది:10-10-2023, సా.11.00గం. వరకు. వివరాలకు www.tender.apeprocurement.gov.in
సం/- పర్యవేక్షక ఇంజనీరు, కన్‌స్ట్రక్షన్ సర్కిల్, ఒంగోలు
DIPR RO No.11117/CL/Advt/1/1/2021-22, Dt: 03.10.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ (A1) డిపార్ట్‌మెంట్
ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP) కొరకు పిలుపు
RFP టెండర్ ప్రకటన నం. 125/RFP document/TS-JTO.2/2023 తేది: 03-10-2023
2022-23లో మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం కోసం స్పాంజ్ సిటీల పరిధిలోని 15 ULB లలో 64 వాటర్ బాడీల పునరుద్ధరణ కోసం DPR తయారీకి సంబంధిత అనుభవం కలిగిన ప్రముఖ కన్సల్టెంట్ల నుండి ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP) కోరుతున్నారు. RFP వివరాలను https://tender.apeprocurement.gov.in నుండి పొందవచ్చును. RFP డాక్యుమెంట్లు 06-10-2023 ఉ.11.00 గం. నుండి 24-10-2023 సా.5.00 గం. వరకు లభిస్తాయి. ఫోన్ : 9849906213.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), రాజమహేంద్రవరం
DIPR RO No.11121/CL/Advt/1/1/2021-22, Dt: 03.10.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పోలీస్ శాఖ
టెండరు నోటీస్
No.18/H4/2023-Phase-II/CCTV-PS, (Tender IDs:667433) తేది : 29.09.2023
ఆంధ్రప్రదేశ్‌లోని పోలీస్ స్టేషన్‌లలో CCTV మరియు సర్వేలెన్స్ ఎక్విప్‌మెంట్ సరఫరా, స్థాపన మరియు నిర్వహణ కోసం ఫేజ్-II క్రింద రేట్ కాంట్రాక్ట్ ద్వారా AP పోలీస్ టెండర్ కోరుతోంది. ECV: రూ.14.90 కోట్లు. టెండర్ వివరాలు https://tender.apeprocurement.gov.inలో 16.10.2023 రా. 10.30 గం. వరకు లభిస్తాయి.
సం/- ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ప్రొవిజనింగ్ & లాజిస్టిక్స్)
DIPR RO No.11122/CL/Advt/1/1/2021-22, Dt: 03/10/2023

Department of Agriculture, Government of Andhra Pradesh
REQUEST FOR PROPOSAL (RFP)
Department of Agriculture, AP, Guntur invites bids for selection of Agencies for supply of Desktops & Laptops. For other details please visit www.apagrisnet.gov.in or www.tender.apeprocurement.gov.in
Sd/- Sri.C Hari Kiran, IAS
Special Commissioner of Agriculture
DIPR RO No.2389PP/CL/Advt/1/1/2021-22, Dt: 03.10.2023

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి, చీఫ్ ఇంజనీర్ ఆఫీస్
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.54/D3/CE/TTD/2023-24 Dt:02/10/2023
TTD ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ యొక్క అరవై ఏడు (67) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్లో ఇ-టెండర్లు కోరబడుచున్నవి. SE-II, NIT నం.: 202 నుండి 207/SE-II/2023-24 (6 పనులు). SE-III, NIT నం.: 108 నుండి 111/SE-III/2023-24 (4 పనులు). SE(Elec), NIT నం.: 56/SE(Elec)/2023-24 (1 పని). EE-VI, NIT నం.: 90 నుండి 100/EE-VI/2023-24 (11 పనులు). EE-IX, NIT నం.: 60 నుండి 61/EE-IX/2023-24 (2 పనులు). EE-XI, NIT నం.: 87 నుండి 90/EE-XI/2023-24 (4 పనులు). EE-XII, NIT నం.: 137 నుండి 144/EE-XII/2023-24 (8 పనులు). EE-XIV, NIT నం.: 138 నుండి 141/EE-XIV/2023-24 (4 పనులు). DE(Elec)-I, NIT నం.: 257 నుండి 262/DE(Elec)-I/2023-24 (6 పనులు). DE(Elec)-II, NIT నం.: 502 నుండి 518/DE(Elec)-II/2023-24 (17 పనులు). DE(Elec)-TML, NIT నం.: 264 నుండి 267/DE(Elec)-TML/2023-24 (4 పనులు). వివరాల కోసం www.tirumala.org కి లాగిన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.inకు లాగిన్ చేయండి.
Roc No.PR4/13959/Adv.No.212/PRO/2023, Dt:03.10.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
మార్కెటింగ్ శాఖ, TTD వారిచే ఆరు నెలల కాలవ్యవధి కొరకు 15,000 Kgs M.G-I గ్రేడ్ నల్ల మిరియాలు అగ్‌మార్క్‌తో సేకరణ కోసం ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in/ కి లాగాన్ అవండి. తదుపరి వివరాల కోసం సంప్రదించండి ఫోన్ నంబర్లు: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం: 0877-2264554.
Roc No.PR4/13959/Adv.No.209/PRO/2023, Dt:03.10.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సెంట్రల్ పవర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
(భారత ప్రభుత్వ సొసైటీ, విద్యుత్ మంత్రిత్వ శాఖ)
పోస్ట్ బాక్స్ నం. 8066, ప్రొఫెసర్ సర్ C.V. రామన్ రోడ్, సదాశివ నగర్ పోస్ట్ ఆఫీస్, బెంగళూరు - 560080.
ప్రకటన నం. CPRI/12/2023
CPRI వారు ప్రారంభంలో ఒక (1) సంవత్సర కాలవ్యవధి కోసం పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికపై ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు సంబంధించిన మూడు (3) ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అర్హత ప్రమాణాలు, విద్యార్హత మొ॥ వాటికి సంబంధించిన వివరాల కోసం వెబ్‌సైట్ https://cpri.res.in రిఫర్ చేయవచ్చును మరియు డాక్యుమెంట్ల యొక్క అన్ని సంబంధిత కాపీలతో వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన నిర్దేశిత నమూనా ప్రకారం తమ దరఖాస్తును 20-10-2023లోగా దాఖలు చేయవలెను. గడువు తేది తరువాత అందిన దరఖాస్తులు పరిశీలించబడవు.
చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
CBC 34104/12/0013/2324

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌పై అధ్యయనానికి ప్రతిష్ఠాత్మక బహుమతి
- 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ప్రకటన

స్టాక్‌హోమ్: భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి లభించింది. 'ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' మంగళవారం ఫిజిక్స్‌లో నోబెల్ ప్రైజ్ విజేతలను ప్రకటించింది. అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన పియరీ అగోస్తినీ, జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్వాంటమ్ ఆప్టిక్స్, లుడ్విగ్ మాక్సిమిలియన్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన ఫెరెంక్ క్రౌజ్, స్వీడన్‌లోని లుండ్ యూనివర్సిటీకి చెందిన అన్నె ఎల్ హుయిలర్‌ను ఈ బహుమతి వరించింది. అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌ను అధ్యయనం చేయడంతోపాటు కాంతికి సంబంధించిన అట్టోసెకను పల్స్‌లను గుర్తించే విధానాలను అభివృద్ధి చేసినందుకు వీరికి ఈ నోబెల్ ప్రైజ్ అందజేస్తున్నట్లు ద రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. వీరి పరిశోధనల ఫలితంగా అణువులు, పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల కదలికలను అధ్యయనం చేయడానికి మానవళికి కొత్త ఉపకరణాలు అందాయని తెలియజేసింది. ఇదిలా ఉండగా, భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్న ఐదో మహిళగా ఎల్ హుయిలర్ రికార్డు సృష్టించారు. తనకు నోబెల్ ప్రైజ్‌ను ప్రకటించడాన్ని ఇంకా నమ్మలేకపోతున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. 2022లో కూడా భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి లభించింది. రసాయన శాస్త్రంలో నోబెల్ విజేతను బుధవారం ప్రకటించనున్నారు.

మెక్సికోలో కూలిన చర్చి పైకప్పు.. 11 మంది మృతి

మెక్సికో: మెక్సికోలోని సియూడడ్ మాడెరో పట్టణంలో శాంతాక్రజ్ చర్చిలో పైకప్పు కూలిపోయిన దుర్ఘటనలో 11 మంది మరణించారు. పట్టణానికి చెందిన మోనికా సెగురా మేనల్లుడు ఏడాది వయసున్న పిల్లాడికి బాప్టిజం కార్యక్రమం నిర్వహించడానికి వచ్చినప్పుడు ఈ ఘటన జరిగింది. మోనికా కుటుంబసభ్యులు, బంధువులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హఠాత్తుగా పైకప్పు కూలి కింద పడడంతో ఆమె కుటుంబానికి చెందినవారే 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారు కిటికీ అద్దాలు బద్దలు కొట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. నిర్మాణంలో లోపాల కారణంగానే చర్చి పైకప్పు కూలినట్టుగా రాష్ట్ర భద్రతా కార్యాలయం తెలిపింది. పైకప్పు కూలిపోయిన సమయంలో సామూహిక బాప్టిజం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టుగా చర్చి ఫాదర్ ఏంజెల్ వర్గాస్ చెప్పారు. దీంతో అక్కడే చాలా మంది ఉండడంతో అందరిపైనా సిమెంట్ పెళ్లలు విరిగిపడ్డాయని వివరించారు.

ఎలక్ట్రాన్ల ప్రపంచానికి కొత్త 'కాంతి పుంజం'

24 ఫ్రేమ్స్ గురించి మీరు వినే ఉంటారు. సెకనుకు ఇరవై నాలుగు ఫ్రేమ్‌ల చొప్పున రీలు తిరిగితే తెరపై బొమ్మ, ఆట, పాట, మాట అన్నీ సవ్యంగా కనిపిస్తాయి! సినిమాకైతే ఇలా ఓకే కానీ పరమాణువుల్లోని ఎలక్ట్రాన్లను చూడాలనుకోండి లేదా వాటి కదలికలను అర్థం చేసుకోవాలనుకోండి. అస్సలు సాధ్యం కాదు! ఈ అసాధ్యాన్నీ సుసాధ్యం చేయడంలో కీలకపాత్ర పోషించారు కాబట్టే పియరీ అగోస్తినీ, ఫెరెంక్ క్రౌజ్, అనే ఎల్ హుయిలర్ చేసిన ప్రయోగాలకు ఈ ఏటి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. ఇంతకీ ఏమిటీ ప్రయోగాలు? వాటి ప్రయోజనాలేమిటి?


భర్త, కుమారునితో కలిసి సంబరాలు చేసుకుంటున్న శాస్త్రవేత్త హుయిలర్

అట్టోసెకను ఫిజిక్స్

ఒక సెకను కాలంలో కాంతి ఎంత దూరం ప్రయాణిస్తుందో మీకు తెలుసా? మూడు లక్షల కిలోమీటర్లకు పిసరంత తక్కువ. మరి అట్టోసెకను కాలంలో? సెకను.. అర సెకను.. పావు సెకను తెలుసు కానీ ఈ అట్టోసెకను ఏమిటి? 3,711 కోట్ల సంవత్సరాల కాలంలో ఒక సెకను ఎంతో సెకనులో అట్టోసెకను అంతన్నమాట! ఇంకోలా చెప్పాలంటే.. టెన్ టు ద పవర్ ఆఫ్ మైనస్ 18. గందరగోళం లేకుండా ఉండాలని అనుకుంటే.. సూక్ష్మాతి సూక్ష్మమైన కాలావధి అని అనుకుందాం. ఇంత తక్కువ సమయంలోనూ కాంతి 0.3 మైక్రోమీటర్లు లేదా ఒక వైరస్ పొడవు అంత దూరం ప్రయాణించగలదు. ఈ సంవత్సరం భౌతికశాస్త్ర నోబెల్ ప్రైజ్ గ్రహీతలు ఇంత సూక్ష్మస్థాయిలో కాంతి పుంజాలను విడుదల చేయగల టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. ముందుగా చెప్పుకున్నట్లు ఎలక్ట్రాన్ల కదలికలు, కాంతికి, పదార్థానికి మధ్య ఉన్న సంబంధాలను అర్థం చేసుకునేందుకు ఈ అట్టోసెకను ఫిజిక్స్ చాలా ఉపయోగపడుతుంది. అంతేకాదు.. వీరి ప్రయోగాల పుణ్యమా అని అణువులు, పరమాణువుల లోపలి కణాలను మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడింది.

మ్యూనిచ్‌లో ఓ సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఫెరెంక్ క్రౌజ్


కాంతి పుంజాల విశ్లేషణ

2001లో అమెరికాకు చెందిన పియరీ అగోస్తినీ ఈ అట్టోసెకను కాంతి పుంజాలను ఉత్పత్తి చేయడం మాత్రమే కాకుండా సుమారు 250 అట్టోసెకన్ల కాలం ఉండే కాంతి పుంజాలను విశ్లేషించడంలోనూ విజయం సాధించారు. ఈ కాలంలోనే జర్మనీకి చెందిన ఫెరెంక్ క్రౌజ్ కూడా ఈ అట్టోసెకను కాంతి పుంజాలపై పరిశోధనలు చేస్తూండేవారు. కాకపోతే ఈయన 650 అట్టోసెకన్ల కాలపు కాంతి పుంజాన్ని వేరు చేయడంలో విజయవంతం కావడం గమనార్హం. ఒకప్పుడు అసాధ్యం అని అనుకున్న ప్రాసెస్‌లను కూడా గమనించడం ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాల వల్ల ఇప్పుడు వీలైంది. ''ఎలక్ట్రాన్ల ప్రపంచానికి ఈ ప్రయోగాలు తలుపులు తెరిచాయి. అట్టోసెకన్ ఫిజిక్స్ ద్వారా ఎలక్ట్రాన్లలో జరుగుతున్న కార్యకలాపాలను గమనించడం వీలైంది. ఇకపై ఈ విషయాలను వాడుకోవడం ఎలా? అన్నది మొదలవుతుంది'' అని నోబెల్ అవార్డు భౌతిక శాస్త్ర కమిటీ అధ్యక్షులు ఎవా ఓల్సన్ వ్యాఖ్యానించడం విశేషం.


వ్యాధుల నిర్ధారణలోనూ ఉపయోగకరం

ఈ అట్టోసెకను ఫిజిక్స్‌ను ఎలక్ట్రానిక్స్‌లో సమర్థంగా ఉపయోగించుకునేందుకు అవకాశముంది. ఎలక్ట్రాన్లు ఏ రకమైన పదార్థంతో ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకోగలిగితే.. అతితక్కువ విద్యుత్తును ఉపయోగించుకుని మరింత సమర్థంగా పనిచేయగల ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేయడం వీలవుతుంది. ఎలక్ట్రాన్ల ప్రవాహాన్నే మనం విద్యుత్తు అంటామన్నది తెలిసిందే. వేర్వేరు మూలకాలను గుర్తించేందుకు అట్టోసెకను కాంతి పుంజాలు ఉపయోగపడతాయి కాబట్టి.. భవిష్యత్తులో వ్యాధుల నిర్ధారణకు కూడా వీటిని వాడుకోవడం వీలవుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

1987లో శ్రీకారం

అట్టోసెకను కాలపు కాంతి పుంజాలతో ఫొటోలు తీస్తే అణువులు, పరమాణువుల్లో జరిగే కార్యకలాపాలేమిటన్నది స్పష్టంగా తెలుస్తాయి. ఈ అట్టోసెకను కాంతి పుంజాల తయారీకి 1987లో స్వీడన్‌కు చెందిన ఎల్ హుయిలర్ శ్రీకారం చుట్టారని చెప్పాలి. అప్పట్లో ఈ శాస్త్రవేత్త జడ వాయువు గుండా పరారుణ కాంతిని ప్రసారం చేసినప్పుడు వేర్వేరు ఛాయలున్న రంగులు బయటకొస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో ఛాయ పరారుణ కాంతి జడ వాయువులోని పరమాణువులతో జరిపిన పరస్పర చర్యల ఫలితం. కొన్ని ఎలక్ట్రాన్లు ఈ లేజర్ కిరణాల ద్వారా అదనపు శక్తి పొంది దాన్ని విడుదల చేస్తూంటాయి అన్నమాట. ఈ అంశంపై ఎల్ హుయిలర్ తన ప్రయోగాలు కొనసాగించగా ఆ తరువాతి కాలంలో అనేక కీలకమైన ఫలితాలు లభించాయి.

మీడియాతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త పియరీ అగోస్తినీ


సెకను కంటే తక్కువ సమయాన్ని ఇలా సూచిస్తారు

- సెకనులో వెయ్యో వంతు... ఒక మిల్లీ సెకను
- మిల్లీ సెకనులో వెయ్యో వంతు.. ఒక మైక్రో సెకను
- ఒక మైక్రో సెకనులో వెయ్యో వంతు... ఒక నానో సెకను
- ఒక నానో సెకనులో వెయ్యో వంతు.. ఒక పికో సెకను
- ఒక పికో సెకనులో వెయ్యో వంతు.. ఒక ఫెమ్టో సెకను (లాసిక్ కంటి శస్త్రచికిత్సల్లో ఈ స్థాయి లేజర్ కిరణాలను వాడతారు)
- ఒక ఫెమ్టో సెకనులో వెయ్యో వంతు.. ఒక అట్టో సెకను

రామ సేతు 'జాతీయ స్మారకం' పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: తమిళనాడు తీరప్రాంతం, వాయవ్య శ్రీలంకలోని మన్నార్ ద్వీపం మధ్య ఉన్న పురాతన సున్నపురాళ్ల 'రామసేతు'ను జాతీయ స్మారకంగా ప్రకటించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కోర్టు మంగళవారం తిరస్కరించింది. ' ఇది పరిపాలనా వ్యవహారం. ఇందులో కోర్టు ఏమీ చేయలేదు' అంటూ జస్టిస్ సంజయ్ కౌల్, జస్టిస్ సుధాంషు ధులియాల ధర్మాసనం పిల్‌ను తిరస్కరించింది. హిందూ పర్సనల్ లా బోర్డ్ తరఫున సంస్థ అధ్యక్షుడు అశోక్ పాండే ఈ పిటిషన్ వేశారు. జాతీయ వారసత్వ స్మారకంగా ప్రకటించాలంటూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటిషన్‌తో తన పిటిషన్‌ను జత చేయాలని పాండే విజ్ఞప్తి చేశారు. ' సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉంటే ఉండనివ్వండి. అది అలాగే ఉంటుంది' అంటూ పాండే పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది.


పాదరక్షలు భద్రపరిచే గదిలో సేవ చేస్తున్న రాహుల్ గాంధీ

స్వర్ణదేవాలయంలో రాహుల్ సేవలు

అమృత్‌సర్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని వరసగా రెండో రోజు మంగళవారం సందర్శించారు. లంగర్‌లో అందరితో కలిసి సామాన్యుడిలా కింద కూర్చొని ముచ్చట్లు చెబుతూ కూరలు తరిగారు. ఆ తర్వాత గిన్నెలు కూడా తోమారు. తలకి నీలిరంగు తలపాగా చుట్టుకున్న రాహుల్ గాంధీ ఆలయానికి వచ్చిన భక్తులకి అన్నప్రసాదాన్ని కూడా వడ్డించారు. తర్వాత తాను కూడా నేల మీద కూర్చొని భోజనం చేశారు. కమ్యూనిటీ కిచెన్‌లోనే రాహుల్ గాంధీ ఎక్కువ సేపు ఉన్నారు. కీర్తనలు వింటూ కాసేపు కాలం గడిపారు.

హిందువులను విభజించే కుట్ర

- కాంగ్రెస్ కుల గణన డిమాండ్‌పై మోదీ నిప్పులు
- ఆ పార్టీ విదేశాలతో చేతులు కలిపిందంటూ ఆరోపణ
- ముస్లింల హక్కులను తగ్గించాలనుకుంటోందా అని ప్రశ్న



జగ్దల్‌పూర్: జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. ఆ వంకతో హిందువులను విభజించేందుకు, తద్వారా దేశాన్ని నాశనం చేసేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. 'కుల గణన చేపట్టి జనాభా ఆధారంగా వనరులను పంచాలనడంలో కాంగ్రెస్ ఉద్దేశం ఏమిటి తద్వారా ముస్లింలు, మైనారిటీల హక్కులను తగ్గించాలనుకుంటోందా? దేశంలో ఎవరి జనాభా ఎక్కువగా ఉంది? అత్యధిక జనాభాగా ఉన్న హిందువులే ముందుకొచ్చి హక్కులన్నీ తమకే కావాలని డిమాండ్ చేయాలా? కాంగ్రెస్ ఆశిస్తున్నదేమిటి?' అని మండిపడ్డారు. 'పేదలే నా తొలి ప్రాథమ్యం. కుల మతాలతో నిమిత్తం లేకుండా వనరులపై తొలి హక్కు వారికే చెందాలన్నది నా అభిమతం. కానీ కాంగ్రెస్ మాత్రం కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం కులం, మతం ఆధారంగా సమాజాన్ని విడదీయాలని చూస్తోంది' అని దుయ్యబట్టారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జగ్దల్‌పూర్‌లో పరివర్తన్ మహా సంకల్ప ర్యాలీలో మోదీ మాట్లాడారు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ తాజాగా కుల గణన వివరాలు వెల్లడించడం, దాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అభినందించడం తెలిసిందే. అంతేగాక ప్రజలకు జనాభాలో వారి శాతానికి అనుగుణమైన నిష్పత్తిలో హక్కులు కల్పించేందుకు వీలుగా దేశమంతా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

కాంగ్రెస్‌తో జాగ్రత్త

కాంగ్రెస్ పార్టీ ఒక విదేశంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంలో చాలా ఆనందం పొందుతోందన్నారు. 'దేశంలోకెల్లా అతి పురాతన పార్టీ అయిన కాంగ్రెస్‌ను దాని నాయకులు కాకుండా, దేశ వ్యతిరేక గ్రూపులతో చేతులు కలిపిన తెర వెనక శక్తులు నడుపుతున్నాయి. అందుకే ఆ పార్టీతో జాగ్రత్తగా ఉండాలి' అని ప్రజలను హెచ్చరించారు. దేశానికి కాంగ్రెస్ కేవలం పేదరికం మాత్రమే ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కుటుంబ స్వామ్యంగా, అవినీతికి మార్గంగా మార్చిన ఘనత ఆ పార్టీదేనన్నారు. 2014కు ముందు కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ పాలనలో ఎంతెంత పెద్ద కుంభకోణాలు జరిగాయో తెలుసుకోవాలని కొత్త ఓటర్లకు సూచించారు. అవినీతిలో, నేరాల్లో కాంగ్రెస్ పాలిత రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ పోటీ పడుతున్నాయని ఎద్దేవా చేశారు.

కింది స్థాయి నుంచి ప్రగతి...

భారత్ అభివృద్ధి చెందాలన్న అందరి స్వప్నం సాకారం కావాలంటే గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలు పూర్తిగా ప్రగతి సాధించినప్పుడే సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. దేశం అభివృద్ధి చెందాలంటే భౌతిక, డిజిటల్, సామాజిక తదితర మౌలిక వనరులన్నీ భావి అవసరాలకు అనుగుణంగా రూపొందాల్సి ఉందన్నారు. అందుకే మౌలిక సదుపాయాలకు కేటాయింపులను తాజా బడ్జెట్‌లో బాగా పెంచి ఏకంగా రూ.10 లక్షల కోట్లకు చేర్చామన్నారు. ఉక్కు ఉత్పత్తిలో దేశాన్ని ఆత్మ నిర్భర్‌గా మార్చేందుకు గత తొమ్మిదేళ్లలో పలు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో రూ.27,000 కోట్ల పైచిలుకు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. జగ్దల్‌పూర్ లో ఎన్ఎండీసీ ప్లాంటును జాతికి అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఈ ప్లాంటు పరిసర జిల్లాల్లో కనీసం 50 వేల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాలను మరింత మెరుగు పరచాలన్నదే తన ఉద్దేశమన్నారు. అందుకు కేంద్రం ఎన్నో చర్యలు చేపడుతోందని చెప్పారు.

'న్యూస్‌క్లిక్'లో పోలీసుల సోదాలు

- 100 ప్రాంతాల్లో 500 మంది ఢిల్లీ పోలీసుల తనిఖీలు
- సంస్థ సిబ్బంది, జర్నలిస్టుల ఇళ్లలోనూ.. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఉపకరణాల స్వాధీనం
- న్యూస్‌క్లిక్ ఎడిటర్–ఇన్–చీఫ్ అరెస్ట్

న్యూఢిల్లీ: చైనా అనుకూల సమాచారాన్ని భారత్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు భారీ స్థాయిలో నగదును స్వీకరించిందన్న ఆరోపణలపై ఆన్‌లైన్ న్యూస్‌పోర్టల్ 'న్యూస్‌క్లిక్'పై ఢిల్లీ పోలీసులు ఆకస్మిక సోదాలు చేపట్టారు. సంస్థకు సంబంధించిన ఆఫీసులతోపాటు అందులో పనిచేసే జర్నలిస్టులు, సిబ్బందికి సంబంధించిన ఇళ్లలోనూ పోలీసులు విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు, ఎడిటర్–ఇన్–చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థా, హెచ్ఆర్ చీఫ్ అమిత్ చక్రవర్తిని మొదట ప్రశ్నించిన పోలీసులు ఆ తర్వాత ఇద్దరినీ అరెస్ట్‌చేశారు. 100 ప్రాంతాల్లో ఏకంగా 500 మంది ఢిల్లీ పోలీసులు ఒకేసమయంలో దాడిచేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్, ముంబైలలో ఈ సోదాలు జరిగాయి. సోదాలు చేయాల్సిన వ్యక్తులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. ఏ కేటగిరీలో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తలొచ్చాయి. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి చెందిన ఢిల్లీలోని నివాసంలోనూ సోదాలు జరిగాయి. ఆయనకు సహాయకునిగా ఉండే శ్రీనారాయణ్ కుమారుడు సుమిత్ ఇదే న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తుండటంతో ఏచూరి ఇంట్లోనూ పోలీసు తనిఖీలు కొనసాగాయి. దీంతో ఏచూరి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలోని సంస్థ ముఖ్య కార్యాలయంలోని వారిని ప్రశ్నించాక ఆ ఆఫీస్‌కు పోలీసులు సీలువేశారు. విదేశీ ప్రయాణాలు, పౌరసత్వ(సవరణ) చట్టంపై షాహీన్‌బాగ్ వద్ద చెలరేగిన ఆందోళనలు, రైతుల ఉద్యమాలు తదితరాలపై జర్నలిస్టులను 25 అంశాలపై ప్రశ్నించామని పోలీసులు వెల్లడించారు. న్యూస్‌క్లిక్‌కు నిధులు ఎలా వస్తున్నాయనే కోణంలో గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యూస్‌క్లిక్ కార్యాలయాల్లో సోదాలు చేయడం తెల్సిందే. ఈ విషయంలో ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు అందించిన సమాచారంతోనే మంగళవారం ఢిల్లీ పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం, నేరమయ కుట్ర సెక్షన్ల కింద కొత్తగా కేసు నమోదుచేసి దాడులు చేశారు. ఈ సందర్భంగా పలువురి నుంచి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, హార్డ్ డిస్కులు, ఫ్లాష్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్ట్ 17న అత్యంత కఠిన ఉగ్రవ్యతిరేక చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)చట్టం కింద నమోదైన కేసు ఆధారంగానే కొత్తను నమోదుచేసి దర్యాప్తు వేగవంతం చేశారు. చైనాతో సంబంధం ఉన్న కొన్ని సంస్థల నుంచి గత మూడేళ్లకాలంలో రూ.38.05 కోట్ల నగదు న్యూస్‌క్లిక్ పోర్టల్‌కు ముట్టిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈ నగదులో కొంత మొత్తం పాత్రికేయులు గౌతమ్ నవ్‌లఖా, తీస్తా సీతల్వాడ్‌లకు చేరినట్లు ఆరోపిస్తోంది.


పుర్కాయస్థాను ఢిల్లీ పోలీస్ ఆఫీస్‌కు తీసుకొస్తున్న దృశ్యం

విపక్షాల తీవ్ర విమర్శలు

మీడియా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సమాజ్‌వాదీ సహా పలు విపక్ష పార్టీలు ప్రభుత్వ తీరును తూర్పారబట్టాయి. ఎడిటర్స్ గిల్డ్, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాసహా పలు మీడియా సంఘాలు పోలీసు దాడులను ఖండించాయి. మోదీ సర్కార్‌ను విమర్శించే పాత్రికేయులపై ప్రభుత్వం కత్తిగట్టిందని ఆక్షేపించాయి.

10లోగా దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించండి

కెనడాకు భారత్ అల్టిమేటమ్

న్యూఢిల్లీ: భారత్, కెనడాల మధ్య ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ నిజ్జర్ హత్య చిచ్చు ఇంకా రగులుతోంది. భారత్‌లో ఉన్న దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించాలని కెనడా హైకమిషనరేట్‌కు భారత్ అల్టిమేటమ్ జారీ చేసింది. భారత్‌లో ఉన్న 41 మంది దౌత్యవేత్తల్ని వెనక్కి తీసుకువెళ్లాలని వార్నింగ్ ఇచ్చిన భారత్ ఈ నెల 10 వరకు గడువు విధించినట్టు విశ్వసనీయమైన వర్గాల సమాచారం. దౌత్య సిబ్బంది సంఖ్య విషయంలో సమానత్వం ఉండాలని భారత్ ఎప్పట్నుంచో వాదిస్తోంది. నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్‌లో కెనడాకు చెందిన 62 మంది దౌత్యవేత్తలు ఉన్నారు. అందులో 41 మందిని తగ్గించాలంటూ కెనడా రాయబార కార్యాలయానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్టుగా జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఒకవేళ గడువులోగా దౌత్యవేత్తల్ని వెనక్కి పిలవకపోతే వారికి రక్షణ కల్పించలేమని కూడా ప్రభుత్వం తెగేసి చెప్పినట్టుగా సమాచారం.

విక్రమ్ ల్యాండర్ మళ్లీ గెంతింది



న్యూఢిల్లీ: చంద్రుడి ఉపరితలంపై 14 రోజులపాటు గడ్డకట్టే చలిలో గడిపిన విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు ఇక శాశ్వత నిద్రలోకి జారుకుంటున్నాయని భావిస్తున్న వేళ ఇస్రో తాజాగా మరో ప్రయోగం విజయవంతంగా చేపట్టింది. విక్రమ్ ల్యాండర్‌లోని ఇంజన్లను మండించి కాస్తంత ఎత్తుకు ఎగిరేలా చేసి పక్కన దిగేలా చేశారు. భవిష్యత్తులో చంద్రుడిపై సేకరించే మట్టి, ఇతరత్రా శాంపిళ్లలను తిరిగి భూమి మీదకు తేవడానికి అక్కడి నుంచి వ్యోమనౌక టేకాఫ్ కావడం ముఖ్యం. అందులోభాగంగా సంబంధిత ప్రయోగాన్ని విక్రమ్ ల్యాండర్‌తో చేశారు. ప్రస్తుతం అది ఉన్న శివశక్తి పాయింట్ నుంచి 40 సెంటీమీటర్లు ఎత్తుకు ఎగిరి తర్వాత 30 సెంటీమీటర్ల పక్కకు జరిగి సురక్షితంగా ల్యాండ్ అయింది. 'ఈ హాప్ ప్రక్రియ ముందుగా మా ప్లాన్‌లో లేదు. షెడ్యూల్‌లో లేకపోయినా ప్రయోగాత్మకంగా చేసి చూశాం. విజయం సాధించాం' అని చంద్రయాన్–3 ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వీరముత్తువేల్ మీడియాకు వెల్లడించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంలో పూర్తిగా చిమ్మచీకటి, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే 14 రోజుల చంద్ర రాత్రి(లూనార్ నైట్) నుంచి మేలుకుని మళ్లీ కీలక ప్రయోగాలకు విక్రమ్, ప్రజ్ఞాన్‌లు సిద్ధం కాబోవనే సూచనలు కనిపిస్తున్నాయి. లూనార్ నైట్ ముగిసి సూర్యకాంతి ప్రసరించి ఇన్ని రోజులైనా ల్యాండర్, రోవర్ నుంచి ప్రతిస్పందనలు లేవు.

అంతరిక్షంలో చెత్త వదిలినందుకు రూ.1.24 కోట్ల జరిమానా

వాషింగ్టన్: అంతరిక్షంలో చెత్తను వదిలేసినందుకు డిష్ నెట్‌వర్క్ కంపెనీకి అమెరికా ప్రభుత్వానికి చెందిన ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్(ఎఫ్‌సీసీ) 1,50,000 డాలర్ల(రూ.1.24 కోట్లు) జరిమానా విధించింది. అంతరిక్షంలో ప్రమాదకరమైన చెత్త వదిలినందుకు ఇలా జరిమానా విధించడం అమెరికాలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. డిష్ నెట్‌వర్క్ కంపెనీ 2002లో ఎకోస్టార్–7 అనే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. భూమి నుంచి 36,000 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలోకి చేరుకున్న ఈ ఉపగ్రహం కాలపరిమితి 2022లో ముగిసింది. నిరుపయోగంగా మారిన ఉపగ్రహాన్ని కక్ష్య నుంచి 299 కిలోమీటర్ల దూరం పంపించాల్సి ఉంది. 122 కిలోమీటర్లు వెళ్లాక ఇంధనం నిండుకోవడంతో అక్కడే ఆగిపోయింది. ప్రస్తుతం భూమిచుట్టూ పరిభ్రమిస్తోంది. ఇతర ఉపగ్రహాలకు ప్రమాదకరంగా మారింది. అంతరిక్షంలో కాలం చెల్లిన ఉపగ్రహాలను చెత్తగానే పరిగణిస్తారు. 1957 నుంచి ఇప్పటిదాకా 10 వేలకుపైగా శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రయోగించారు. వీటిలో సగం శాటిలైట్లు పనిచేయడం లేదు.

బ్రిటన్ వీసాల ఫీజు పెంపు నేటి నుంచే..



లండన్: బ్రిటన్ ఇటీవల ప్రకటించిన విద్యార్థి, పర్యాటక తదితర అన్ని వీసా ఫీజుల పెంపు నిర్ణయం బుధవారం నుంచే అమల్లోకి రానుంది. ఇక విద్యార్థి వీసా ఫీజు మరో 127 పౌండ్లు, ఆర్నెల్ల లోపు పర్యాటక వీసా మరో 15 పౌండ్ల చొప్పున పెరగనున్నాయి. పెంపుతో బ్రిటనేతరుల విద్యార్థి వీసా ఫీజు 490 పౌండ్లకు, పర్యాటక వీసా ఫీజు 115 పౌండ్లకు చేరాయి. కీలకమైన ప్రజా సేవలు తదితరాలకు నిధుల సేకరణ కోసం వీసా ఫీజులు పెంచాల్సి వచ్చిందని హోంశాఖ తెలిపింది. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొంది.

ఢిల్లీలో భూప్రకంపనలు

న్యూఢిల్లీ: నేపాల్‌లో వరసగా నాలుగుసార్లు సంభవించిన భూకంపాల ప్రభావం ఉత్తర భారతాన్ని వణికించింది. ఢిల్లీలో భూ ప్రకంపనల ధాటికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకి పరుగులు తీశారు. నేపాల్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.19 గంటల మధ్య నాలుగు సార్లు భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేలుపై 6.2 వరకు తీవ్రత నమోదైంది. ఈ భూకంపం ధాటికి పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఉత్తరాఖండ్‌లో జోషి మఠ్ నుంచి 206 కి.మీ. దూరంలో నేపాల్‌లో సంభవించిన భూకంపం ప్రభావం ఢిల్లీతో సహా ఉత్తర భారతంపై పడింది. భూ ప్రకంపనల ధాటికి ఇళ్లు ఊగడంతో ప్రజలు ప్రాణభయంతో బయటకి పరుగులు తీశారు. ఎత్తైన భవనాల్లో ఉన్న వారు భయాందోళనలకు లోనుకాకుండా వెంటనే బయటకు రావాలని ఢిల్లీ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. చండీగఢ్, జైపూర్, ఉత్తర భారతంలో కొన్ని ప్రాంతాల్లో కూడా భూ ప్రకంపనలు ప్రజల్ని భయపెట్టాయి.

వివేక్ రామస్వామి పిల్లలకు ఆయా కావాలి

26 వారాలకు వేతనం రూ.80 లక్షల పైమాటే..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్న రిపబ్లికన్ పార్టీ నేత, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఒక మంచి ఆయా(నానీ) కోసం చూస్తున్నారు. ఆయనకు భార్య అపూర్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు చిన్నపిల్లలు. దగ్గరుండి వారి ఆలనాపాలనా చూసుకోవడానికి ఆయాను నియమించుకోవడానికి వివేక్ రామస్వామి ప్రయత్నిస్తున్నారు. రిక్రూట్‌మెంట్ స్టాఫింగ్ వెబ్‌సైట్ 'ఎస్టేట్‌జాబ్స్.కామ్'లో ఈ మేరకు ఒక ప్రకటన ఇచ్చారు. ఆయాకు 26 వారాల పనికి లక్ష డాలర్ల (రూ.80 లక్షలకుపైగానే) వేతనం ఆఫర్ చేశారు. ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని తెలిపారు. వివేక్ రామస్వామి పిల్లల సంరక్షణ కోసం వారానికి 84 నుంచి 96 గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. వారాంతపు సెలవు తీసుకోవచ్చు. అంతా అనుకున్నట్లుగా జరిగితే అమెరికా ఎన్నికల ప్రచారంలో వివేక్ రామస్వామి బిజీగా మారబోతున్నారు. పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయించలేకపోవచ్చు. అందుకే ఆయాను నియమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

శాఖాహారం వద్దు అన్నందుకు రూ.10 వేల శిక్ష

ముంబై: ఈ ఆరు టేబుళ్లపై శాఖాహారమే ఉంటుంది అంటూ మెస్ కౌన్సిల్ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకించిన ఒక విద్యార్థికి రూ.10వేల అపరాధ రుసుం శిక్ష పడింది. ఘటన తాలూకు పూర్వాపరాలు ఓ సారి చూద్దాం. కేవలం శాఖాహారం తినే తమ విద్యార్థుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బాంబే(ఐఐటీ బాంబే) మెస్ కౌన్సిల్ వారు 12, 13, 14వ నంబర్ హాస్టళ్లలో విడిగా టేబుల్స్ వేశారు. ఆరు టేబుళ్లు వేసి 'ఈ ఆరు టేబుళ్లు వెజిటేరియన్‌లకు మాత్రమే' అని బోర్డు పెట్టారు. దీనిని కొందరు మాంసాహార ప్రియులు వ్యతిరేకించారు. శాంతియుత నిరసన కార్యక్రమం అంటూ అవే టేబుళ్లపై మాంసాహారం భుజించి నానా రభస చేశారు. ఉద్దేశపూర్వకంగా కొందరు ఇలా ఇన్‌స్టిట్యూట్‌లో ప్రశాంత వాతావరణాన్ని ఉద్రిక్తంగా మార్చారని మెస్ కౌన్సిల్ అంతర్గత పరిశీలనలో బయటపడింది. ఇందుకు బాధ్యుల్లో ఒకరికి రూ.10వేల శిక్ష వేసింది. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉంది.

థాయ్ మాల్‌లో కాల్పులు.. ఇద్దరు మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో అతి పెద్ద షాపింగ్‌మాల్‌లో కాల్పులు అందరినీ ఉలిక్కిపడేలా చేశాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారు. బ్యాంకాక్‌లో సియామ్ పారగాన్ షాపింగ్ మాల్‌లో ఒక మైనర్ బాలుడు తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఇద్దరు పర్యాటకులు మరణించారు. చైనా నుంచి వచ్చిన ఒక పర్యాటకుడు, మయన్మార్ నుంచి వచ్చిన మరొకరు ప్రాణాలు కోల్పోయినట్టుగా పోలీసు చీఫ్ తొర్సాక్ సుక్విమోల్ వెల్లడించారు. మాల్‌లో కాల్పుల శబ్దం వినిపించగానే మాల్ నిర్వాహకులు అలారం మోగించడంతో షాపింగ్ చేయడానికి వచ్చిన వారంతా బయటకు పరుగులు తీయడం, ఆ మాల్ లోపల అల్మారాల వెనుక దాక్కోవడం చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కాల్పులు జరిపినది 14 ఏళ్ల టీనేజర్ అని తేల్చారు. పొడవైన జుట్టుతో, కళ్లద్దాలు పెట్టుకొని, తలపై పెట్టుకున్న టోపీకి అమెరికా జాతీయ పతాకం పెట్టుకొని ఉన్నాడు. ఈ ఘటన జరిగిన గంటలోగా ఆ టీనేజర్‌ని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు పోలీసు చీఫ్ వెల్లడించారు.



ప్రజారోగ్యమే లక్ష్యం

ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్ ఉదయభాను అన్నారు. ▸ 8లో



నాణ్యత లోపిస్తే సహించం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాపరెడ్డి స్పష్టంచేశారు. ▸ 8లో



ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలి

వైద్య విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. బందరు ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు వైట్ కోట్ కార్యక్రమం నిర్వహించారు. ▸ 8లో

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి ఐదో విడత అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోగా దరఖాస్తు చేసుకున్న కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకువెళ్లి ఆన్‌లైన్‌లో పరిశీలన ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల ఆన్‌లైన్ పరిశీలన పూర్తయిన వారే కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరాలనుకునే వారికి ఈ నెల 9 తేదీన, ప్రైవేటు ఐటీఐలో చేరాలనుకునే వారికి 10న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94906 39639, 77804 29468లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

జిల్లాలో 91.90 శాతం పింఛన్ పంపిణీ



లబ్బీపేటలో మేరీ జెసింతకు పింఛన్ అందిస్తున్న వార్డు వలంటీర్ సుధీర్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మొదటి మూడు రోజుల్లో 91.90 శాతం పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,37,888 లబ్ధిదారులకుగాను 2,18,623 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి. కొండూరు మండలంలో 98.69 శాతం, కొండపల్లి అర్బన్‌లో 97.05, తిరువూరు 96.96 శాతం, కంచికచర్లలో 96.63 శాతం వీరులపాడు మండలంలో 96.62 శాతం పంపిణీ పూర్తయింది.

77 మంది అభ్యర్థుల పత్రాలు పరిశీలన

పెడన: సమగ్ర శిక్ష ఐఈఆర్‌టీలో మానసిక వైకల్యం(ఎంఆర్) కేటగిరీకి సంబంధించిన 96 మంది అభ్యర్థులకుగాను 77 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మంగళవారం మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో సమావేశం హాలులో జరిగిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనను సమగ్ర శిక్ష ఏపీసీ ఎం. ఫణిధూర్జటి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎంఆర్ కేటగిరీలో 96 మందికిగాను 77 మంది హాజరయ్యారని మిగిలిన వారంతా బుధవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు. హెచ్ఐ, వీఐ కేటగిరీకి సంబంధించిన 77 మంది అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ఏపీసీ పేర్కొన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్‌కు మేరీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల టెన్త్‌క్లాస్ విద్యార్థిని మేరీ రత్నకుమారి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పద్మలత మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి ఈనెల 2 వరకు నంద్యాలలో జరిగిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాల నుంచి ఐదుగురు బాలికలు ప్రాతినిధ్యం వహించగా, మేరీరత్నకుమారి అత్యుత్తమ ప్రతిభతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి 14వరకు విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలంలో జరిగే జాతీయ కోచింగ్‌కు హాజరై.. 15 నుంచి 20వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. డీవైఈవో వెంకటప్పయ్య, ఎంఈవో-2 రత్నశ్యామ్‌బాబు, పీడీలు శిరేఖ, రత్నం, రిజ్వానా బాలికను అభినందించారు.

యార్డుకు 39,041 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 39,041 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 37,152 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.23,000 వరకు పలికింది.

పనులకు నో బ్రేక్!

- రూ.350 కోట్ల విలువైన పనులు పూర్తి
- ముగిసిన నార్త్ బ్రేక్ వాటర్ వర్క్స్, కొనసాగుతున్న సౌత్ బ్రేక్ వాటర్ పనులు
- డ్రెడ్జింగ్ ప్రారంభం, ముమ్మరంగా ప్రహరీ నిర్మాణం

శరవేగంగా బందరు పోర్టు నిర్మాణం



కొనసాగుతున్న సౌత్ వాటర్ బ్రేక్ పనులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మచిలీపట్నం వాసుల దశాబ్దాల కల సాకారమవుతోంది. పోర్టునిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు పరుగెడుతున్నాయి. పోర్టు నిర్మాణం పనులు పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. ఇందులో భాగంగా మే 22వ తేదీన పనులను ప్రారంభించారు. గతంలో చంద్రబాబు నాయుడు పోర్టు పనులకు శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టారు. అలా కాకుండా ముఖ్యమంత్రి ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అనుమతులు తీసుకొని ఏకంగా పనులనే ప్రారంభించారు. దీంతో పనులు చేసేందుకు ఎలాంటి ఆటంకం లేకపోవడంతో పోర్టు పనులు జెట్ స్పీడ్‌తో ముందుకు సాగుతున్నాయి. మెయిల్ సంస్థ పనులు నిర్వహిస్తోంది. పనులు పూర్తి చేసేందుకు 30నెలల కాల వ్యవధిని నిర్ణయించారు. పోర్టు నిర్మాణానికి సంబంధించి సరిహద్దులు గుర్తించి మార్కింగ్ చేశారు. బీచ్ రోడ్డు నుంచి బ్రేక్ వాటర్ వరకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టారు. శాశ్వత రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే పనులు పూర్తి అయ్యాయి. లేబర్ క్యాంపులు, ఆఫీసులు, అకడమిక్ బ్లాక్‌లు, వెయింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..	
మొదటి దశలో కార్గో రవాణా కెపాసిటీ	35.12 మిలియన్ టన్నులు
ప్రాజెక్టు విలువ	రూ. 5,153.73కోట్లు
బెర్తుల సంఖ్య	4(3–జనరల్ కార్గో, 1–కోల్)
డ్రెడ్జింగ్	–16.40 ఎంసీడీ
షిప్‌లు	80,000 డీడబ్ల్యూటీ
భూసేకరణ	1922 హెక్టార్లు
పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతం	1688.82 హెక్టార్లు
రోడ్డు కనెక్టివిటీ కోసం	234.15 హెక్టార్లు

నేలను పటిష్టం చేసేందుకు..

పోర్టు నిర్మాణపు పనులు జరిగే ప్రాంతంలో ల్యాబ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బెర్తు నిర్మాణం కోసం నేల గట్టిదనాన్ని పరిశీలించి, నేలను పటిష్టం చేస్తున్నారు. అక్కడ పెద్ద స్థాయిలో బొగ్గు, ఇనుము నిల్వ చేస్తారు. కాబట్టి ఆ బరువును తట్టుకొనే విధంగా నేలను గట్టి పరుస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.350 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.

ప్రభుత్వ ఉన్నతాధికారులు పనులను నేరుగా సమీక్షిస్తున్నారు. దీంతో పాటు జిల్లా కలెక్టర్ రాజబాబు, స్థానిక శాసనసభ్యులు పేర్ని నాని, అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, కలిసి క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించి పనుల వేగం పెరిగేలా చర్యలు తీసుకొంటున్నారు.

పనులు తీరు ఇలా...

- సౌత్ బ్రేక్ వాటర్‌కు సంబంధించి 2,075 మీటర్ల పనులు జరగాల్సిండగా ఇప్పటి వరకు 765 మీటర్ల పనులు చేశారు. అంటే 3.60 లక్షల టన్నుల కొండరాళ్లను పరిచారు.
- నార్త్ బ్రేక్ వాటర్‌కు సంబంధించి 250మీటర్ల మేర పనులు జరగాల్సి ఉండగా ఇప్పటికే ఆమేర పనులు పూర్తయ్యాయి. ఇక్కడ 54,254 మెట్రిక్ టన్నుల రాళ్లను పరిచారు.
- సముద్రం ఒడ్డున డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించి, 1.82లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు చేశారు.
- బెర్తులు, ఫెర్టిలైజర్ యార్డు, అడ్మిన్ బిల్డింగ్, కోల్ యార్డు, గోడౌన్ నిర్మాణం జరిగే ప్రాంతంలో 5మీటర్ల మేర పైకి లేపాల్సి ఉండగా, ఇప్పటికే 1.62లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ఫిల్లింగ్ చేశారు. ఈ నిర్మాణాలు జరిగే ప్రాంతంలో భూమి కుంగిపోకుండా 21 లక్షల మీటర్ల మేర పీవీడీ (ప్రీ ప్యాబ్రికేటెడ్ వర్టికల్ డ్రెయిన్స్) రన్నింగ్ లైన్స్ పనులు పూర్తయ్యాయి.
- ప్రహరీకి సంబంధించి ఇప్పటికే 219 పైల్స్ పూర్తి చేశారు. కస్టమ్స్ బిల్డింగ్‌కు సంబంధించిన పనులు సాగుతున్నాయి.
- పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతాన్ని చదును చేసే ప్రక్రియ పూర్తి అయ్యింది. అప్రోచ్ చానల్, రోడ్డు, రైలు కనెక్టివిటీ పనులు సాగుతున్నాయి.



సాగుతున్న కస్టమ్ బిల్డింగ్ పనులు



సౌత్ వాటర్ బ్రేక్ వద్ద పనుల కోసం సామగ్రిని సిద్ధం చేస్తున్న దృశ్యం

పనుల వేగం పెంచాం..



పోర్టు నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతం చేశాం. పనులకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు వచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు సాగే విధంగా, పోర్టు అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమీక్షిస్తున్నాం. భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. అక్కడ సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ పనులతోపాటు, ప్రహరీ, కస్టమ్స్ బిల్డింగ్, బెర్తులు, కోల్‌యార్డు, జరిగే ప్రాంతాల్లో రిక్రమేషన్, పీవీడీ పనులు సాగుతున్నాయి.

– రాజాబాబు,
కలెక్టర్, కృష్ణా జిల్లా

విద్యుత్ వాహనాలతో కాలుష్య నివారణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యుత్ వాహనాన్ని సెల్ఫ్ డ్రైవ్ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వాహనాల వినియోగం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. వీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో విద్యుత్ ద్విచక్ర వాహనాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ ఇంధన భద్రతను పెంచి కాలుష్యాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వాహనాల వినియోగానికి శ్రీకారం చుట్టాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సులభ వాయిదాలపై వాహనాల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వాహనాల వినియోగం ఎంతో సులభతరమని, నిర్వహణ వ్యయం చాలా తక్కువగా ఉంటుందన్నారు. నెడ్ క్యాప్ ఎండీ ఎస్. రమణారెడ్డి మాట్లాడుతూ, కాలుష్య రహిత రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను స్వయంగా నడిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగ జోషి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బుచ్చిరాజు, ధనలక్ష్మి బ్యాంక్ మేనేజర్ జి. సురేఖ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విస్తరణపై కదలిక

- విజయవాడ–మచిలీపట్నం హైవే పెండింగ్ పనులకు మోక్షం
- నిధులు మంజూరుతో పోలీసు, రవాణా, ఎన్‌హెచ్ అధికారుల సందర్శన
- పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ



కొణతనపాడు–ప్రొద్దుటూరు నడుమ అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి



ప్రొద్దుటూరు అడ్డరోడ్డును పరిశీలిస్తున్న పోలీసు, రవాణా, ఎన్‌హెచ్ అధికారులు(ఫైల్)

కంకిపాడు(పెనమలూరు): విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పెండింగ్ పనులపై అధికారులు దృష్టి సారించారు. వీటికి సంబంధించి నిధులు మంజూరు, టెండరు ప్రక్రియ పూర్తికావటంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు జాతీయ రహదారుల శాఖ చర్యలు ప్రారంభించింది. నిర్మాణ పనుల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు, రవాణా శాఖలతో కలిసి క్షేత్రస్థాయి సందర్శనలను పూర్తి చేసి, అవసరమైన కార్యాచరణ రూపొందించింది.

విస్తరణ జరగక.. ప్రమాదాలకు నెలవుగా..

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై కొణతనపాడు అడ్డరోడ్డు ప్రాంతం ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. దీనికి ప్రధాన కారణం నాలుగు లైన్లుగా ఉన్న జాతీయ రహదారి కొణతనపాడు–ప్రొద్దుటూరు నడుమ డబుల్ లైన్‌గా ఉండటమే. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా వేగాన్ని నియంత్రించే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు విస్తరణ పూర్తి కాకపోవటంతో ఏటా ఇక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గడిచిన ఏడాది కాలంలోనే 8 మందికి పైగా మృత్యువాత పడ్డారు. 30 మందికిపైగా ప్రజలు గాయాలపాలయ్యారు. దీన్ని బట్టి ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల తీవ్రత ఎంతో అర్థమవుతుంది. తరచూ జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఈ ప్రాంతాన్ని డేంజర్ జోన్‌గా ఎన్‌హెచ్, పోలీసు శాఖలు గుర్తించాయి.

లైన్ క్లియర్..

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిని జాతీయ రహదారుల శాఖ 64.11 కిలోమీటర్ల పొడవున రూ. 1,886.57 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించటం తెలిసిందే. కంకిపాడు, ఉయ్యూరు, నిడుమోలు ప్రాంతాల్లో రహదారి విస్తరణ పనులు, సర్వీసు రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా కంకిపాడు ప్రాంతంలో కొణతనపాడు–ప్రొద్దుటూరు గ్రామాల నడుమ భూ సేకరణ పరిహారం విషయంలో ఒప్పందం కుదరక, కోర్టు అభ్యంతరాల కారణంగా రోడ్డు విస్తరణ ఈ ప్రాంతంలో నాలుగు లైన్లకు బదులుగా రెండు లైన్లు మాత్రమే జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో జాతీయ రహదారి వెంబడి అసంపూర్తిగా ఉన్న పనులకు సంబంధించి రూ. 30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. జిల్లాలో ఉన్న పెండింగ్ పనుల జాబితాలో కొణతనపాడు–ప్రొద్దుటూరు అడ్డరోడ్డు పనులకు కూడా ప్రాధాన్యత కల్పించారు.

క్షేత్రస్థాయి సందర్శన..

విస్తరణ పెండింగ్ పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల పోలీసు, రవాణా శాఖ అధికారులతో కలిసి పెండింగ్ పనుల ప్రదేశాలను సందర్శించారు. కొణతనపాడు కూడలి, ప్రొద్దుటూరు అడ్డరోడ్డు, పలు సర్వీసు రోడ్లను ఇటీవల సందర్శించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్న క్రమంలో ట్రాఫిక్ మళ్లింపు, రోడ్డు నిర్మాణం తీరుపై ఆయా శాఖలు సమీక్ష జరిపినట్లు సమాచారం. పనులు ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. డబుల్‌లైన్‌గా ఉన్న రోడ్డు ఫోర్‌లైన్‌గా విస్తరణ జరిగితే వాహనాల రాకపోకలు సజావుగా సాగిపోతాయి. అంతే కాకుండా జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గ్రామాల రహదారులకు అప్రోచ్ పూర్తయ్యి రహదారి ఇబ్బందులు తొలగనున్నాయి.

రేపటి నుంచి విజయవాడలో ఆరోగ్య మేళాలు

డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెగా ఆరోగ్య మేళాలు ఈ నెల 5 నుంచి విజయవాడలో ప్రారంభం కానున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో మంగళవారం తన కార్యాలయంలో డీఎంహెచ్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మేళాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా పక్కా ప్రణాళికతో అమలు చేయాలని ఆదేశించారు. ఏ విధమైన లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య మేళాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కలిగించాలని, స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ సమీర, డాక్టర్ కార్తీక్, డాక్టర్ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా దసరా ఉత్సవ ఏర్పాట్లు

తుది దశకు మహా మండపం పెయింటింగ్ పనులు



కొనసాగుతున్న మహా మండపం పెయింటింగ్ పనులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురానికి పెయింటింగ్ పనులు తుది దశకు చేరుకోగా, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఎలక్ట్రికల్ పనులు తుది దశకు చేరుకుంటాయని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఇక ఉత్సవాలలో అత్యంత కీలకమైన పనులలో ప్రధానమైన క్యూలైన్ పనులు జరుగుతున్నాయి. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వరకు క్యూలైన్ల పనులు పూర్తయ్యాయి. సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్లు కోసం నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్ పనులు చేపట్టగా, దుర్గాఘాట్ వద్ద పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు దుర్గాఘాట్ ఎదుట కొండ రాళ్లు, కొండ చరియలు విరిగి పడిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో కొండ రాళ్లు జారి పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొండ రాళ్లను మరి కొన్నింటిని తొలగించారు. అయితే ఆ ప్రాంతంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కౌంటర్లు

సీతమ్మ వారి పాదాల వద్ద భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కేశఖండనశాల షెడ్డు నిర్మాణం జరుగుతోంది. మరో వైపున కనకదుర్గ నగర్‌లో ప్రసాదాల విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం 10 కౌంటర్లు ఏర్పాటు చేసింది. మరో వైపున కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు ఏర్పాటు చేసిన పెర్గోలా తొలగింపు పనులు తుది దశకు చేరుకున్నాయి.

క్లుప్తంగా

నాణ్యత లోపిస్తే సహించేది లేదు



జి.కొండూరు(మైలవరం): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించినా, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే టేక్ హోమ్ రేషన్‌లో అవకతవకలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్.విజయప్రతాపరెడ్డి స్పష్టంచేశారు. మండలంలోని వెలగలేరు గ్రామంలో అంగన్‌వాడీ–3,4 కేంద్రాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం–3లో చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా తిని పరీక్షించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న టేక్ హోమ్ రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని లబ్ధిదారులకు నేరుగా ఫోన్ చేసి తెలుసుకున్నారు. చిన్నారులకు రుచికరమైన భోజనం అందిస్తున్నఅంగన్‌వాడీ–3 కార్యకర్త సీహెచ్ మాణిక్యం, సహాయకురాలు కె.సుధారాణిని సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ–4 కేంద్రాన్ని తనిఖీ చేసి, కంది పప్పు నిల్వల్లో తేడాలను గుర్తించారు. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ రమాదేవి పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆమెకు మెమో జారీ, తక్కువ ఉన్న కందిపప్పును రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, సీడీపీఓ పుష్పలత, సూపర్‌వైజర్ అన్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రంగాపురం గ్రామంలో..

రెడ్డిగూడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, స్టోర్ రూంలోని సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై సలహాలు ఇచ్చారు.

ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పెనుగంచిప్రోలు సచివాలయం–3 పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. వందల మంది ప్రజలు హాజరవగా స్పెషలిస్ట్ వైద్యులు వారికి వైద్యపరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ.. పేదలకు అవసరమైన వైద్యసేవలను ప్రభుత్వం స్థానికంగానే అందిస్తుండటం గొప్ప పరిణామమన్నారు.



పెనుగంచిప్రోలులో రోగులకు ఉచిత మెడికల్ కిట్ అందజేస్తున్న విప్ ఉదయభాను

తన తండ్రి వైఎస్సార్‌లా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్ట్ వైద్యులు గ్రామాలకే తరలివచ్చి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండటం పేదలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. ఐదు దశలుగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్.వి. ప్రసాద్, ఏసీడీపీ నాగమణి పాల్గొన్నారు.

సీపెట్ శిక్షణతో 30 మందికి ఉద్యోగాలు



గన్నవరం రూరల్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) నైపుణ్యాభివృద్ధి సాధించిన యువతకు నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించి, జీవితాలకు అండగా నిలుస్తోంది. సీపెట్ కోర్సు పూర్తి చేసుకున్న 30 మందికి సంస్థ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్, గెయిల్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ జోనల్ చీఫ్ మేనేజర్ డి.నగేష్ మంగళవారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపెట్ జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ఈ 30 మందికి గెయిల్ ఇండియా సౌజన్యంతో ప్లాస్టిక్స్ ప్రాడక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ కోర్సులో ఆరు నెలల శిక్షణ ఇచ్చామన్నారు. ఉద్యోగం పొందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన క్రాకటూరు లక్ష్మీపరమేశ్వరి మాట్లాడుతూ.. 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్తను చూసి మార్చి 29వ తేదీన ఈ ట్రైనింగ్‌లో చేరి ఉద్యోగం సాధించానన్నారు. తండ్రి మరణించారని, తల్లి కూలి పనులు చేస్తూ తనను చదివించారని పేర్కొన్నారు. మెడికల్ షాపులో పని చేసే తాను సీపెట్‌లో శిక్షణ అనంతరం హైదరాబాద్ సెక్యూర్ ఇండస్ట్రీలో సైతం శిక్షణ పూర్తి చేసుకుని అదే కంపెనీలో ఉద్యోగం పొందానని వివరించారు.

DEPARTMENT OF TECHNICAL EDUCATION GOVERNMENT POLYTECHNIC, VIJAYAWADA
Contact: 9912342013 email ID: gptvja@gmail.com
NOTIFICATION FOR e-Procurement
Tender Notice No.01/ASL/PPL/GPTVJA/NTR-DIST/ VJA/2023-24, Dt.29-09-2023
The Principal, Government Polytechnic, Vijayawada invites open Short tender for" Renovation of existing Automobile servicing and maintenance laboratory in Government Polytechnic campus, Vijayawada" Estimated amount Rs.4.2 Lakhs, through e-Procurement platform. Tender available date & time from 05-10-2023 @ 10:00 Hrs. onwards. Schedule closing Date & time: 13:00 Hrs on 12-10-2023. Bid Submission closing Date & time: 15:00 Hrs on 12-10-2023. For further details visit: www.apeprocurement.gov.in. Receipt of Tenders: Tender will be received through AP e-procurement platform only.
PRINCIPAL, Government Polytechnic, Vijayawada

వైఎస్ జగన్‌ను రెండో సారి సీఎంను చేయడమే లక్ష్యం

వీర వసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో 'దివ్యాంగులు సైతం జగనన్నకు అండ దండ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏపీ వీర వసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల ఆరో తేదీ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఈ కార్యక్రమం జరుగు తుందని పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలు, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. సమాజంలోని ప్రతి వర్గానికీ ఎన్నో రకాలుగా మేలు చేశారని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు దివ్యాంగులుగా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో లబ్ధిపొందిన తాము జగనన్నకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. తాము సైతం జగనన్నకు అండదండగా నిలబడతామని, మరోసారి రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. 'దివ్యాంగులు సైతం జగనన్నకు అండ దండ' కార్యక్రమంలో 26 జిల్లాల నుంచి దివ్యాంగులు హాజరుకావాలని కోరారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నూర్‌మహమ్మద్, సహాయకార్యదర్శి జి.సతీష్, మహిళా అధ్యక్షురాలు జె.బి.సరోజిని, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఇంటర్మీడియెట్ విద్యార్థిని బలవన్మరణం

● సెల్‌ఫోన్ చోరీ ఆరోపణలతో మనస్తాపం

పెనమలూరు: సెల్ ఫోన్ చోరీ ఆరోపణలతో మనస్తాపం చెందిన విద్యార్థిని మంగళవారం బలవన్మరణం చేసుకుంది. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన వెంకటరవి, లలిత దంపతుల కుమార్తె మాదేవి ప్రియ (17) కానూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. కాలేజీలో గత శనివారం సిబ్బందికి చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆ సెల్ ఫోన్ ఆదివారం మాదేవి ప్రియకు క్యాంపస్‌లో దొరకడంతో యాజమాన్యానికి అప్పగించింది. అయితే కాలేజీ యాజమాన్యం ఆమెపైనే అనుమానం వ్యక్తం చేసింది. తనకు ఫోన్ దొరికిందని మాదేవి ప్రియ చెప్పినా ఫోన్ చోరీ చేశావంటూ యాజమాన్యం మందలించింది. దీంతో విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం క్లాస్ జరుగుతున్న సమయంలో వాష్ రూమ్‌కు వెళ్లి వస్తానని బయటకు వచ్చిన ఆమె పై అంతస్తులో ఖాళీగా ఉన్న రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె మరణానికి కాలేజీ యాజమాన్యందే బాధ్యతని మాదేవి ప్రియ తండ్రి వెంకటరవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాలేజీ కరస్పాండెంట్ నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్ కోటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని సీఐ రామారావు తెలిపారు.



మాదేవిప్రియ మృతదేహం

ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలి



ఎంబీబీఎస్ విద్యార్థులతో పేర్ని నాని, జేసీ అపరాజితసింగ్

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని

కోనేరుసెంటర్(మచిలీపట్నం): వైద్య విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. అందులో భాగంగానే మచిలీపట్నంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరిగిందన్నారు. ఈ కళాశాల వైద్య విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకుని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలని, అది మంచి లక్షణమని సూచించారు. బందరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు మంగళవారం వైట్ కోట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వైట్ కోట్‌లు పంపిణీ చేశారు. అనంతరం పేర్ని మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు వినయ విధేయతలు ముఖ్యమన్నారు. వాటితోపాటు ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓర్పు, సహనం అవసరమన్నారు. గురువులను గౌరవిస్తూ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ విద్యాభ్యాసం పూర్తి చేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ చదువుకునే మీరంతా భవిష్యత్‌లో ప్రజలకు ఉన్నత వైద్య సేవలను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులు పలు సమస్యలను పేర్ని నాని, జేసీ దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వసతుల విషయంలో ఎటువంటి లోపాలూ లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయకుమారి, హెచ్‌ఓడీలు డాక్టర్ స్వర్ణలత, ఎస్.ఆర్. మంజుల, ఆశాలత, పలువురు ప్రొఫెసర్‌లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టి పంటలను కాపాడుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో సామూహిక ఎలుకల నిర్మూలన పై రైతులకు అవగాహన కల్పించే పోస్టర్, కర పత్రాలను కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 1.32 లక్షల ఎకరాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇందు కోసం 509 కిలోల బ్రోమోడయోలిన్ మందును రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎలుకల నిర్మూలన కార్యక్రమం ద్వారా ఎకరాకు సుమారు 10 బస్తాల వరకు దిగుబడిని కాపాడుకోవచ్చన్నారు. ఎలుకల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. బ్రోమోడయలోన్ మందును రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి ఉచితంగా పొందాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్. నాగమణెమ్మ, సహాయ సంచాలకులు అనితాబాను, బి.వెంకటేశ్వరరావు, కెనడీ, ఏఓ వి.ఊర్మిళ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో ప్రగతి చూపాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి చేపట్టిన పనులలో ప్రగతి చూపాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, నగర పాలక సంస్థ, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా శాఖల పరిధిలో 1100 పనులు మంజూరయ్యాయని, వీటిలో 347కు పైగా పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. వివిధ దశలలో ఉన్న 595 పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించిన వివరాలు జీజీఎంపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.



పోస్టర్, కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

డాక్టర్ రేవతికి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అవార్డు



ఘంటసాల(అవనిగడ్డ): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె.రేవతి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. చెన్నయ్‌లో జరిగిన డాక్టర్ బి.వసంత్‌రాజ్ డేవిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఐదో జాతీయ సదస్సులో నిర్వాహకుడు వసంత్‌రాజ్ డేవిడ్ చేతుల మీదుగా రేవతి ఈ అవార్డు అందుకున్నారు. నువ్వుల పంటలో ఆశించే వెర్రి తెగులుపై రేవతి పీహెచ్‌డీలో చేసిన పరిశోధన, పీజీలో కందిపంటలో కాయ ఈగపై చేసిన పరిశోధన, వంగ, టమాట, మినుము వంటి పంటలపై చేసిన క్షేత్రస్థాయి పరిశోధనలు, వరి, మొక్కజొన్నపై చేపట్టిన ప్రథమశ్రేణి ప్రదర్శనలను పరిగణలోకి తీసుకుని 2023 సంవత్సరానికి ఈ పురస్కారం ప్రదానంచేశారు.

వాగులోకి దూసుకువెళ్లిన లారీ



గన్నవరం: జాతీయ రహదారిపై ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ఓ లారీ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటన స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి అల్లం లోడుతో ఓ లారీ కోల్‌కత్తా బయలుదేరింది. గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ దాటిన తర్వాత ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగనే ఆ లారీకి ఎదురుగా రాంగ్ రూట్‌లో రెండు వాహనాలు వచ్చాయి. వీటిని తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి లారీ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన లారీ, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని క్రేన్‌తో లారీని బయటకు తీశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఏడో అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి ఎస్.నాగేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. సింగరాతి హేబేలు(23) సత్యనారా యణపురం, భానునగర్‌లో కుటుంబ సభ్యులతో కలసి నివసిస్తున్నాడు. పోరంకికి చెందిన తుళ్లూరి వెంకటమణికంఠస్వామి బీఆర్టీఎస్ రోడ్డులో షావర్మ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటమణికంఠస్వామి వద్దకు హేబేలు 2021, డిసెంబర్ మొదటి వారంలో వెళ్లి డబ్బులు కావాలని అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని అతను చెప్పడంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. 2021, డిసెంబర్ తొమ్మిదో తేదీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వెంకటమణికంఠస్వామి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా హేబేలు ఆటోలో వెంబడించి పప్పులమిల్లు సెంటర్ వద్ద గొడవపడి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. వెంకటమణికంఠస్వామి చేతులను అడ్డుపెట్టుకోగా ఎడమ చెయి, ఎడం భుజంపై గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు స్పందించి అక్కడికి రావడంతో హేబేలు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదే ఏడాది డిసెంబర్ పదో తేదీన అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పది మంది సాక్షులను విచారించగా నిందితుడిపై నేరం రుజువు కావటంతో జడ్జి పై విధంగా తీర్పు చెప్పారు.

కొబ్బరిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

పెడన: కొబ్బరికాయలు కోస్తూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారి కింద పడి మృతి చెందిన ఘటనపై పెడన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నం ఒకటో వార్డు మాచవరంనకు చెందిన జోగి రాంబాబు(52) మంగళవారం ఉదయం పెడన మండలం దావోజీపాలెంలో కొబ్బరి కాయలు కోసేందుకు కుమారుడు వెంకటసుబ్రహ్మణ్యంతో కలిసి వెళ్లాడు. రాంబాబు చెట్టు ఎక్కి కాయలు కోసి దింపే క్రమంలో పట్టుతప్పి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాంబాబును కుమారుడు వెంకటసుబ్రహ్మణ్యం హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటసుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా ఏఎస్‌ఐ టి.సురేష్‌కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS
■ Degree Admission at Rs. 5000/- Last Date - 07/10/2023 plnmdegreecollege2002@gmail.com Contact: 91774 08565

DISTANCE EDUCATION
■ Prabhas College (1994) VJA : (Dist/ Online):MBA, MCA, BCA, BBA,BA, B.Com, B.Sc., MA, M.Com, M.Sc., B/M.Lis, B.Ed. (R) ✆ 0866-2532525/1306, 94418 02525

REAL ESTATE

LAND FOR SALE
■ మైలవరం మండలం, జరిగాలపల్లి గ్రామం, ఆర్.యస్.నెం. 149/1, య. 2.50 సెంట్లు భూమి యజమాని దేవదాసు, విజయవాడ. వ్యవసాయ భూమి అమ్మబడును. సంప్ర. ✆ 94933 01388

PLOT FOR SALE
■ పెదపులిపాక NTR నగర్‌లో నెలకు 30 వేలు రెంటు వచ్చు 12 ½ + 5 సెంట్లలో 2 BHK ఇల్లు మరియు తూర్పు, పడమర రోడ్లతో 4 సెంట్లు స్థలం అమ్మకం ✆ 85238 99999

SERVICES

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

TV REPAIRS
■ Sony, LG, Samsung, Toshiba, Lloyd, Aiwa అన్ని కంపెనీల LCD, LED, CRT TVలు మీ ఇంటి వద్దనే రిపేర్ చేయబడును. సంప్ర: గిరిప్రసాద్ Ph: 8019608727

WANTED
■ అనుభవం గల ఫిజియో థెరపిస్ట్‌లు-2 & ఆయాలు-1. పున్నమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్ నందు పని చేయుటకు కావలెను. # 29-26-44, జగడంవారి వీధి, సూర్యారావుపేట, VJA-2. ✆ 98852 22525
■ Wanted Godown Manager for a JSW Paints Pvt Ltd., Experience required. Salary: 18 to 20,000/- Ganguru, Vijayawada. ✆ 79958 33314
■ రామకృష్ణ హోంకేర్ సర్వీసెస్ (AP NO-1) VJA, HYD శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, వంట/ ఇంటి పని, బేబీ కేర్ వర్కర్స్ కావలెను భో+వ+జీ: 15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08656, 62812 08600
■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపర్స్,కంప్యూటర్ ఆపరేటర్స్ విజయవాడ సిటీ, పరిసర ప్రాంతాలలో అర్జెంట్‌గా కావలెను. Qly. 10th Pass / Fail. ✆ 7330911212, 7093801212, 9491771179.
■ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc. 40 వేలు, వ : 30 Yrs రిటైర్డ్, RMP డాక్టర్స్, మార్కెటింగ్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కు ప్రాధాన్యత ✆ 92902 44669
■ క్లాత్ షాపులో పనిచేయుటకు 10th చదివిన యువకులు కావలెను. జీతం: 13 వేల నుండి 15 వేలు. షాపు నెం. 78, 79, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, వంజా సెంటర్, విజయవాడ-1.
■ విజయవాడ ఆటోనగర్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. 8 గం॥, జీతం: 12 వేలు, Q: ఇంటర్, Age: 50 సం॥ లోపు. సంప్ర: 95020 64738, 92472 71222
■ ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర: ✆ 83329 45498
■ గొల్లపూడి, నల్లకుంట, మెడికల్ C & Fలో అనుభవంగల కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. గొల్లపూడి, భవానీపురం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర॥ ✆ 92467 83789
■ IOCL పెట్రోల్ బంకు నందు పని చేయుటకు M/F సేల్స్ పర్సన్స్ కావలెను. పైలెట్ సర్వీస్ స్టేషన్, ఎం.జి. రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ-2 ✆ 90148 30181, 92463 75420
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926
■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ -15000 జీతం.Qlf:10th. Age: 25-45 (విజయవాడ సిటీ వారికి ప్రాధాన్యత). MEGA Group Man Power & Security. సంప్ర:7032610569
■ విజయవాడ, గుడవల్లి, నున్న పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం సంప్ర॥ ✆ 85004 05004, 93912 50551
■ Wanted Male Academic Principals Qualification Any Degree/ P.G, Age Limit 25 to 45 Years (Must be Married) Experienced Persons Preferable. Salary upto: 35000/- and Male and Female Telecallers, Qualification Any Inter/ Degree.Age Limit 21 to 45 Years, Salary: 10000/- to 12000/-. Place of Work Master Minds College, Vijayawada. Contact: 9248445612, 8978180832
■ ఖచ్చితంగా జాబ్. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను.జీ: 12,000/- - 35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 7995984445
■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు: 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422.

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్
విజయవాడ వన్ టౌన్ 7995092112
విజయవాడ సెంట్రల్ 9010131135
విజయవాడ ఈస్ట్ 9505507329
ఉయ్యూరు, కంకిపాడు 9010577706
గన్నవరం 9010210382
ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా రూ.600/- రూ.150/- + 5% GST

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ - సికింద్రాబాద్ (4106)
5-9-76, 2వ మరియు 3వ అంతస్తు, ప్రభాత్ టవర్స్, SBI అమరావతి LHO ఎదురుగా, ఛాపెల్ రోడ్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్ - 500 001. ఇ-మెయిల్ ఐడి : team6samb.sec@sbi.co.in

అధీకృత అధికారి వివరాలు: పేరు: ఎం. బాబు SBI/SAMB/SEC/MBU/
ఇ-మెయిల్ : team6samb.sec@sbi.co.in, మొబైల్ నం. 8309858480

అనుబంధం - IV-A (రూల్ 8(6)లోని నిబంధన చూడండి) అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదువబడే విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీ- కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ ఛార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మకంగా స్వాధీనంలోకి తీసుకోబడినవి. అవి మెసర్స్ శ్రీనివాస జిన్నింగ్ అండ్ ట్రేడింగ్ కంపెనీ మరియు ((1) శ్రీమతి ఈతకోట ధనలక్ష్మి భర్త ఈతకోట కొండబాబు (2) శ్రీ ఈతకోట చంద్రకాంత్ తండ్రి ఈతకోట కొండబాబు (3) శ్రీ యర్నాల సూర్యచంద్ర రావు తండ్రి వై. గంగరాజు (4) మెసర్స్ శ్రీనివాస ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహించువారు మేనేజింగ్ పార్టనర్ శ్రీ ఈతకోట హేమ వెంకట సురేష్ (5) శ్రీ ఈతకోట కొండబాబు తండ్రి ఈతకోట సత్యనారాయణ (6) శ్రీ ఈతకోట వీరవెంకట సత్యనారాయణ తండ్రి ఈతకోట కొండబాబు (గ్యారంటార్(లు) పేరు తెలియజేయండి) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయి ఉన్న మొత్తం 30.09.2022 నాటికి రూ.26,78,58,612.46 (ఇరవైఆరు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల యాభై ఎనిమిది వేల ఆరువందల పన్నెండు రూపాయల నలభైఆరు పైసలు మాత్రమే)+ 01.10.2022 నుండి బకాయి ఉన్న వడ్డీ +అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొ॥నవి రాబట్టుకునేందుకు"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే" ప్రాతిపదికపై 26.10.2023న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలకు మరియు గ్యారంటార్లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరణ, రిజర్వు ధర, డిపాజిట్ చేయవలసిన బయానా, వేలం తేది మరియు సమయాలు మరియు బిడ్ ఇంక్రిమెంట్ మొత్తాలు దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి.

ఆస్తి నం. 1 : "IBAPI"ID SBIN0600410633
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తాడేపల్లిగూడెంలో రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.6725/2017 తేది : 08.09.2017 మరియు డాక్యుమెంట్ నం. 6725/2017 తేది : 08.09.2017 ప్రకారం ఉండి ఆం.ప్ర. పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, జగ్గన్న పేట గ్రామం వద్ద గల 9680.40 చ.గ.విస్తీర్ణంలో RS.No. 279/5A-1, 278/9A-1, 283/3B-2A, 284/3B-2Bలో మెస్సర్స్ శ్రీనివాస జిన్నింగ్ అండ్ ట్రేడింగ్ కంపెనీ పేరున కలిగి ఉన్న ఫ్యాక్టరీ భవనంతో భూమి
రిజర్వు ధర : రూ.2,86,00,000/-; బయానా : రూ. 28,60,000/-; వేలం తేది: 26.10.2023
వేలం సమయం: మ.2.00 గం. నుండి మ. 3.00గం.వరకు, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 1,00,000/-

ఆస్తి నం.2 : "IBAPI"ID SBIN0600410634
పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం మండలం, జగ్గన్నపేట గ్రామం మరియు గ్రామ పంచాయతీ సర్వే నం. RS.No. 279/5A-1, 278/9A-1, 283/3B-2A, 284/3B-2Bలో ఉన్న ప్లాంట్ అండ్ మిషనరీ.
రిజర్వు ధర : రూ.1,68,00,000/-; బయానా : రూ. 16,80,000/-; వేలం తేది: 26.10.2023
వేలం సమయం: మ.2.00 గం. నుండి మ. 3.00గం.వరకు, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 50,000/-

ఆస్తి నం.3 : "IBAPI"ID SBIN0600410635
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తాడేపల్లిగూడెంలో రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. (1) డాక్యుమెంట్ నం. 6514/2009-23.12.2009 విస్తీర్ణం: 1050 చ.గజాలు (2) డాక్యుమెంట్ నం. 6515/2009-23.12.2009 విస్తీర్ణం: 1000చ.గజాలు (3) డాక్యుమెంట్ నం. 6516/2009-23.12.2009 విస్తీర్ణం: 950 చ.గజాలు (4) డాక్యుమెంట్ నం. 6517/2009-23.12.2009 విస్తీర్ణం: 868.40 చ.గజాలు (5) డాక్యుమెంట్ నం. 6518/2009-23.12.2009 విస్తీర్ణం: 1100చ.గజాలు (6) డాక్యుమెంట్ నం. 6519/2009-23.12.2009 విస్తీర్ణం: 1130 చ.గజాలు ప్రకారం శ్రీ ఈతకోట వీర వెంకట సత్యనారాయణ తండ్రి ఈతకోట కొండబాబు పేరున కలిగి ఉండి తాడేపల్లిగూడెం కడకట్ల గ్రామం, వార్డ్ నం. 32, బ్లాక్ నం.I డి.నం. 1-31-7 సమీపాన సర్వే నం. 257/2లో మొత్తం ఎ. 1.26 లేదా 6098.40 చ.గజాలు లేదా 5098.86చ.మీటర్లు (మొత్తం ఆరు భాగాల భూమి కలిగి ఉంది) విస్తీర్ణం గల ఖాళీ సైట్. సరిహద్దులు : ఉత్తరం: 33 అడుగుల వెడల్పు రోడ్డు ఆఫ్ DTCP ఆమోదిత లే అవుట్ 81/99, దక్షిణం: కడకట్ల పెద్దచెరువు గట్టు WBM రోడ్డు, తూర్పు: RS No. 257/3 లో రామిశెట్టి రామన్న మరియు సత్యనారాయణ మరియు ఇతరుల భూమి, పశ్చిమం: RS No. 257/1లో బుద్దాల విజయబాబు తండ్రి వెంకట రామారావు భూమి.
రిజర్వు ధర : రూ.4,06,00,000/-; బయానా : రూ. 40,60,000/-; వేలం తేది: 26.10.2023
వేలం సమయం: సా. 4.00 గం. నుండి సా. 5.00 గం.వరకు, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 1,00,000/-

ఆస్తి నం.4 : "IBAPI"ID SBIN0600410636
తాడేపల్లిగూడెం ఎస్ఆర్ఓ.లోని రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 2584/2012-29.03.2012 ప్రకారం తాడేపల్లిగూడెం, కిరాణా వర్తక సంఘం రోడ్, మొత్తం మొదటి అంతస్తు, వార్డ్ నం. 20, బ్లాక్ నం. 11, డి.నం. 11-1-85 వద్ద గల మెస్సర్స్ శ్రీనివాస ట్రేడర్స్ ప్రాతినిధ్యం వహించువారు దాని మేనేజింగ్ పార్టనర్ శ్రీ ఈతకోట హేమ వెంకట సురేష్ తండ్రి ఈతకోట కొండబాబు పేరున కలిగి యుండి 5292చ.అ. (మొదటి అంతస్తు) ఫ్లింత్ ఏరియా 414.67 చ.గ. సైట్ ఏరియా, సర్వే నం. RS No. 230 క్రింద కమర్షియల్ బిల్డింగ్.
రిజర్వు ధర : రూ.2,36,00,000/-; బయానా : రూ. 23,60,000/-; వేలం తేది: 26.10.2023
వేలం సమయం: సా. 4.00 గం. నుండి సా. 5.00 గం.వరకు, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 50,000/-

ఆస్తి నం.5 : "IBAPI"ID SBIN0600410637
ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, పెద్ద తాడేపల్లి గ్రామం మరియు పంచాయతీ, రమణమహర్షి కాలేజ్ ఆఫ్ ఎంబిఏ సమీపాన గల శ్రీమతి ఈతకోట ధనలక్ష్మి భర్త ఈతకోట కొండబాబు పేరున గల 55300చ.అ. బిల్డింగ్ ఏరియా, 12777చ.గ. సైట్ ఏరియా సర్వే నం. RS. No. 869/1A- ఎ.1.26, 870/2- ఎ.0.53, 870/3-ఎ.1.14 మొత్తం ఎ.2.93 క్రింద కమర్షియల్ గోడౌన్స్ (డాక్యుమెంట్ నం. 10931/2012-19.12.2012)
రిజర్వు ధర : రూ.5,69,00,000/-; బయానా : రూ. 56,90,000/-; వేలం తేది: 26.10.2023
వేలం సమయం: మ.12.00 గం. నుండి మ. 1.00 గం.వరకు, బిడ్ ఇంక్రిమెంట్: రూ. 1,00,000/-

బయానా చెల్లింపు: కాగోరు బిడ్డర్లు ఇ-వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు ఇండియన్ బ్యాంక్స్ ఆక్షన్ ప్రాపర్టీస్ ఇన్ఫర్మేషన్ (IBAPI) పోర్టల్ (https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp) లో తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. బిడ్డర్ల రిజిస్ట్రేషన్ కనీసం మూడు పని దినములు పడుతుంది కనుక వేలం తేదీకి తగినంత ముందుగా బిడ్డర్లు తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. కాగోరు బిడ్డరు, తమ బ్యాంకు అకౌంట్ ద్వారా IBAPI పోర్టల్‌లోని IBAPI వ్యాలెట్‌కు బయానా డిపాజిట్ దాఖలు చేయవలెను.
తనిఖీ మరియు ఏవేని స్పష్టీకరణల కోసం కాగోరు బిడ్డర్లు అధీకృత అధికారిని ఫోన్ నం. 8309858480పై లేదా బ్యాంక్ ఆమోదిత రిజల్యూషన్ ఏజెంట్ మెసర్స్ శ్రీరామ అసోసియేట్స్ వారిని సెల్ నం. 9440887967, 9866065687 పై సంప్రదించవచ్చును.
గమనిక: ఇ-వేలం తేదీలోగా బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించకపోతే పైన తెలిపిన తేదీన ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు సంబంధించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/ గ్యారంటార్లకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ (a) "http://www.sbi.co.in" (b) "https://ibapi.in" లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.
తేది : 20.09.2023, ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

శరవేగంగా అభివృద్ధి పనులు

మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 18వ డివిజన్‌లో రూ. 82 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు వీధుల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి మంగళవారం ఆయన, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. డివిజన్‌లో రూ.82 లక్షల వ్యయ అంచనాతో మాదంశెట్టి సీతయ్య వీధి, కోరె నామయ్య వీధి, ఆంటోనీ వీధుల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరలో పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'తూర్పు'లో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. డివిజన్‌లో వైఎస్సార్ సీపీ అభిమానులు ఎక్కువగా ఉన్నారనే నెపంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రూ.11కోట్ల వ్యయంతో రోడ్లు, సైడు కాలువలు, పార్క్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మంచినీటి కుళాయిల ఏర్పాటు, స్కూల్ అభివృద్ధి, హాస్పిటల్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఒకప్పుడు రాణిగారితోట మురికి కూపంలా ఉండేదని, నేడు అభివృద్ధిలో నగరానికే తలమానికంగా తయారైందనన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మించి వరద కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు.



భూమి పూజలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్, దేవినేని అవినాష్ తదితరులు

ప్రజల మద్దతుతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం

రాష్ట్రంలో కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే నీచ బుద్ధితో టీడీపీ వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని అవినాష్ విమర్శించారు. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకి వెళ్లిన తర్వాత టీడీపీ పరిస్థితి దిక్కుతోచని నావలా తయారైందని ఎద్దేవా చేశారు. ఎన్ని నాటకాలు వేసినా టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ప్రజల సంపూర్ణ మద్దతుతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుణదల (విజయవాడ తూర్పు): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. మూడో డివిజన్ గణేష్‌నగర్‌లో రూ. 40 లక్షల వ్యయ అంచనాతో నిర్మించబోతున్న అంతర్గత రోడ్లకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేశారన్నారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ భీమశెట్టి ప్రవల్లిక, కోఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహనీయులను స్మరించుకోవాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశ ఔన్నత్యాన్ని కాపాడటానికి విశేష కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం, వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 18వ డివిజన్‌లో సిమెంట్ గోడౌన్‌లోని నగరపాలక సంస్థ పాఠశాల వెనుక వైపు రాధాకృష్ణ రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు మంగళవారం జరిగిన శంకుస్థాపనలో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి అవినాష్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సినీ సంగీత నవరాత్రులు



విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా విజయవాడ కళా సంస్థల ఆధ్వర్యంలో 11వ తేదీ నుంచి తొమ్మిది రోజులు సినీ సంగీత నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి పరచూరి విజయలక్ష్మి మంగళవారం వివరించారు. గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై విలేకరుల సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. నగరంలోని కళా సంస్థలు ఐక్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్వాహక సంఘ సభ్యుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో కార్యక్రమం జరుగుతుందని సావిత్రి కళాపీఠం, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా, పల్లెంకొండ ఆర్ట్స్, జెసీరాజ్ స్వరాంజలి, సింధు ఈవెంట్స్, సునీల్ ఆర్కెస్ట్రా, సువర్ణమణి రిథమ్స్, తెలుగు కళావాహిని, డ్రీమ్ ఆడియో, గీతాంజలి మ్యూజిక్స్ వారికి కేటాయించిన రోజుల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో డేవిడ్‌రాజు, జయప్రభ పాల్గొన్నారు.

సహాయ భాస్కరన్‌కు దివ్యాంగజన్ స్వాభిమాన్ అవార్డు

గుణదల (విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోల కళాశాలలో ఫిజిక్స్ ప్రొఫెసర్ జి.సహాయభాస్కరన్‌కు దివ్యాంగజన్ స్వాభిమాన్ సమ్మాన్ – 2023 అవార్డు లభించింది. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలోని లజపత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ అవార్డును అందజేశారు. 1921లో లాలాలజపతిరాయ్ స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా దివ్యాంగులకు సేవచేసిన వారికి అవార్డును అందిస్తారు. వికలాంగుల సాధికారత రంగంలో విశేష సేవలందించిన సహాయ భాస్కరన్.. అవార్డుకు ఎంపికయ్యారు.

వినాయకచవితి లడ్డు.. రూ.3.03 లక్షలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 16వ డివిజన్‌లోని వరసిద్ధి వినాయక సేవాసమితి ఆధ్వర్యాన బాలాజీనగర్‌లో జరిగిన వినాయక లడ్డు వేలంలో రూ.3,03,000కు ప్రసాదాన్ని సింగంశెట్టి విజయ్‌కుమార్ దక్కించుకున్నారు. కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లంకా రవికాంత్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పోటా పోటీగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరవ్వగా విజయ్‌కుమార్ లడ్డును దక్కించుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో విజయవాడలో లడ్డు వేలం పాట ఇక్కడే జరిగిందని కమిటీ నిర్వాహకుడు ఆర్.నాయుడు చెప్పారు. అనంతరం స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ఆర్‌కే నాయుడు, కోశాధికారి దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

పెనమలూరు: గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు సూచించారు. గంగూరు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, బడ్జెట్ అంచనాలు, ఏ పనులు చేపట్టాలి అనే విషయమై పంచాయతీల్లో తీర్మానం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు గుర్తించాలని, పని దినాలు, గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు.

మైక్రోఫిల్టర్స్ బెడ్స్ ఏర్పాటుకు తీర్మానం



నున్నలో జరిగిన గ్రామ సభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి ఫిల్టర్ బెడ్స్‌ను జలజీవన్ మిషన్ నిధులతో మైక్రో ఫిల్టర్స్‌గా మార్చేందుకు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంగళవారం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ముందస్తు ప్రణాళికపై గ్రామసభలో సమీక్ష జరిగింది. గ్రామంలోని రెండు తాగునీటి చెరువుల చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మించడంతో పాటు, కొబ్బరిచెట్లు నాటేందుకు గ్రామసభ చర్చించి తీర్మానం చేసింది.

వీటితో పాటు జగనన్న కాలనీలో చేపట్టే అభివృద్ధి పనులు, దోమల నిర్మూలను చేపట్టవలసిన చర్యలు, డ్వాక్రా గ్రూపులు, మహిళా సంరక్షణ తదితర అంశాలపై గ్రామసభలో చర్చించారు. గ్రామసభలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గం సభ్యులు యార్కారెడ్డి వెంకటరెడ్డి, స్వాతి, సైదాబి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మెహబూబ్ షేక్, తూర్పు నియోజకవర్గ మండల అధ్యక్షులుగా నియమితులైన బుర్రి జగ్జీవన్‌రావు, ఉమ్మడిశెట్టి బహదూర్, ఎండీ రిజ్వాన్‌లను మంగళవారం గుణదలలోని నియోజకవర్గ కార్యాలయంలో దేవినేని అవినాష్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీపై నమ్మకంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారన్నారు. నియోజకవర్గంలో రూ.వందలాది కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా తిప్పకొడదామని చెప్పారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అండగా నిలుద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొరివి చైతన్య, కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, ఎస్సీ నేత బుర్రి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మెహబూబ్‌షేక్, జగ్జీవన్‌రావు, రిజ్వాన్, బహదూర్‌లను సత్కరించిన అవినాష్

శేషసాయిలో 'సూత్ర' ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): పండుగ సీజన్ దృష్ట్యా ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో డిజైనర్స్ వస్త్రాలతో సూత్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శన మంగళవారం ప్రారంభమవ్వగా దుస్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఢిల్లీ, కోల్‌కతా, నాగపూర్, రాయపూర్, బనారస్, ఉజ్జయిని, భోపాల్, గోవా, బెంగళూరు ప్రాంతాల నుంచి డిజైనర్, లైఫ్ స్టైల్ బ్రాండ్‌లు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాలివాహనుల (కుమ్మరి) అభివృద్ధికి కృషి చేద్దామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్ర కుమ్మరి/శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.పురుషోత్తం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా శాలివాహన సంక్షేమ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. శాలివాహనులకు సమాజంలో సముచిత స్థానం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జిల్లా స్థాయి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. సంస్థ చైర్మన్ ఎం. పురుషోత్తం మాట్లాడుతూ శాలివాహన సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. దీనితో పాటు అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి శాలివాహన సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేశారన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. టీటీడీలో ప్లాస్టిక్ వాడక నిషేధం అమలులో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పర్యావరణ అనుకూల మట్టికప్పులను వినియోగించేలా చర్యలు తీసుకోవడం ద్వారా శాలివాహనులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం సభ్యులు చెన్నయ్య, టి.దుర్గాప్రసాద్, ఆర్. కృష్ణయ్య ఉన్నారు.



కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన శాలివాహన సంఘం సభ్యులు

జంక్షన్ల అభివృద్ధికి చర్యలు

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌నగర్ ప్రాంతంలోని జంక్షన్లను మరింత అభివృద్ధి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని నూజివీడు రోడ్డులో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఆయన 15వ ఆర్థిక సంఘం ఎయిర్ పొల్యూషన్ గ్రాంటు నుంచి నూజివీడు రోడ్డులో పోలీసు జంక్షన్ నుంచి కండ్రిక జంక్షన్ వరకు 500 మీటరు పొడవునా రోడ్డు పక్కన నిర్మాణం జరుగుతున్న పేవర్ బ్లాక్స్, సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్ ఏర్పాటు పనులను పరిశీలించారు. రోడ్డుకు రెండువైపులా పేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేయడం, స్థానికంగా గ్రీనరీని మరింత అభివృద్ధి చేయాలని ఉద్యానవన అధికారులకు సూచించారు.

ఐకానిక్ పార్కు పరిశీలన

నగరవాసులకు అభివృద్ధితోపాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడానికి వీఎంసీ పార్కులను అభివృద్ధి చేస్తోందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ అన్నారు. మంగళవారం ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లో ఎక్సెల్‌ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న ఐకానిక్‌పార్కును పరిశీలించారు. అక్కడ ప్రహరీ పనులు, పార్కు ఆవరణలో చేపట్టిన పౌండేషన్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంతెనలో అన్నదానం ప్రారంభం



కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో శ్రీ రామభక్త అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 48 రోజులు పాటు నిర్విరామంగా కొనసాగించడానికి ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప, భవాని, శివ, గోవింద దీక్షలు స్వీకరించిన స్వాములకు సద్దిని ప్రతి రోజూ అందించనున్నారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్న సద్ది కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కొండవీటి వెంకట సుబ్బారావు, మాదు సుబ్రమణ్యం, మాదు శ్రీను, ఉప్పలూరు సాయి, యాదల శ్రీను, వీరంకి నాగు, ఉప్పలూరు సుబ్బారావు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ పరిధిలోని ఆయా డివిజన్లలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు పలువురిపై నమోదైన కేసుల్లో మున్సిపల్ న్యాయమూర్తి వి. విజయ్‌కుమార్ విచారణ చేశారు. సర్కిల్–1 కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్ కోర్టులో చెత్త రోడ్లపై వేసేవారు, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టేవారు, రోడ్లపై పెంపుడు జంతువుల్ని వదిలేవారు, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదైన 17 మందిని విచారణ చేశారు. వారందరికీ రూ.5,720 జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్–1, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.



కేసుల విచారణ చేస్తున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్

కరాటేలో నలంద విద్యార్థుల సత్తా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆలిండియా ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2023 పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల ఒకటో తేదీ జరిగిన పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 300 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. అండర్ 13 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్వీ శౌర్య, అండర్ 12 విభాగంలో ఆరో తరగతి విద్యార్థి ఈశ్వర్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్ 11 విభాగంలో ఆరో తరగతి విద్యార్థి రెహాన్‌నాగ్ వెండి పతకం పొందగా, అండర్ 8 విభాగంలో మూడో తరగతి విద్యార్థి లోకనంద, లోకమిత్ర కాంస్య పతకాలు పొందినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మంగళవారం అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

సైబర్ ట్రాఫికింగ్‌తో అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని ప్రజ్వల సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ వై చంద్రయ్య తెలిపారు. మైలవరం డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ హాలులో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఎన్టీఆర్ జిల్లా మైలవరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 26 సంవత్సరాలుగా డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఇప్పటి వరకు 27,000 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు.

వీధి విక్రయదారులకు క్రెడిట్ క్యాంప్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి విక్రయదారులకు అందిస్తున్న పీఎం స్వనిధి పథకంలో కొత్తగా రుణం పొందడానికి క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నామని వీఎంసీ పట్టణ సాధికారవిభాగం ప్రాజెక్ట్ అధికారి శకుంతల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే క్రెడిట్ క్యాంపును సర్కిల్–1 పరిధిలోని విద్యాధరపురంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద ఉన్న వార్డు సచివాలయం నంబర్ 117లో జరుగుతుందని పేర్కొన్నారు. 7వ తేదీన సర్కిల్–2 పరిధిలో గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో జరుగుతుందని, సర్కిల్–3 పరిధిలో 10వ తేదీన కృష్ణలంక చలసాని నగర్‌ని శాంపిల్ బిల్డింగ్‌లో ఉన్న సచివాలయం 79లో జరుగుతుందని వివరించారు. ఆయా తేదీల్లో జరిగే క్రెడిట్ క్యాంప్ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు తమ వెంట ఆధార్‌లింకైన ఫోన్‌ను తీసుకురావాలని, రెండు ఆధార్ జిరాక్స్‌లు, రెండు రేషన్ కార్డు జిరాక్స్‌లు, పాన్‌కార్డు(ఉంటే) లేదా ఓటరు గుర్తింపు జిరాక్స్ రెండు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ కలిగినవారు పాస్‌పుస్తకం రెండు జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకుని ఆయా తేదీల్లో జరిగే క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు.

సంగీత కళాశాలలో అగ్ని ప్రమాదం

- భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన విలువైన గ్రంథాలు బుగ్గిపాలు
- షార్ట్ సర్క్యూటే కారణమంటున్న అధికారులు

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో మంగళవారం ఉదయం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన వందలాది పుస్తకాలు గదిలో భద్రపరిచారు. చాలా ఏళ్లుగా వినియోగంలో లేక పోవడంతో పుస్తకాలు చెదలు పట్టి పూర్తిగా పాడయ్యాయి. ఉదయం సంగీత కళాశాలలో కర్రసాము శిక్షణనిస్తున్న విజయ్ మాస్టార్ కళాశాలలో మూలగా ఉన్న గది నుంచి పొగలు రావడం గమనించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఘటనలో సంబంధిత శాఖ వాచ్‌మన్‌కు స్వలంగా గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన గది చాలాకాలంగా వినియోగంలో లేదని ఉమ్మడి ఏపీలో భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన పుస్తకాలను అందులో భద్రపరిచామని షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని సాంస్కృతిక శాఖ సీఈవో ఆర్ మల్లికార్జునరావు తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేశారన్నారు.



అగ్నిప్రమాదం జరిగిన గది



బుగ్గిపాలైన పుస్తకాలు

లక్ష్య సాధనకు కృషి చేయాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని లయోల కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ శ్రీకుమార్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో మంగళవారం బీమస్ 2కే23 కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉండాలని కోరారు. విద్యతో పాటు సామాజిక అంశాలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజన వెలికితీయడానికి విద్యాసంస్థలు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ దిశగా లయోల కళాశాల కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, గ్రూప్ డ్యాన్స్, సింగింగ్‌లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్, కామర్స్ హెచ్ఓడీ శ్యామ్ సుందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శ్రీకుమార్

వాసవీ సేవా సంఘం కమిటీ ఎన్నిక

రామవరప్పాడు: శ్రీ వాసవీ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రామవరప్పాడులో మంగళవారం నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, కరెన్సీనగర్, మురళీనగర్ ప్రాంతాల్లోని సేవా సంఘం సభ్యులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి) ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సేవా సంఘం విజయవాడరూరల్ మండల నూతన అధ్యక్షుడిగా మాదాల వెంకట రమేష్, ఉపాధ్యక్షులు పురిమి సుబ్రహ్మణ్యం, కోట రామకృష్ణారావు, కార్యదర్శి చిన్ని సుబ్రహ్మణ్యం కోశాధికారి చీదెళ్ల వెంకట నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ సంఘ మాజీ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు నాలుగేళ్ల పాటు సేవలందించారన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్‌లోని 5 ఎంజీడీ(పాతది) క్లియర్ వాటర్ సంపును శుభ్రపరచనుండటంతో ప్లాంట్‌ను బ్రేక్‌డౌన్ చేస్తున్నామని ఈ కారణంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో తేదీ ఉదయం 8 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. శ్రీనివాసమహల్, ఫిష్‌మార్కెట్, గాంధీ బావి–1, గాంధీ బావి–2, అంబేడ్కర్ కాలనీ, ఓర్‌ఆర్‌ఆర్‌ఎస్ ప్రాంతం, గాంధీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, శివాలయం, కొట్టేటి కోటయ్య, నైజాం గేటు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రలకు మంగళవారం ఉచిత వైద్య సేవలు అదించారు. గంగూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 25 మంది పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందిస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ ఈస్ట్ :
99122 20539, 90101 31135
Office mail : sakshiads@gmail.com

జగనన్న ఆరోగ్య సురక్ష


ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూల్లో ఏర్పాటుచేసిన శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కృష్ణాపురంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది


తూర్పు గోదావరి జిల్లా కొమరిపాలెంలో మందుల కిట్‌లు అందిస్తున్న వైద్యాధికారి


వైఎస్సార్ జిల్లా కడపలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు, పరీక్షలు చేస్తున్న సిబ్బంది


కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌లో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు, పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


విజయనగరం జిల్లా కొండగంగుబూడిలో వైద్యశిబిరంలో సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో జగనన్న సురక్ష వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు, పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఎస్.ఉదయభాను


అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం బసినేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


తిరుపతిలో జరిగిన జగన్న సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


నెల్లూరు జిల్లా దువ్వూరు జెడ్పీ హైస్కూల్లోని క్యాంపులో చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


అనకాపల్లి జిల్లా తోటకూరపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న స్పెషలిస్ట్ క్రితిక


బాపట్ల జిల్లా గణపవరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ విజయేంద్ర


ఏలూరు నగరం తంగెళ్లమూడి యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రం వద్ద కేస్ షీట్‌ల కోసం బారులు తీరిన ప్రజలు

క్లుప్తంగా...

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో మంత్రి జోగి రమేశ్ తదితరులు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ పరిశీలించారు. ఈటీసీ లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లను, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ప్రదేశాన్ని చూశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల గృహప్రవేశాలు మహోయజ్ఞంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 17,005 కాలనీలు ఏర్పడుతున్నాయన్నారు. సామర్లకోట లేఅవుట్‌లో మంజూరు చేసిన 2,412 ఇళ్ల నిర్మించారని తెలిపారు. ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఆర్డీవో సత్యనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఊజా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ జె.రామారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

అంబేడ్కర్‌పై తప్పుడు ప్రకటనలా పవన్

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి



మచిలీపట్నం టౌన్: మహాత్మాగాంధీ సిఫార్సుతో అంబేడ్కర్‌కు డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ పదవి వచ్చిందని జనసేన నేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించడం ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నమేనని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ మండిపడ్డారు. పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చరిత్ర తెలియకుండా పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఆ స్థాయికి వచ్చారో మీకేం తెలుసని ప్రశ్నించారు. గాంధీజీపై అభిమానం ఉండాలే కాని.. అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడటం సబబు కాదని హితవు పలికారు.

పవన్.. చరిత్ర తెలియకుండా మాట్లాడకు.. : మంగరాజు



ఏలూరు (టూటౌన్): గాంధీజీ సిఫార్సుల వల్లే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పదవి వచ్చిందంటూ చదువులేని దద్దమ్మ పవన్‌కళ్యాణ్ మాట్లాడటం హాస్యాస్పదమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు రిజర్వేషన్ల విషయంలో అడుగడుగునా అంబేడ్కర్‌ను గాంధీజీ ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. జనసేన అధినేత పవన్ చరిత్ర తెలియకుండా మాట్లాడడం సరికాదని మంగరాజు మండిపడ్డారు.

అంబేడ్కర్‌ను అవమానించారు

జన్ జన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి సుదర్శన్

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మిడిమిడి జ్ఞానంతో బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించటం సరికాదని జన్ జన్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి సుదర్శన్ అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. గాంధీ దయ వల్లే అంబేడ్కర్‌కు పదవి వచ్చిందని పవన్ వ్యాఖ్యానించారని, ఇంటర్ ఫెయిలైన ఆయనకు గాంధీ, అంబేడ్కర్ గురించిన ఏం తెలుసని ప్రశ్నించారు. రాష్ట్రంలో చిరంజీవి కుటుంబానికి విశ్వసనీయత పోయిందన్నారు.

పెడనలో అల్లర్లకు పవన్ కుట్ర

అవనిగడ్డ సభ ఫ్లాప్‌తో ఆయనలో దిగులు

- అంగళ్లు మాదిరిగా గొడవల్ని సృష్టించేందుకు కుయుక్తులు
- వారాహిని అడ్డుకునే అవసరం మాకేంటి?
- పెడన ప్రజలు శాంతికాముకులు పవన్..
- దాడికి యత్నిస్తున్నారంటూ పిచ్చి ఆరోపణలా.. వాటిని నిరూపించే దమ్ముందా?
- పవన్ కళ్యాణ్‌కు మంత్రి జోగి రమేశ్ సవాల్

సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా పెడనలో జరగబోయే వారాహి యాత్రపై దాడిచేసే అవకాశం ఉందంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన పిచ్చి వ్యాఖ్యలపై గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ మండిపడ్డారు. దాడికి యత్నిస్తున్నారంటూ పిచ్చి ఆరోపణలు చేయటంకాదు.. ఆధారాలుంటే నిరూపించే దమ్ముందా? అంటూ ఆయన సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. పెడన ప్రజలు శాంతి కాముకులని.. ఏనాడూ చిన్న హింసకు కూడా పాల్పడలేదని చెప్పారు. అలాంటి వాళ్లు నిన్ను అడ్డుకోవడానికి, నీ సభను చెదరగొట్టడానికి కత్తులు, రాడ్లతో దాడులు చేస్తారని అంటావా? అని జోగి రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు నీ వారాహి యాత్రను అడ్డుకోవాల్సిన అవసరం మాకేంటని మండిపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

అవనిగడ్డ సభ ఫ్లాప్‌తో పవన్‌లో దిగులు పట్టుకుంది. పెడనలో కూడా బుధవారం జరిగే సభకు ఇలాగే జనం రారని భయపడుతున్నారు. అంగళ్లు మాదిరిగా అక్కడ గొడవల్ని సృష్టించే కుట్రకు తెరతీశారు. అందుకే పవన్ ఇలా మాట్లాడుతున్నారు. జైలులో ఉన్న దత్తతండ్రి మాస్టర్‌స్కెచ్ ఇది. ఆదిలోనే టీడీపీ, జనసేన పొత్తు వికటించింది. చంద్రబాబుతో జతకు పవన్ ఒక్కడే తహతహలాడున్నారు. అధినేత నిర్ణయాన్ని పవన్ అభిమానులు, జనసేన పార్టీ కేడర్ ఒప్పుకోలేకపోతోంది. ఇక జనసేన పార్టీ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. పవన్ చాప, దిండు సర్దుకుని హైదరాబాద్‌కు వెళ్లడమే తరువాయి. అవనిగడ్డలో మూడుగంటలసేపు కష్టపడి మీటింగ్ కొనసాగిస్తే కేవలం 300 మంది మాత్రమే సభాస్థలిలో ఉన్నారు. అది కూడా టీడీపీ, జనసేన జతకట్టిన తర్వాత జరిగిన మొట్టమొదటి సభలో. ఇదీ వాళ్ల పరిస్థితి. పార్టీ పరువు పోతుందని జనసేన, టీడీపీ నేతలు తమ కేడర్‌కు ఫోన్లు చేస్తేనే అంతమంది వచ్చారు.

పవన్‌కళ్యాణ్‌ను నమ్మొద్దు..

గతకాలపు అనుభవాల్ని తెలుసుకున్న తర్వాత కూడా టీడీపీతో జతకట్టి చంద్రబాబును మరోమారు గద్దెనెక్కించేందుకు జనసేన కార్యకర్తలెవరూ సిద్ధంగా లేరు. ఇదే విషయంపై బాహాటంగానే ఆ పార్టీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఇక ఆ పార్టీ కార్యకర్తలకు, పవన్‌కళ్యాణ్ అభిమానులకు చెప్పేదేమంటే, ఇప్పటికైనా ఆయన మాటల్లోని మర్మాన్ని అర్థంచేసుకోవాలి. పవన్‌ను నమ్మితే జనసైనికులు నట్టేట మునిగినట్లే.

జనసేన అలా చతికిలపడడానికి కారణం టీడీపీతో జత కట్టడమే. అధినేత తీరు వారికి నచ్చడంలేదని దీంతో తేలిపోయింది.

6న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం

5న జరగాల్సిన భేటీ వాయిదా



సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో మే నెల వరకు రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించి, కేటాయింపుల కోసం కృష్ణా బోర్డు చైర్మన్‌కు సిఫార్సు చేయడమే లక్ష్యంగా ఈ నెల 6న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశమవుతోంది. తొలుత ఈ సమావేశాన్ని ఈ నెల 5న నిర్వహించాలని త్రిసభ్య కమిటీ కన్వీనర్, బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు లేఖ రాశారు. కానీ.. రెండు రాష్ట్రాల ఈఎన్‌సీల సూచనల మేరకు సమావేశాన్ని ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే తెలిపారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చాకే సమస్యల పరిష్కారం

- జనవాణి కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్
- పరిష్కారం ఇప్పుడు కానప్పుడు జనవాణి ఎందుకో అర్థంకాని అర్జీదారులు
- పొత్తులో ఉన్న బీజేపీ గురించి ఒక్క మాటా చెప్పని పవన్


మీటర్ రీడర్ల సమస్యలపై మాట్లాడుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

మచిలీపట్నం టౌన్/చిలకలపూడి (మచిలీపట్నం): టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం వచ్చాక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జనసేన నేత పవన్ కళ్యాణ్ చెప్పారు. పవన్ మంగళవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని సువర్ణ కళ్యాణ మండపంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు, సంఘాల నాయకుల నుంచి అర్జీలు స్వీకరించారు. అయితే, సమస్యలకు పవన్ పరిష్కారం చూపిస్తారనో, పోరాటం చేస్తారనో ఆశించిన అర్జీదారులకు నిరాశే ఎదురైంది. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం వచ్చాక పరిష్కరిస్తామని పవన్ ప్రతి అర్జీదారుడికి చెప్పడంతో వారంతా కంగుతిన్నారు. అటువంటప్పుడు ఇప్పుడే జనవాణి కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించారని పలువురు అక్కడే చర్చించుకున్నారు. జనసేనతో పొత్తులో ఉన్న బీజేపీ పేరును పవన్ జనవాణిలో ఎక్కడా ప్రస్తావించకపోవటం గమనార్హం. టీడీపీ, జనసేన మాత్రమే పొత్తులో ఉన్నట్లుగా ఆయన వ్యవహరించారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, నేడు వాటిని పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని, ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి తమను తొలగించాలని చూస్తోందని పవన్‌కు విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. టెక్నాలజీని అప్‌డేట్ చేయటం అవసరమేనని, అయితే కార్మికులను పరిగణనలోకి తీసుకుని విడతలవారీగా అమలు చేస్తూ వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై అధికారంలోకి రాగానే టీడీపీతో చర్చించి పరిష్కారం చూపిస్తామన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఆంధ్రజాతీయ, హిందూ కళాశాలలకు ఎయిడెడ్ గుర్తింపు రద్దు చేసి భూములు లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఏబీవీపీ నాయకులు పవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, వీటిని అసెంబ్లీలోకి అడుగుపెట్టి అడుగుతాం లేదా తమ ప్రభుత్వం వస్తే పరిష్కరిస్తామని పవన్ హామీ ఇచ్చారు. పలువురు వ్యక్తిగత సమస్యలను విన్నవించారు.

పెడనలో అల్లర్లకు వైఎస్సార్‌సీపీ ప్రణాళిక: పవన్

జనసేన వారాహి యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం పెడనలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అల్లర్లు సృష్టించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. మచిలీపట్నంలో జనవాణి కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలు అల్లరిమూకలను రప్పించి రాళ్లతో దాడి చేయించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోందన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే జనసైనికులు సంయమనం పాటించి వారిని పోలీసులకు అప్పగించాలని అన్నారు. అనుమానాస్పదంగా కనిపించినా, మారణాయుధాలు తీసుకువచ్చినా వారిని చుట్టుముట్టి బంధించాలన్నారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు జరిగినా రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

ప్రతి అర్జీకి మనోహర్‌తో మాట్లాడాకే స్పందన

పవన్ తన వద్దకు వచ్చిన ప్రతి అర్జీపైనా జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడిన తర్వాతే స్పందించారు. ఆ సమస్యపై మైక్‌లో మాట్లాడుతూ.. మధ్యలో కూడా మనోహర్‌తో, వరప్రసాద్‌తో చర్చించటం కనిపించింది. సమస్యలపై అవగాహన లేకపోవటం వల్లే ప్రతి అంశం పైనా వారితో పవన్ చర్చిస్తున్నారని జనసేన నేతలే చెబుతున్నారు.

జనసేనతో పొత్తు ఉందో.. లేదో పైవాళ్లే చెప్పాలి

- పవన్‌కళ్యాణ్ ప్రతి మాటకు మేం స్పందించాల్సిన అవసరం లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి: ప్రస్తుతం బీజేపీ–జనసేన పొత్తు కొనసాగుతోందా లేదా అన్నది తమ అధిష్టానమే చెబుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పార్టీ కోర్ కమిటీ సమావేశం జరిగింది. పురందేశ్వరితో పాటు పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ సుజనాచౌదరి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, కోర్‌కమిటీ సభ్యులు చంద్రమౌళి, రేలంగి శ్రీదేవి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దయాకర్‌రెడ్డి, సీతారామాంజనేయచౌదరి, శివన్నారాయణ, కాశీవిశ్వనాథరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనసేనతో పొత్తు అంశం, ఇటీవల పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం పార్టీతో పొత్తు గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బీజేపీ పేరు కనీసం ఉచ్చరించకపోవడం తదితర అంశాలపై సమావేశంలో కీలకంగా చర్చించారు. సమావేశ వివరాలను పురందేశ్వరి మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జనసేనతో ప్రస్తుతం బీజేపీ పొత్తు కొనసాగుతోందా.. లేదా.. అని ఓ విలేకరి ప్రశ్నించగా.. పురందేశ్వరి బదులిస్తూ 'దానిపై నిర్ణయం మా కేంద్ర నాయకత్వం తీసుకుంటుంది. రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితిని మేం మా నాయకత్వానికి వివరించి చెబుతాం. వారు (పవన్‌కళ్యాణ్) ఏకారణంతో ఆ నిర్ణయం తీసుకున్నారో వారే చెప్పారు. అవన్నీ మేం మా నాయకత్వానికి చెబుతాం. దానిపై నిర్ణయం మా కేంద్ర నాయకత్వం తీసుకుంటుంది..' అని చెప్పారు. సాధారణంగా ప్రాంతీయ పార్టీలంటే వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుంటాయిగానీ, తమది జాతీయ పార్టీ అని వ్యాఖ్యానించారు. జాతీయ పార్టీలో ప్రతిదానికి ఒక ప్రొసీజరు ఉంటుందని, దాని ప్రకారమే వెళతామని చెప్పారు. బీజేపీతో కలిసి వెళితే ఓట్లు వస్తాయేమోగానీ, జనసేన నుంచి ఎంతమంది అసెంబ్లీకి వెళతామో గ్యారంటీ ఇవ్వలేమంటూ పవన్ తమ పార్టీ నేతల సమావేశంలో మాట్లాడిన మాటలను విలేకరులు గుర్తుచేయగా.. 'అది ఆయన కామెంట్. వారి ప్రతి కామెంట్ మీద నేను స్పందించాల్సిన అవసరం లేదు. మా పార్టీ, మా నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో దానికి అనుకూలంగానే వెళతాం..' అని బదులిచ్చారు. జనసేన–టీడీపీ పొత్తు కచ్చితం, మాతో బీజేపీ కలిసివస్తుందో రాదో తేల్చుకోవాలని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రస్తావించగా.. 'వారి (పవన్) వైపు నుంచి ఆయన చెప్పారు. మాకు కూడా పైనుంచి రావాలి కదా. మా నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటే దాన్ని అనుసరించి వెళతాం' అని ఆమె పేర్కొన్నారు.

దసరాకు ముందే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

దసరా పండుగకు ముందే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించాలని కోర్ కమిటీ సమావేశం నిర్ణయించినట్లు పురందేశ్వరి చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, నాయకుడు సంతోష్ ఆ సమావేశానికి వస్తారని తెలిపారు.

జైల్లో చంద్రబాబు చాలా బాగున్నారు

- రాష్ట్ర మాజీ హోం మంత్రి చినరాజప్ప వెల్లడి
- జైల్లో ఉన్నా ఆయన ధ్యాసంతా ప్రజాసేవపైనే ఉంది..
- బాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణి, చినరాజప్ప ములాఖత్
- 40 నిమిషాలు రాజకీయ పరిస్థితి, పార్టీ వ్యవహారాలపై చర్చ
- చంద్రబాబును ఐదోసారి జైలులో కలిసిన భువనేశ్వరి



సాక్షి, రాజమహేంద్రవరం: సెంట్రల్ జైల్లో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చాలా బాగున్నారని, ఆయన ఆరోగ్యం కూడా బాగుందని రాష్ట్ర మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. చంద్రబాబు జైల్లో ఉన్నా ఆయన మనసంతా ప్రజాసేవపైనే ఉందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు నాయుడిని ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణితోపాటు మాజీ హోం మంత్రి చినరాజప్ప ములాఖత్ ద్వారా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు 40 నిమిషాలపాటు చంద్రబాబుతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు తెలిసింది. జైల్లో ఉన్న చంద్రబాబును భువనేశ్వరి కలవడం ఇది ఐదోసారి. ములాఖత్ అనంతరం భువనేశ్వరి, బ్రాహ్మణి నేరుగా లోకేశ్ క్యాంప్‌నకు వెళ్లిపోయారు. జైలు వద్ద చినరాజప్ప విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని చంద్రబాబు చెప్పారని తెలిపారు. బాబుకు బెయిల్ రాకుండా సీఎం జగన్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులు సైతం జగన్ చెప్పిన మాటలే వింటున్నారని విమర్శించారు. త్వరలోనే టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అరెస్టును చినరాజప్ప ఖండించారు.

భువనేశ్వరిని కలిసిన అమరావతి రైతులు

మరోవైపు అమరావతి నుంచి వచ్చిన పలువురు రైతులు లోకేశ్ శిబిరం వద్ద భువనేశ్వరిని కలిశారు. రైతుల త్యాగాలు వృథాకావని, అమరావతి నిర్మాణం జరిగి తీరుతుందని భువనేశ్వరి చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు తమకు తెలియజేస్తున్న మద్దతు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అదే మన ఆయుధమని భువనేశ్వరి తెలిపారు.

24వ రోజుకు చంద్రబాబు జైలు జీవితం

కాగా, చంద్రబాబు నాయుడు జైలు జీవితం 24వ రోజుకు చేరుకుంది. రోజుమాదిరిగానే ఆయన దినచర్య సాగింది.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్

- ప్రభుత్వంపై బురదజల్లుతున్న ప్రతిపక్షాలకు ఈ కార్యక్రమం చెంపపెట్టు
- రాష్ట్రంలో మూడు రోజుల్లోనే 1.57 లక్షల మందికి వైద్యసేవలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని
- విశాఖలో సురక్ష వైద్యశిబిరం ప్రారంభించిన మంత్రి


వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని. పక్కన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి

మద్దిలపాలెం (విశాఖపట్నం): జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. విశాఖ నగరం 16వ వార్డులోని ఇసుకతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు విశేషస్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో 10,032 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 542 పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో 45 రోజులపాటు 10,574 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల 30న వైద్యశిబిరాలు ప్రారంభం కాగా.. రాష్ట్రవ్యాప్తంగా 611 శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో 1.57 లక్షలమందికి వైద్యపరీక్షలు చేశామని, వీరిలో 6,089మందికి మెరుగైన వైద్యచికిత్స కోసం రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేశామని వివరించారు. వీరందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ శిబిరాల్లో నాలుగువేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్టు వైద్యులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇదో చరిత్రాత్మక ఘట్టమన్నారు. పల్లెలు, కాలనీల్లోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలకు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి వైద్యం చేయడం రాష్ట్రంలో మునుపెన్నడూ చూడలేదని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 3,257 వ్యాధులకు వర్తింపజేశామని, వైద్యంతోపాటు చికిత్స తర్వాత దినసరి భత్యం అందిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు కింద రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారన్నారు. వీటిలో ఇప్పటికే ఐదు కళాశాలలను ప్రారంభించారని గుర్తుచేశారు. నాలుగేళ్ల పాలనలో కేవలం వైద్యానికి రూ.3,600 కోట్లకుపైగా ఖర్చుచేశామని ఆమె చెప్పారు.

చంద్రబాబు ఆర్థిక ఉగ్రవాది

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్రంలో అతి పెద్ద ఆర్థిక ఉగ్రవాది మాజీ సీఎం నారా చంద్రబాబు అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. ఆమె విశాఖ సిరిపురంలోని తన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రూ.371 కోట్ల అవినీతి కేసులో అరెస్టైన వ్యక్తి కోసం దొంగదీక్ష చేయడం మన రాష్ట్రంలోనే చూస్తున్నామని ఎద్దేవా చేశారు. కోర్టులు చంద్రబాబుకు రిమాండ్ ఇస్తూ తీర్పులిస్తుంటే భువనేశ్వరి మాత్రం దీక్షలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థపై నమ్మకం లేక కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా దీక్షలకు పూనుకున్నారని అనుకోవాలా.. లేక చట్టాలకు చంద్రబాబు అతీతుడని టీడీపీ నేతలు భావిస్తున్నారా.. అని ప్రశ్నించారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబుకు అబద్ధాల మహారాణి భువనేశ్వరి అని ఎద్దేవా చేశారు. గాడ్సే కన్నా నీచుడు చంద్రబాబు అని తన తండ్రి ఎన్టీఆర్ చెప్పారని, అలాంటి వ్యక్తి కోసం భువనేశ్వరి దొంగదీక్షలు చేస్తున్నారని విమర్శించారు. 2016లో రూ.57 కోట్లు ఉన్న చంద్రబాబు కుటుంబం ఆస్తి రూ.20 వేల కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. భువనేశ్వరి దీక్ష పేరుతో దళిత, బీసీ మహిళలను కాళ్ల దగ్గర కూర్చోబెట్టుకోవడం ఏమిటని వరుదు కల్యాణి నిలదీశారు.

విద్యార్థుల క్షేమమే లక్ష్యంగా

మరిన్ని చర్యలు

హాస్టళ్లలో అవాంఛనీయ ఘటనల నివారణకు ప్రభుత్వం మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే గుర్తించిన 15 రకాల ప్రమాదాలను నివారించేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలోని 3,783 హాస్టళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై అధికారులకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. హాస్టళ్లలో ఐదు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ, వికలాంగుల, జువైనల్ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థుల భద్రత, విద్య, ఆహారం, ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో అనేక ముందు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉంది.



వాటిలో పాము కాటు, కుక్క కాటు, తేలు కుట్టడం, కరెంట్ షాక్, ఎత్తయిన ప్రదేశం నుంచి పడిపోవడం, గాయపడటం, ఆత్మహత్య, ఆత్మహత్యాయత్నం, అనారోగ్యం, కలుషిత ఆహారం, ఈవ్ టీజింగ్ తదితరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించింది. యంత్రాంగం తక్షణమే స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను, నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొంది. ఏదైనా ఘటన జరిగితే వెంటనే హాస్టల్ బాధ్యులు సంబంధిత అధికారులకు సమాచారం తెలియజేసి.. ఉపశమన చర్యలు చేపట్టాలని సూచించింది. హాస్టళ్లలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విద్యార్థులను ఆస్పత్రులకు తరలించాలని స్పష్టం చేసింది. ఏదైనా హాస్టల్‌లో ఘటన జరిగితే.. 5 నిమిషాల్లోనే సంబంధిత హాస్టల్ బాధ్యులు స్పందించి అక్కడికి చేరుకోవాలని సూచించింది. పది నిమిషాల్లో ఉన్నతాధికారులకు.. 15 నిమిషాల్లో కలెక్టర్‌కు.. అరగంటలోగా పిల్లల తల్లిదండ్రులకు సమాచారమివ్వాలని స్పష్టం చేసింది. ఘటన తీవ్రత ఆధారంగా హాస్టల్ నిర్వాహకులతో పాటు డివిజనల్, జిల్లా స్థాయి అధికారులు వీలైనంత త్వరగా అక్కడికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఘటన జరిగిన 24 గంటల్లో విచారణ చేసి ప్రాథమిక నివేదికను అందించాల్సి ఉంటుంది. 48 గంటల్లోగా జిల్లా స్థాయి అధికారి ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది.

బాబు అరెస్టుపై పచ్చపత్రికల రాద్ధాంతం

ఆ పత్రికల్లో రాసినట్లు ఎక్కడన్నా నిరసనలు జరుగుతున్నాయా?

- 'అయ్యో చంద్రబాబు' అన్నవాళ్లు మాకెక్కడా కనబడడంలేదు.
- కాపుల్ని పవన్ దూరం చేసుకున్నాడు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టు తర్వాత సప్తసముద్రాలే ఏకమైపోయినట్లు, భూగోళం రెండు భాగాలు అయినట్లు, ఉపద్రవాలు, ఉప్పెనలే వచ్చేసినట్లు కొన్ని దినపత్రికలు నిత్యం ప్రధాన శీర్షికలతో కథనాలు రాస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఉందా అంటూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఆ పచ్చ పత్రికలు రాస్తున్నట్లు ప్రజలు నిరసనలు తెలియజేస్తున్నారా లేదంటే వాళ్లు తెలియజేసేలా మీరే రాస్తున్నారా? ఆ పత్రికల



వ్యవహారశైలి చూస్తుంటే తప్పుడు కథనాలతో పేట్రేగిపోతూ, రాష్ట్ర ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వాస్తవానికి భూతద్దం పెట్టి వెతికినా 'అయ్యో చంద్రబాబు' అన్నవాళ్లు మాకు కనబడడంలేదు. అసలు స్కాంలు చేస్తే ఎవరిపైనైనా కేసులు రాకుండా ఎలా ఉంటాయి?

ఒక్కో మీటింగ్‌లో ఒక్కోలా పవన్ ప్రసంగం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ లైఫ్‌స్టైల్, రాజకీయంగా అతని వ్యవహారశైలి చూస్తే.. అతను ఎక్కడా భూమి మీద నిలబడి మాట్లాడుతున్నట్లు ఉండదు. పూటకో మాట.. పేటకో వేషం అన్నట్లు, ఒక మీటింగ్‌లో ఒకరకంగా, మరో మీటింగ్‌లో మరో రకంగా మాట్లాడతాడు. అతను తింగరి నిర్ణయాలన్నీ కాపులందరూ సమర్థించాలన్నట్లు మాట్లాడుతున్నారు. కాపులు అతనికి ఏమన్నా పట్టం కట్టారా!? టీడీపీకి మద్దతు తెలపడమే కాదు, ఆ పార్టీ వాళ్లు ఒక మాట అన్నా జనసైనికులు ఏమీ పట్టించుకోవద్దంటూ పవన్ వ్యాఖ్యానించి కాపులందరినీ పూర్తిగా దూరం చేసుకున్నాడు.

ఏడాది పొడవునా ధర్మ ప్రచార కార్యక్రమాలు..

ఇక దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏడాది పొడవునా ధర్మ ప్రచార కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆగస్టులో అన్నవరం ఆలయం నుంచి ఈ కార్యక్రమాలు మొదటిపెట్టి, ఇప్పటికే శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో చేపట్టామని.. దసరా తర్వాత విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. అన్ని ప్రముఖ ఆలయాల్లో మాసోత్సవాలను, ఇతర 6 (ఏ) కేటగిరి ఆలయాల ఆధ్వర్యంలో ఆయా ఆలయాల పరిధిలో ధర్మ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు కొట్టు సత్యనారాయణ ప్రకటించారు. అక్టోబరులో ఉత్తరాంధ్ర 6(ఏ) కేటగిరి ఆలయాల్లో ప్రత్యేకంగా ధర్మ ప్రచార వారోత్సవాలు చేపడతామని.. వరుసగా రాయలసీమ, కోస్తా జిల్లాలో ఏడాది పొడవునా ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో టెంపుల్ టూరిజానికి మంచి ప్రాచుర్యం ఉంది. అదే తరహాలో రాష్ట్రంలో కూడా టెంపుల్ టూరిజానికి దేవదాయ శాఖ ప్రాధాన్యత కల్పిస్తాం. ఆరాధన, శ్రీశైలప్రభ, కనకదుర్గ ప్రభ పుస్తకాల మాదిరిగానే రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల ఆధ్వర్యంలో మాస పత్రికలు ప్రచురించేలా చర్యలు తీసుకుంటాం.

ఆకులపై జంతువుల డీఎన్ఏ

అడవుల్లోని వృక్ష సంపదపై జంతువుల డీఎన్ఏలను గుర్తించిన శాస్త్రవేత్తలు

- ఆకులపై స్వాబ్ నమూనాలను విశ్లేషించడం ద్వారా భారీ ఎత్తున జీవ వైవిధ్యం నమోదు
- తక్కువ ఖర్చు, సమయం ఆదాతో పాటు పూర్తి స్థాయిలో జీవ వైవిధ్య మ్యాపింగ్‌కు అనుకూలం
- ఉగాండా వర్షారణ్యాల్లో అంతర్జాతీయ పరిశోధకుల బృందం అధ్యయనంలో వెల్లడి




సాక్షి, అమరావతి: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు ఏ ప్రాణి.. ఎక్కడ.. ఎలా జీవిస్తోందనే సమాచారం సేకరించేందుకు శాస్త్రవేత్తలు కొత్త పద్ధతులను అన్వేషిస్తున్నారు. ఇప్పటివరకు కెమెరా ట్రాపింగ్, లైన్ ట్రాన్‌సెక్టులను ఉపయోగించి జంతువుల కదలికలను ట్రాక్ చేయడం ద్వారా వన్యప్రాణుల ఉనికిని పర్యవేక్షిస్తున్నారు. ఈ ట్రాకింగ్ నిర్దిష్ట ప్రాంతం, ప్రత్యేకించి డిజైన్ చేసిన ట్రయల్స్‌గా మాత్రమే ఉంటోంది. ఇందులో ఖరీదైన పరికరాల వాడకం, శ్రమతో కూడుకోవడంతో పాటు ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. ఒక ప్రాంతంలోని అన్ని జాతులను గుర్తించడం సాధ్యపడటం లేదు. దట్టమైన వర్షారణ్యాల్లో ఈ రకమైన ట్రాకింగ్ కష్టతరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ జీవ వైవిధ్య శాస్త్రవేత్తల బృందం అడవుల్లో జంతువుల డీఎన్ఏ నమూనాల సేకరణ ద్వారా జీవ వైవిధ్యాన్ని సులభంగా, తక్కువ ఖర్చుతో గుర్తించవచ్చని ఓ అధ్యయనంలో పేర్కొంది.

గాలిలోకి కణాలుగా జంతు డీఎన్ఏ

ఉగాండాలోని కిబలే జాతీయ పార్కులోని వర్షారణ్యంలో అంతర్జాతీయ పరిశోధన బృందం మొక్కలు, చెట్ల ఆకులపై జంతువులు డీఎన్ఏలను కనుగొంది. జంతువులు తమ డీఎన్ఏను గాలిలోకి కణాలుగా విడుదల చేస్తున్నట్టు.. అది కాస్తా అడవిలోని వృక్ష సంపదపై సన్నని మైనం పొర మాదిరిగా అల్లుకుంటున్నట్టు పరిశోధనలో తేలింది. ఆకులపైన స్వాబ్ నమూనాలను కాటన్ బడ్స్ ద్వారా సేకరించి డీఎన్ఏ సీక్వెన్సింగ్ పరీక్ష ద్వారా జాతుల వివరాలను తెలుసుకోవడంతోపాటు జీవ వైవిధ్యాన్ని మ్యాప్ చేయవచ్చని పరిశోధన బృందం చెబుతోంది. పర్యావరణంలోని మార్పులను అర్థం చేసుకుంటూ జీవ వైవిధ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి, అటవీ జనాభాను పర్యవేక్షించడానికి డీఎన్ఏ పరీక్షా విధానం ఎంతగానో ఊతమిస్తోంది. కోవిడ్ తర్వాత డీఎన్ఏ సీక్వెన్సింగ్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందడం కూడా కలిసి వస్తోంది. ఆకులను శుభ్రపరచడానికి టెక్నాలజీ, ఖరీదైన పరికరాలు, ఎక్కువ శిక్షణ అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వైల్డ్‌లైఫ్ అథారిటీలో పని చేసే సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర జీవ శాస్త్రవేత్తలు దీనిని సులభంగా నిర్వహించవచ్చు. వాస్తవంగా పర్యావరణంలో సేకరించే డీఎన్ఏ చాలా పెద్దస్థాయిలో జీవ వైవిధ్య పర్యవేక్షణకు దోహదపడుతుంది. వర్షాధార పరిస్థితుల్లో, అత్యంత వేడి పరిస్థితుల్లో మాత్రమే ఆకులపై డీఎన్ఏ త్వరగా క్షీణిస్తుంది తప్ప మిగిలిన సందర్భాల్లో పరిశోధనలకు అనుకూలంగా ఉండటంతో ఈ పద్ధతిపై అంచనాలు పెరుగుతున్నాయి.

గంటలో 50కి పైగా జాతుల గుర్తింపు

కిబలే జాతీయ పార్కు గొప్ప జీవ వైవిధ్యానికి ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలోని 'ప్రైమేట్ క్యాపిటల్' (కోతి జాతులు) నిలయంగా ఉంది. ఇందులో అంతరించిపోతున్న రెడ్ కోలోబస్ కోతి, చింపాజీలతో సహా 13 జాతులు ఇందులో ఉన్నాయి. ఇక్కడ పరిశోధకులు కేవలం ఒక గంటలో 24 కాటన్ బడ్స్ ద్వారా ఆకులపై స్వాబ్ నమూనాలను సేకరించారు. వాటి విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపగా.. ఏకంగా 50 రకాల క్షీరదాలు, పక్షులు, ఒక కప్ప జాతులను గుర్తించడం గమనార్హం. ప్రతి మొక్క ఆకులపై దాదాపు 8 జంతు జాతులను కనుగొన్నారు. వీటిల్లో పెద్దవైన అంతరించిపోతున్న ఆఫ్రికన్ ఏనుగు నుంచి చిన్న జాతులైన సన్‌బర్డ్ వరకు భారీ జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబించాయి. డీఎన్ఏల ద్వారా ఒక మీటరు పొడవాటి రెక్కలుండే గబ్బిలాలు, బయటకు కనిపించని పర్వత కోతులు, బూడిద, ఎరుపు వర్ణాల కోతులు, సుంచు ఎలుకలు, అనేక రకాల చిలుకలు ఉన్నట్టు గుర్తించారు.



THE SOUTH INDIAN BANK LIMITED

85th Dividend Warrant 2022-23

0 8 0 9 2 0 2 3

Valid upto: 07th December, 2023

PAY DACHAVARAM RAJASHEKAR A/c No.20150221814 STATE BANK OF INDIA

RUPEES ZERO AND PAISE SIXTY ONLY

₹ ********0.60

A/c No. 02990730000001274

FOLIO/CLIENT ID NO.	WARRANT NO.
IN30302820604626	54754

For THE SOUTH INDIAN BANK LIMITED

AUTHORISED SIGNATORY

PAYABLE AT PAR AT ALL OUR BRANCHES

'చెక్కు' అవాక్కు..!

నంగునూరు (సిద్దిపేట): 'చారాణా కోడికి బారాణా మసాల' అనే సామెత నిజం చేస్తూ 60 పైసల బ్యాంక్ చెక్కును చూసి ముక్కున వేలు వేసుకున్నారు ప్రజలు. సిద్దిపేట జిల్లా నర్మేటకు చెందిన దాచవరం రాజశేఖర్‌కు రెండు రోజుల కిందట స్పీడ్‌పోస్ట్ ద్వారా కవర్ వచ్చింది. అందులో కేరళలోని సౌత్ ఇండియా బ్యాంక్ త్రిసూర్ బ్రాంచ్ నుంచి అకౌంట్‌పే ద్వారా 60 పైసల చెక్కు రావడంతో రాజశేఖర్ అవాక్కయ్యాడు. చెక్కు ఎవరు పంపారు.. తనకు డబ్బులు ఎందుకు వచ్చాయో.. తెలియక జుట్టు పీక్కున్నాడు. రెండు రోజులపాటు కష్టపడి విచారిస్తే గతంలో క్రెడిట్ కార్డు ద్వారా తీసుకున్న లోన్ క్లియరెన్స్ చేయగా 60 పైసలు ఎక్కువ కట్టినట్లు తేలగా చెక్కు పంపారని తెలుసుకున్నాడు. రాజశేఖర్‌కు చెల్లించే డబ్బులకంటే చెక్కు ఓచర్, స్పీడ్ పోస్టుకు అయ్యే ఖర్చులు ఎక్కువైనా న్యాయ బద్ధంగా చెక్కు పంపినందుకు లోన్ ఇచ్చిన కంపెనీ వారిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇంతకీ 60 పైసల చెక్కు తన అకౌంట్‌లో వేసుకోవాలా.. వద్దా అని రాజశేఖర్ డైలమాలో పడిపోయారు.

తెలంగాణ

ఘనంగా మాతా అమృతానందమయి జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: మాతా అమృతానందమయి 70వ జన్మదిన వేడుకలను ఆమె భక్తులు కేరళలోని అమృతపురిలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన జన్మదిన వేడుకలు మంగళవారం ముగిసినట్టు అమృతానందమయి మఠం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ, నిస్వార్థంతో అంతా కలిసికట్టుగా జీవించాలని మాతా అమృతానందమయి సందేశం ఇచ్చినట్టు పేర్కొన్నారు. యువత పెడధోరణులు పట్టకుండా తల్లిదండ్రులు వారిలో ఉన్నత విలువలు పెంపొందించాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. మంగళవారం నిర్వహించిన జన్మదిన కార్యక్రమంలో కేరళ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్, కేంద్రమంత్రులు మహేంద్రనాథ్ పాండే, అశ్వినీకుమార్‌తోపాటు 193 దేశాల ప్రతినిధులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం కోసం అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో మంగవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశవర్కర్, వలంటీర్ల ద్వారా చేసిన సర్వే ఆధారంగా ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. వైద్యశిబిరాల నిర్వహణలో వైద్యాధికారులు, సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వైద్య శిబిరాలకు వచ్చే వారిలో అధికశాతం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు ఉంటున్నారని వైద్యాధికారులు కలెక్టర్‌కు వివరించగా, అందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో లభించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, డీవైఈవో యువీ సుబ్బారావు, జిల్లా మలేరియా అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఓటర్ల సంక్షిప్త సవరణ పూర్తి..
కృష్ణా జిల్లాలో ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని షెడ్యూలు ప్రకారం పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహణ, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు జనరేషన్, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. సంక్షిప్త సవరణ కార్యక్రమం ఇంటింటికీ వెరిఫికేషన్ పూర్తయ్యిందన్నారు. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో అనర్హత ఓటర్ల వెరిఫికేషన్ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న పరిష్కార చర్యలను కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంయూడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

పెనమలూరు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఆదేశించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షల నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో చదవాలని సూచించారు. పది, ప్లస్ టు ఉపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. విద్యార్థులతో పాఠశాలలో బోధన ఎలా ఉందనే విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 కనకమహాలక్ష్మి, హెచ్ఎం వై.దుర్గా భవాని పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో మంత్రి ఉషాశ్రీచరణ్


అమరేశ్వరాలయంలోకి మంత్రి ఉషాశ్రీచరణ్ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అమరావతి: గుంటూరు జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం అమరావతిలో కొలువైన శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారిని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి ఉషాశ్రీ చరణ్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషాశ్రీచరణ్ దంపతులకు ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ, అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. అమరేశ్వర స్వామి వారికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్య భద్రత

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్య భద్రత చేకూరుతుందని కృష్ణాజిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి పేర్కొన్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని కుందేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మంగళవారం గీతాబాయి ఆకస్మికంగా సందర్శించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అత్యంత నిపుణులైన వైద్యులు పాల్గొనే ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కలకోట రాధిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నందిపాటి


కుందేరులో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి

బిందుమాధవి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రజలకు స్పెషలిస్టుల వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ సుధాప్రసూజ, డాక్టర్ చంద్రిక, డాక్టర్ నిఖిత, డాక్టర్ సంధ్య, కంటి వెలుగు ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ పాల్గొని 603 మందికి వైద్యసేవలు అందించారు. ఎంపీడీవో టి.ఉదయ్‌భాస్కర్, తహశీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): కుటుంబ కలహాల నేపథ్యంలో బావమరిదిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డి.లక్ష్మి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురం, రైల్వేకాలనీకి చెందిన కండెల్లి శేఖర్(29) భార్య, పిల్లలతో కలసి నివాసముంటున్నాడు. ఈ క్రమంలో భార్య గర్భవతిగా ఉన్న సమయంలో ఆసుపత్రిలో రూ.5 వేలు చెల్లించాడు. ఆ డబ్బుల కోసం ప్రతి రోజు సమీపంలోనే నివాసముండే అత్త, బావమరిదితో గొడవపడుతూ.. డబ్బులు తిరిగి ఇవ్వకపోతే చంపేస్తానంటు బెదించేవాడు. ఈ క్రమంలో 2018, జూలై 16న బావమరిది సత్యనారాయపురంలోని రైల్వే ఈటీటీసీ సెంటర్‌లో ట్రైనింగ్‌లో ఉండగా కండెల్లి శేఖర్ అక్కడకు వెళ్ళి బావమరిదితో గొడవకు దిగాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఛాతీ, కడుపు, చేతులపై విచక్షణ రహితంగా పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన అతన్ని సిబ్బంది రైల్వే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సత్యనారాయణపురం పోలీసులు 2018, జూలై 17న నిందితున్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. అనంతరం దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసులో పోలీసులు 15 మంది సాక్షులను విచారించగా నిందితునిపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తు తీర్ప చెప్పారు.

ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులతో యూనివర్శిటీ వైస్ చాన్సలర్ సారథివర్మ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్‌సైన్స్ ఫైనలియర్ ఇంజినీరింగ్ విద్యార్థులు అమెరికాకు చెందిన అంతర్జాతీయ కంపెనీ 'నూటానిక్స్'లో రూ.50.57 లక్షల వార్షిక ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలకు ఎంపికై మరోసారి రికార్డు సృష్టించారని చెప్పారు. విద్యార్థులను అంతర్జాతీయస్థాయిలో నైపుణ్యం కలిగినవారిగా తీర్చిదిద్దడంలో వర్సిటీలోని డీన్‌లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు విజయం సాధించారంటూ వారికి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎన్‌బీవీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు వందశాతం ఉద్యోగాలను అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపికకావడం వెనుక వారి పట్టుదల, అధ్యాపకుల కృషి ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రపంచ పారిశ్రామిక, ఐటీ కంపెనీల అవసరాలకనుగుణంగా మరింత మంది విద్యార్థులను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యార్థులను ప్రపంచస్థాయి నాయకులుగా తయారు చేయడమే తమ యూనివర్సిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు ఎం.సుజిత లక్ష్మి, రంగు ఉషశ్రీ, ఎం.జాహ్నవి లక్ష్మి, వి.శ్రావ్య చందన మాట్లాడుతూ ఉత్తమ విద్యాబోధనతోపాటు భారీ వేతనాలతో కూడిన ఉద్యోగాలను అందించి భవిష్యత్తుకు భరోసా కల్పించారంటూ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టపగలే కారులో చోరీ

అద్దాలు పగులకొట్టి బంగారు ఆభరణాలు అపహరణ

సీతమ్మధార: పార్కింగ్ చేసిన కారు అద్దాన్ని పట్టపగలే పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లిన ఘటన మంగళవారం విశాఖ నగరం నడిబొడ్డున జరిగింది. ఎప్పుడూ జనసంచారం ఉండే డైమండ్ పార్కు దరి సాయిరాం హోటల్ పార్కింగ్ స్థలంలో ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలివి.. రెండు రోజుల పాటు వరస సెలవులు రావడంతో విజయవాడకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి తన కుటుంబంతో అరకు విహారయాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని నగరానికి వచ్చారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు డైమండ్ పార్కు దరి సాయిరాం పార్లర్‌కు టిఫిన్‌కు వెళ్లారు. తన కారును హోటల్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేశారు. టిఫిన్ చేసి తిరిగి 11.15 గంటలకు వచ్చి చూసే సరికి కారు అద్దం పగిలి ఉండటాన్ని చూసి కంగారు పడ్డారు. లోపల చూస్తే బ్యాగు కనిపించలేదు. చోరీ జరిగిందని గ్రహించి వెంటనే డయల్ 100కు కాల్ చేశారు. బ్యాగులో రెండున్నర తులాల బంగారం, రూ.10 వేల నగదు, విలువైన కార్డులు ఉన్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్రైం డీసీపీ నాగేంద్రుడు, ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పార్కింగ్ వద్ద సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నారు. కాగా.. ఇక్కడ ఏర్పాటు చేసిన రెండు కెమెరాల్లో ఒకటి పనిచేయడం లేదు. రెండోది ఘటన జరిగిన వైపు కాకుండా మరో వైపు ఉంది. సీసీ కెమెరాల ఏర్పాటుపై హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్ల దరఖాస్తు గడువు పెంపు

31 వరకు ప్లాట్లు బుక్ చేసుకునే అవకాశం

సాక్షి, అమరావతి: మధ్యతరగతి ప్రజలకు అనువుగా నూజివీడులో ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో అభివృద్ధి చేసిన ప్లాట్ల దరఖాస్తు గడువును ఈనెల 31వతేదీ వరకు పెంచినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీ మ్యాంగో గార్డెన్ రీసెర్చ్ సెంటర్‌ను ఆనుకొని 40.78 ఎకరాల విస్తీర్ణంలో 150, 200, 250 చదరపు గజాల వైశాల్యంలో మొత్తం 393 ప్లాట్లను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఇక్కడ చదరపు గజం ధర రూ.8,500గా నిర్ణయించామని, కొనుగోలుదారులు సులభ వాయిదాల్లో నగదు చెల్లించవచ్చన్నారు. ఈ ప్లాట్లకు ఉన్న అధిక డిమాండ్‌తోపాటు ప్రజల అభ్యర్థన మేరకు దరఖాస్తు గడువును పొడిగించినట్టు ఆయన తెలిపారు.

ఉద్యోగులకు 20శాతం రాయితీ..
పట్టణంలో డిమాండ్ ఉన్న ప్రాంతంలోని ఈ లేఅవుట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10శాతం ప్లాట్లు, నూజివీడు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కోసం 5శాతం ప్లాట్లు రిజర్వు చేసినట్లు వివేక్ యాదవ్ తెలిపారు. వీరికి ప్లాటు ధరలో 20శాతం రాయితీ కూడా కల్పించామన్నారు. ప్రభుత్వ అనుమతులతోపాటు అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ఈ ప్లాట్లను అమ్మకం ధరలో 10శాతం మొత్తాన్ని చెల్లించి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా బుక్‌చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు https://migapdtcp.ap.gov.in లేదా https://crda.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని, సందేహాల నివృత్తికి 0866 – 2527124 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 4-10-2023

ఆమె ముగ్గురు పిల్లలకు కన్నతల్లి.
మరో ఐదుగురికి దత్తత తల్లి.
కుగ్రామాల మహిళలకు వైద్య నారాయణి.
వీటికి తోడు తాజా విజయం 'మిసెస్ తెలంగాణ'


డాక్టర్ స్రవంతి

ఓ మంచి డాక్టరమ్మ @ మిసెస్ తెలంగాణ

డాక్టర్ స్రవంతి గాదిరాజు... తెలంగాణ, నిజామాబాద్‌లో డాక్టర్. యూఎస్‌లో గైనిక్ ఆంకాలజీ చేసి తెలుగు రాష్ట్రాల్లోని ఆదివాసీ మహిళల్లో ఎదురవుతున్న సర్వైకల్ క్యాన్సర్ నిర్మూలన కోసం పని చేస్తున్నారు. 'డాక్టర్ తన ఉద్యోగం హాస్పిటల్‌లోనే అనుకుంటే సమాజం సంపూర్ణ ఆరోగ్యవంతం కాలేదు. పేషెంట్‌లను వెతుక్కుంటూ వైద్యులు వెళ్లగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం. అందుకోసమే ఆదివాసీలు ఎక్కువగా నివసించే, ఆరోగ్యం పట్ల కనీస అవగాహన లేని వారి ఇళ్ల ముందుకు వెళ్తున్నాను. ఆరోగ్య పరిరక్షణ అవసరాన్ని తెలియచేస్తున్నాను. నాలోని ఈ గుణమే నన్ను మిసెస్ తెలంగాణ పోటీల్లో విజేతగా నిలిపింది. నేను బ్యూటీ కాంటెస్ట్‌ల వైపు అడుగులు వేయడం సెలబ్రిటీ గుర్తింపు కోసం కాదు. ఒకవేళ సెలబ్రిటీ గుర్తింపు వస్తే... ఆ గుర్తింపుతో సమాజంలో నేను కోరుకున్న మార్పు కోసం పని చేయడం సులువవుతుంది. బ్యూటీ పజంట్‌గా ఇప్పుడు నేను సమాజానికి చేస్తున్న వైద్యసేవలను మరింత త్వరగా విస్తరించగలుగుతాను' అన్నారు 'సాక్షి'తో డాక్టర్ స్రవంతి.

పేషెంట్‌ల దగ్గరకు వెళ్లాలి!

ఈ రోజు మీకు కనిపిస్తున్న ఈ విజేత గుర్తింపు అన్నది నేను సాధించిన ఘనత అని అనుకోను. మా అమ్మానాన్నలు తీర్చిదిద్దిన కూతుర్ని. అమ్మ గవర్నమెంట్ హాస్పిటల్ స్టాఫ్ నర్స్. నాన్న విజయ డైరీలో మేనేజర్. అమ్మ తన డ్యూటీ విషయంలో ఎంత కచ్చితంగా ఉండేదో, తన సలహా సూచనల కోసం వచ్చిన వారిని ఎంత ఆప్యాయంగా చూసుకునేదో దగ్గరగా చూశాను. ప్రభావతక్క అని అందరూ ఆమెని సొంత అక్కలా అభిమానించే వారు. అమ్మతోపాటు హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు డాక్టర్ కనిపించగానే పేషెంట్‌లు సంతోషంగా కృతజ్ఞత వ్యక్తం చేయడం చూసి అమ్మను అడిగితే, డాక్టర్‌ను దేవుడిలా చూస్తారని చెప్పింది. అంతే! ఇది అత్యుత్తమమైన వృత్తి అనే అభిప్రాయం స్థిరపడిపోయింది. అమ్మకు నైట్ షిఫ్టులుండేవి. అప్పుడు నాకు జడలు వేయడం నుంచి బాక్స్‌లు పెట్టడం వరకు మా నాన్నే చేశారు. మా అన్నయ్యను, నన్ను పెంచడం, చక్కగా తీర్చిదిద్దడం కోసమే వాళ్ల జీవితాలను అంకితం చేశారు. నేను సిక్స్ క్లాస్ వరకు విజయవాడలో చదివాను. ఉద్యోగాల్లో బదిలీలతో గుంటూరు, రాజమండ్రి, వైజాగ్ అన్నీ చూశాం. నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం నాకు బాగా గుర్తున్న స్కూలు. ఎమ్‌సెట్ తొలి ప్రయత్నంలో మంచి ర్యాంకు రాలేదు. అప్పుడు అమ్మ 'మనది మధ్యతరగతి కుటుంబం. డొనేషన్ సీట్లతో చదివించలేం. బీఎస్సీలో చేరి మళ్లీ ప్రయత్నం చెయ్యి. అప్పుడూ రాకపోతే డిగ్రీ పూర్తి చెయ్యి' అని కరాకండిగా చెప్పి డిగ్రీలో చేర్పించింది. ఆ ఉక్రోషంతో చేసిన రెండవ ప్రయత్నంలో తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో ఫ్రీ సీటు వచ్చింది. తొలి పోస్టింగ్ అనంతపురం జిల్లా రాకట్ల డిస్పెన్సరీలో. అప్పుడు కూడా మార్గదర్శనం చేసింది అమ్మే. ప్రైవేట్ డాక్టర్ క్రేజ్ ఉండేది నాకు. గవర్నమెంట్ ఉద్యోగం విలువ తెలుసుకోమని గట్టిగా చెప్పింది. గవర్నమెంట్ ఉద్యోగం కాబట్టే ఉద్యోగం చేస్తూ మధ్యలో సెలవు పెట్టుకుని యూఎస్‌లో కోర్సులు చేయడం సాధ్యమైంది. అంతేకాదు. గవర్నమెంట్ ఉద్యోగం వల్ల మారుమూల ప్రదేశాలను దగ్గరగా చూడడం, అక్కడి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం వల్ల, ఉద్యోగ పరిధి దాటి బయటకు వచ్చి మరింత ఎక్కువగా సర్వీస్ చేయాల్సిన అవసరం తెలిసి వచ్చింది. కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లి మహిళలకు మెన్‌స్ట్రువల్ హైజీన్, సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలను గుర్తించడానికి పాప్‌స్మియర్ పరీక్షలు చేయడం, బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో బిజీ అయిపోయాను. నేను రోబోటిక్ గైనిక్ ఆంకాలజిస్టుని. సర్వైకల్ క్యాన్సర్‌ను రూపుమాపాలనేది నా లక్ష్యం. ఈ నెల బెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా శిల్పకళావేదికలో బ్యూటీ పజంట్స్ అందరం అవేర్‌నెస్ ర్యాంప్ వాక్ చేస్తున్నాం.


మిసెస్ తెలంగాణ విజేతగా...


ఆదివాసీ మహిళకు వైద్యం చేస్తున్న డాక్టర్ స్రవంతి

సేవకు అందమైన మాధ్యమం

మిసెస్ తెలంగాణ తెచ్చిన సెలబ్రిటీ గుర్తింపుతో ఒక డాక్టర్‌గా, ఒక మహిళగా నా వంతు సామాజిక బాధ్యత అని నేను చేపట్టిన అనేక కార్యక్రమాలను ఇంకా వేగంగా తీసుకువెళ్లగలుగుతాను. వయొలెన్స్ అగైనెస్ట్ ఉమెన్, జెండర్ ఈక్వాలిటీ కోసం పని చేస్తున్నాను. భ్రూణ హత్యలకు కారణం అమ్మాయంటే ఇష్టం లేక కాదు. సమాజంలో అఘాయిత్యాలు పెచ్చుమీరిన ఈ రోజుల్లో అమ్మాయిని భద్రంగా పెంచగలమా లేదా అనే భయమే ప్రధాన కారణమని అనేక మంది మహిళల మాటల ద్వారా తెలిసింది. కొన్ని ఎన్‌జీవోలతో కలిసి తొమ్మిదవ తరగతి నుంచి పన్నెండవ తరగతి చదివే ఆడపిల్లల్లో అవేర్‌నెస్ తీసుకురావడం, అబ్బాయిలను సెన్సిటైజ్ చేస్తున్నాను. ఇక ఇలాంటి కార్యక్రమాలను వేగవంతం చేయగలుగుతాను.

– డాక్టర్ స్రవంతి గాదిరాజు,
అసోసియేట్ ప్రొఫెసర్,
లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్, గైనిక్ ఆంకాలజిస్ట్

సావిత్రినయ్యాను!

ఇక బ్యూటీ పజంట్ విషయానికి వస్తే... నాకు చిన్నప్పటి నుంచి స్కూలు, కాలేజ్ పోటీల్లో అన్నింటిలో పార్టిసిపేట్ చేయడం ఇష్టం. డాన్స్, పెయింటింగ్‌తోపాటు కాలేజీలో ర్యాంప్ వాక్ కూడా చేశాను. మిసెస్ ఇండియా పోటీల గురించి చాలా ఏళ్లుగా పేపర్‌లో చూడడమే కానీ పెద్దగా ఆసక్తి కలగలేదు. కానీ మమతా త్రివేది నిర్వహిస్తున్న కాంటెస్ట్ గురించి తెలిసి గత ఏడాది నవంబర్‌లో నా ఎంట్రీ పంపించాను. కొత్తతరం పిల్లలు చాలా స్మార్ట్‌గా ఉంటున్నారు. మా పెద్దమ్మాయి ఫ్యాషన్ డిజైనింగ్ చేస్తోంది. తను నన్ను ఈ పోటీలకు సిద్ధం చేసింది. మా హజ్బెండ్ నా క్లాస్‌మేట్, దూరపు బంధువు కూడా. ఎమ్ఎన్‌జేలో డాక్టర్. నాకు మంచి సపోర్ట్ ఇస్తారు. మొత్తం ఇరవై రౌండ్‌లు కొన్ని ఆన్‌లైన్, కొన్ని ఆఫ్‌లైన్‌లో జరిగాయి. ఆహార్యం రౌండ్‌లో మహానటి సావిత్రిని తలపించాలని టాస్క్ ఇచ్చారు. సావిత్రి పాత్రలో మెప్పించడమే నన్ను విజేతను చేసింది. మా తోటి పీజంట్‌లు నన్ను సావిత్రి అనే పిలుస్తున్నారిప్పుడు. నా స్మైల్‌కి కూడా ఈ పోటీల్లో మంచి గుర్తింపు వచ్చింది. విజేతలను ప్రకటించేటప్పుడు మాత్రం నర్వస్ అయ్యాను. నా ముఖంలో నవ్వు విరిసే తీర్పు వచ్చింది'' అని చక్కగా నవ్వారు సోషల్ హెల్త్ యాక్టివిస్ట్, మిసెస్ తెలంగాణ విజేత డాక్టర్ స్రవంతి. రాబోయే డిసెంబర్‌లో జరిగే 'మిసెస్ ఇండియా' పోటీల్లో ఆమె తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తారు. 'మిసెస్ ఇండియా' కిరీటం ఆమె కోసం ఎదురు చూస్తోందేమో!.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : మోహనాచారి

ఘనత

మౌన వాదన


సారా సన్నీ

భారతదేశ తొలి బధిర మహిళా అడ్వకేట్ సారా సన్నీ తాజాగా సుప్రీం కోర్టులో సైన్ లాంగ్వేజ్‌లో వాదన వినిపించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఇంటర్‌ప్రెటర్ సహాయంతో ఆమె తన వాదనలు వినిపించి ప్రశంసలు పొందింది. 'ఇలాంటిది చాలా మునుపే జరగాలి. అలస్యం చేశాం' అని జస్టిస్ చంద్రచూడ్ సారా సన్నీని ఉద్దేశించి అన్నారు. సారా పరిచయం.

సెప్టెంబర్ 22. సుప్రీం కోర్టు.

కేసు నంబర్ పిలువగానే నల్లగౌనులో అడ్వకేట్ సారా సన్నీ తన ఇంట్రప్రేటర్ సౌరవ్ రాయ్ చౌదరితో కోర్టు హాల్లోకి ప్రవేశించింది. ధర్మాసనంలో సాక్షాత్తు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఉన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం జావేద్ ఆబిది ఫౌండేషన్ వారు వేసిన ఆ కేసులో ఫౌండేషన్ తరఫున సారా వాదనలు మొదలెట్టింది. వెంటనే కోర్టు హాలు సైలెంట్ అయ్యింది. ఎందుకంటే సారా సైన్ లాంగ్వేజ్ ద్వారా తన వాదనలు వినిపిస్తుంటే వాటిని అంతే వేగంగా ఇంట్రప్రేటర్ కోర్టుకు విన్నవిస్తున్నాడు. అలాగే కోర్టులో జరుగుతున్న ప్రొసీడింగ్స్‌ను సైన్ లాంగ్వేజ్ ద్వారా సారాకు తెలియచేసి బదులుగా సారా సమాధానాన్ని కోర్టుకు చెబుతున్నాడు. సుప్రీంకోర్టులో మొదటిసారిగా ఇలా ఒక ఒక బధిర అడ్వకేట్ మౌనవాదన వినిపించింది. దీనిని చూసిన జస్టిస్ చంద్రచూడ్ 'ఇప్పటికైనా ఇది సాధ్యమైంది.. ఎప్పుడో జరగాల్సింది' అన్నారు. కోర్టులో ఉన్న అడ్వకేట్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సారాను, ఇంట్రప్రెటర్‌ను మెచ్చుకున్నారు. కేసు తదుపరి విచారణకు వాయిదా పడింది. ఒక గొప్ప అనుభూతితో సారా సన్నీ కోర్టు బయటకు నడిచింది. ఇలాంటి ఘనతను సాధించిన మొదటి మహిళా బధిర అడ్వకేట్ కదా మరి.

కేరళ అమ్మాయి

సారా సన్నీ స్వస్థలం కొట్టాయం. ఆమె తండ్రి సన్నీ కురువిల్లా చార్టర్డ్ అకౌంటెంట్. తల్లి బెట్టి గృహిణి. ఈ దంపతులకు పుట్టిన అబ్బాయి ప్రతీక్ బధిరుడు. ఆ తర్వాత ఎనిమిదేళ్లకు కవల ఆడపిల్లలు పుట్టారు. ఇద్దరూ మళ్లీ బధిరులే. వారిలో ఒకరు సారా మరొకరు మారియా. ముగ్గురు సంతానం బధిరులే అయినా తల్లిదండ్రులు ఆ లోటు వారికి తెలియనివ్వకుండా పెంచారు. కొడుకు అమెరికాలో బధిరుల స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా, మారియా చార్టర్డ్ అకౌంటెంట్‌గా స్థిరపడ్డారు. సారా మన దేశంలో మొదటి బధిర అడ్వకేట్ అయ్యింది.

వాదనలు చేస్తూ...

సారా బాల్యం నుంచి అందరితో తెగ వాదించేది. ఆమెకు చెవుడు ఉండటం వల్ల మాటలు రాలేదు. కాని సైన్ లాంగ్వేజ్‌తో అందరితో తెగ వాదనలు చేసేది. 'పెద్దయ్యి లాయర్ అవుతుందేమో' అని సరదాగా తల్లిదండ్రులు అనుకునేవారు. అన్నట్టుగానే జరిగింది. సారా, మారియా ఇద్దరూ బెంగళూరులో చదువుకున్నారు. అక్కడే బి.కాం. చేసి ఒకరు లా వైపు మరొకరు చార్టెర్డ్ అకౌంటెన్సీ వైపు వెళ్లారు. రెండేళ్ల క్రితం సారా లా పట్టా తీసుకుంది. అయితే కర్నాటక కోర్టుల్లో కేసులు వాదించాలంటే ఇంట్రప్రెటర్‌లకు అనుమతి ఇవ్వలేదు. దానికి కారణం– కోర్టు పరిభాష ఇంట్రప్రెటర్‌లకు తెలియదని కోర్టు భావించడమే. అయితే సారా తన వాదనలను కాగితం మీద రాసి జడ్జికి ఇచ్చేది. ఈ విధానాన్ని జడ్జి ఆశ్చర్యంగా చూసేవారు. మెచ్చుకునేవారు కూడా.

సుప్రీం కల

'ఏ రోజైనా నేను సుప్రీం కోర్టులో వాదించాలని అనుకున్నాను' అంటుంది సారా. ఆమె కల ఎట్టకేలకు నెరవేరింది. ప్రతిభావంతంగా వాదనలు చేయగలిగింది. 'దివ్యాంగులు దేనినీ వెలితిగా భావించకూడదు. సాధించాలి. నేను వారికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను. బధిరులు అడ్వకేట్‌లుగా రాణించగలరు. కాకపోతే వారి కోసం ఇంట్రప్రెటర్‌ల వ్యవస్థను ప్రభుత్వం తయారు చేయాలి. అంతేకాదు ఇంట్రప్రెటర్‌ల ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తే బాగుంటుంది' అని కోరుతోంది సారా.

సినిమా


● ఎన్టీఆర్

టైగర్‌లో యంగ్ టైగర్?

యంగ్ టైగర్.. హీరో ఎన్టీఆర్‌ని ఫ్యాన్స్ అలానే పిలుచుకుంటారు. ఈ యంగ్ టైగర్ సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'టైగర్ 3' సినిమాలో నటించనున్నారా? అంటే అవుననంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్న 'వార్ 2' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు ఎన్టీఆర్. ఈ చిత్రం షూటింగ్ నవంబర్‌లో ప్రారంభం కానుంది. అయితే 'వార్ 2' కంటే ముందే ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన సల్మాన్ ఖాన్ నటిస్తున్న 'టైగర్ 3'లో ఎన్టీఆర్ అతిథి పాత్రలో కనిపించనున్నారని టాక్. 'టైగర్ జిందా హై' చిత్రానికి సీక్వెల్‌గా మనీష్ శర్మ దర్శకత్వంలో 'టైగర్ 3' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో క్లయిమాక్స్‌లో ఎన్టీఆర్ కనిపిస్తారని భోగట్టా. కాగా 'టైగర్ 3', 'వార్ 2' రెండు చిత్రాలను యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండటం విశేషం.


● అమితాబ్ బచ్చన్ ● ఫాహద్ ఫాజిల్

రజనీ సినిమాలో...

దాదాపు

మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు మంగళవారం చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. హిందీలో 'అంధా కానూన్' (1983), 'గిరఫ్తార్' (1985), 'హమ్' (1991) వంటి సినిమాల్లో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ స్క్రీన్ చేసుకున్నారు. 'హమ్' తర్వాత రజనీ, అమితాబ్ మళ్లీ 32 సంవత్సరాలకు స్క్రీన్ షేర్ చేసుకోనుండటం విశేషం. ఇక రజనీ 170వ సినిమాలో అమితాబ్ కీలక పాత్ర చేయనున్నట్లు ప్రకటించిన యూనిట్ రానా, ఫాహద్ ఫాజిల్ కూడా ముఖ్య పాత్రలు చేయనున్నట్లు తెలియజేసింది. ఇంకా మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటించనున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త.

దేవుడి పాట నాదే


● రవితేజ

'గుంటూరు రైల్వే స్టేషన్.. దేవుడి పాట పాతికవేలు' అంటూ వేలం పాటతో మొదలైంది 'టైగర్ నాగేశ్వర రావు' సినిమా ట్రైలర్. రవితేజ హీరోగా వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో 'టైగర్ నాగేశ్వర రావు' ట్రైలర్‌ని విడుదల చేశారు. 'పోలీసులకు విజ్ఞప్తి.. కాకినాడ నుంచి మదరాసు వెళ్లు సర్కార్ ఎక్స్‌ప్రెస్ దారిలో దోపిడీకి గురి కాబోతోంది', 'కొట్టే ముందు.. కొట్టేసే ముందు వార్నింగ్ ఇవ్వడం నాకు అలవాటు', 'రేపటి నుంచి స్టూవర్టుపురంలో దేవుడి పాట నాదే.. చెప్పు.. వాడికి' అంటూ రవితేజ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ముంబైలో జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకలో పాల్గొన్న రవితేజ మాట్లాడుతూ– ''ఈ చిత్రంతో హిందీ పరిశ్రమలోకి రావడం హ్యాపీగా ఉంది. హిందీలో నేనే డబ్బింగ్ చెప్పాను. ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ వేడుకలో అభిషేక్ అగర్వాల్, వంశీ, నటీనటులు రేణూ దేశాయ్, గాయత్రీ భరద్వాజ్, అనుపమ్ ఖేర్, జిషు సేన్ మాట్లాడారు.

అలా చేయాలంటే చాలా ధైర్యం కావాలి – శర్వానంద్

''మేం ఒక్క పాత్ర చేయడానికి చాలా కష్టపడుతున్నాం. అలాంటిది 'మామా మశ్చీంద్ర'లో సుధీర్ ఏకంగా మూడు పాత్రలు చేశారు.. ఇలా చేయాలంటే చాలా ధైర్యం కావాలి'' అన్నారు శర్వానంద్. సుధీర్‌బాబు హీరోగా హర్షవర్ధన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. ఈషా రెబ్బా, మృణాళినీ రవి హీరోయిన్లు. సోనాలి నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు శర్వానంద్, విశ్వక్ సేన్, శ్రీ విష్ణు, డైరెక్టర్ శేఖర్ కమ్ముల అతిథులుగా హాజరయ్యారు. ''సుధీర్ మూడు పాత్రలు చేశారంటే కథ ఎంత విలక్షణంగా ఉండి ఉంటుందో అర్థమవుతోంది'' అన్నారు విశ్వక్ సేన్. ''సుధీర్ కొత్త రకం కథలు ప్రయత్నిస్తుంటారు'' అన్నారు శ్రీ విష్ణు. ''మామా మశ్చీంద్ర'లో మంచి కథ, పాటలు, వినోదం.. అన్నీ ఉంటాయి'' అన్నారు సుధీర్‌బాబు. ''ఇది ఒక అమ్మ, తండ్రీకూతుళ్ల కథ'' అన్నారు హర్షవర్ధన్. ''రచయితల నుంచి డైరెక్టర్స్‌గా మారిన త్రివిక్రమ్, కొరటాల శివల్లా హర్షవర్ధన్ కూడా పెద్ద డైరెక్టర్ కావాలి'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు.


● శ్రీ విష్ణు, శర్వానంద్, సుధీర్‌బాబు

ఆ ప్రశ్నలకు సమాధానమే చిన్నా – సిద్ధార్థ్

''నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'చిన్నా'. ఈ సినిమా కోసం 22 ఏళ్లు కష్టపడ్డాను. ఈ సినిమాను నాలుగు భాషల్లో ఏకకాలంలో గత నెల 28న విడుదల చేయాలనుకున్నాను. అదే రోజున ప్రభాస్‌గారి 'సలార్' రిలీజ్ ఉంది. అయితే 'సలార్' చూసినవారు ఆ తర్వాత నా సినిమా 'చిన్నా' చూస్తారనుకున్నాను. కానీ 'సలార్' రిలీజ్ వాయిదా పడటంతో ఆ డేట్‌కు తెలుగులోనూ వద్దామనుకున్నాను. అయితే నాకు థియేటర్స్ దొరకలేదు. తెలుగులో సిద్ధార్థ్ సినిమానా? ఎవరు చూస్తారు? అని అడిగారు. మంచి సినిమా చేస్తే ప్రేక్షకులు చూస్తారని చెప్పాను. ఆ టైమ్‌లో ఏషియన్ సునీల్‌గారు నాకు అండగా నిలిచారు. సినిమా లంటే ఇష్టం ఉంటే 'చిన్నా' సినిమాను థియేటర్స్‌లో చూడండి. ఈ సినిమా చూశాక సిద్ధార్థ్ సినిమాలు మేం చూడము అని ఆడియన్స్‌కు అనిపిస్తే నేను మీడియా ముందుకు రాను'' అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్ టైటిల్ రోల్‌లో నటించి, నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'చిన్నా'. ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తెలుగులో ఏషియన్ సినిమాస్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''ఈశ్వర్ అనే వ్యక్తికి, అతని అన్న కూతురికీ మధ్య ఉన్న అనుబంధమే 'చిన్నా' చిత్రం. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ ఇది. సిద్ధార్థ్ ఇంకా ఎందుకు నటిస్తున్నాడు? నటుడిగా ఎందుకు కొనసాగాలి? అనే ప్రశ్నలకు ఈ సినిమా సమాధానంగా నిలుస్తుంది. ఇక కర్ణాటకలో ప్రెస్‌మీట్ పెడితే నువ్వు తమిళోడివి వెళ్లు అన్నారు. మీ భాషను నేర్చుకుని మీవాడిగా మీ ముందుకొస్తుంటే బయటవాడినని ఆపేస్తున్నారేంటని అర్థం కాలేదు. నవ్వుకుని బయటకు వచ్చేశాను'' అన్నారు.


● కృష్ణకాంత్, అరుణ్‌కుమార్, సిద్ధార్థ్, జాన్వీ

యువ పోలీస్


● రాకేష్ వర్రే

రాకేష్ వర్రే హీరోగా నటిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుబ్బరాజు, శ్రియ శరణ్ ముఖ్య పాత్రధారులు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో జితేందర్ రెడ్డి అనే యువ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు రాకేష్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సహనిర్మాత: ఉమా రవీందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాణిశ్రీ పొడుగు.

నవ్వుల మ్యాడ్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యాన్ నటించిన చిత్రం 'మ్యాడ్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానున్న సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో ఎన్టీఆర్ రిలీజ్ చేశారు. నార్నే నితిన్ మాట్లాడుతూ – ''ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లను ఎంజాయ్ చేసే ట్రెండ్ ఉన్న ఈ తరం కాలేజీ యూత్‌ఫుల్ సినిమా ఇది. ఫన్ ఎక్కువగా ఉంటుంది'' అన్నారు. ''ఎవరికైనా వెండితెరపై హీరోగా చూసుకోవాలనే ఉంటుంది. నాకూ అంతే. అయితే మా అన్నయ్య (సంతోష్ శోభన్) అంత స్ట్రగుల్‌ను నేను ఫేస్ చేయలేదు'' అన్నారు సంగీత్ శోభన్. ''హలో వరల్డ్' సిరీస్ చూసి నాగవంశీగారు ఈ సినిమాకి చాన్స్ ఇచ్చారు'' అన్నారు రామ్ నితిన్.


● రామ్ నితిన్, సంగీత్ శోభన్, గోపికా

సరికొత్త ప్రేమ


● శ్రీరాజ్, మాధవి

అభిదేవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ప్రేమలో...'. పాపలు బాబులు అనేది ట్యాగ్‌లైన్. శ్రీరాజ్ బల్లా దర్శకత్వంలో విజయ మాధవి బల్లా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని నటుడు, నిర్మాత మురళీ మోహన్ రిలీజ్ చేశారు. శ్రీరాజ్ బల్లా మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'ప్రేమలో''' అన్నారు. ''నా భర్త (శ్రీరాజ్) కోసమే నిర్మాతగా మారాను. ప్రేక్షకుల ఆశీర్వాదంతో మరెన్నో మంచి చిత్రాలు తీయాలనుకుంటున్నాను'' అన్నారు మాధవి బల్లా.

హీరోగా ఆరు.. విలన్‌గా మూడు... – నవీన్ చంద్ర



నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నాది సహజత్వానికి దగ్గరగా ఉండే పాత్ర. పేరు మధుసూధన రావు. చదువుకునే రోజుల్లో మధుసూధనరావును అతని స్నేహితులు, శ్రేయోభిలాషులు ఓ హీరోలా ట్రీట్ చేస్తుంటారు. కొంతకాలం గడిచాక అతని ఫ్రెండ్స్ ఎవరికి వారు వారి జీవితాల్లో బిజీ అవుతారు. కానీ మధుసూధనరావు మాత్రం తానొక ఇమేజ్ ఉన్న వ్యక్తిని అనే స్టేట్ ఆఫ్ మైండ్‌లో ఉండిపోతాడు. అతనికి ఏ లక్ష్యం ఉండదు.. బాధ్యతలు తీసుకోడు. డబ్బుపై ఆశ లేదు. ఇలాంటి వ్యక్తి లేఖ (స్వాతి) అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాక వారి జీవితం ఎలా సాగుతుంది? ఎన్నారై అమ్మాయి మధుమతి (శ్రేయా) వీరి జీవితాల్లోకి వచ్చి, ఓ నెల రోజులు ఏం చేసింది? అన్నదే ఈ చిత్ర కథాంశం. ప్రస్తుతం హీరోగా ఆరు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఐదు, విలన్‌గా మూడు సినిమాలు చేస్తున్నాను. వెబ్ సిరీస్‌ల కమిట్‌మెంట్స్ కూడా ఉన్నాయి. నటుడిగా ఎప్పుడూ కెమెరా ముందుండాలన్నదే నా తపన'' అన్నారు.





చైనా గడ్డపై భారత మహిళా అథ్లెట్లు పారుల్ చౌధరీ, అన్ను రాణి అద్భుతం చేశారు. ఆసియా క్రీడల చరిత్రలో తొలిసారి భారత్‌కు 5000 మీటర్ల విభాగంలో పారుల్... జావెలిన్ త్రోలో అన్ను రాణి పసిడి పతకాలు అందించారు. ఈ ఇద్దరితోపాటు మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్యా రామ్‌రాజ్ కాంస్యం... పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ కాంస్యం... పురుషుల 800 మీటర్ల విభాగంలో మొహమ్మద్ అఫ్జల్ రజతం... పది క్రీడాంశాల సమాహారమైన డెకాథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ రజతం గెల్చుకున్నారు. అథ్లెటిక్స్ కాకుండా బాక్సింగ్‌లో రెండు కాంస్యాలు... కనోయింగ్‌లో ఒక కాంస్యం లభించాయి. ఓవరాల్‌గా ఆసియా క్రీడల పదో రోజు భారత్ ఖాతాలో తొమ్మిది పతకాలు చేరాయి. మరో ఐదు రోజులపాటు కొనసాగే ఈ క్రీడల్లో ప్రస్తుతం భారత్ 69 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఆర్చరీలో మూడు పతకాలు... బాక్సింగ్‌లో మరో పతకం... క్రికెట్‌లో ఒక పతకం కూడా ఖరారయ్యాయి. ఫలితంగా ఆసియా క్రీడల చరిత్రలోనే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడం లాంఛనం కానుంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 70 పతకాలు సాధించింది.


అన్ను రాణి


పారుల్ చౌధరీ

• 5000 మీటర్లలో, జావెలిన్ త్రోలో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకాలు అందించిన మహిళా అథ్లెట్లు
• పదో రోజు భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఐదు కాంస్యాలు

పసిడి పారుల్ అన్ను బంగారం

హాంగ్జౌ: బరిలోకి దిగితే పతకం సాధించాలనే లక్ష్యంతో తమ ఈవెంట్లలో పోటీపడుతున్న భారత అథ్లెట్లు ఈ ఆసియా క్రీడల్లో మెరిపిస్తున్నారు. నిలకడగా రాణిస్తూ... తమపై పెట్టుకున్న అంచనాలకు మించి ప్రతిభ కనబరుస్తూ... 1951 తర్వాత ఈ క్రీడల చరిత్రలో పతకాలపరంగా తమ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశారు. పోటీల పదోరోజు భారత్‌కు తొమ్మిది పతకాలు రాగా... అందులో ఆరు అథ్లెటిక్స్ ఈవెంట్ల నుంచి వచ్చాయి. ప్రస్తుతం ఈ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు ఇప్పటికే 22 పతకాలు (4 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలు) గెలిచారు. తద్వారా 2018లో 20 పతకాల ప్రదర్శనను సవరించారు. 1951లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అత్యధికంగా 34 పతకాలు గెలిచారు.

మంగళవారం భారత మహిళా అథ్లెట్లు పారుల్ చౌధరీ, అన్ను రాణి పసిడి కాంతులు విరజిమ్మారు. 5000 మీటర్ల రేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పారుల్ విజేతగా అవతరించింది. ఆమె అందరికంటే వేగంగా 15 నిమిషాల 14.75 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని గెలిచింది. తద్వారా ఈ క్రీడల చరిత్రలో 5000 మీటర్లలో బంగారు పతకం గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా పారుల్ గుర్తింపు పొందింది. తాజా క్రీడల్లో పారుల్‌కిది రెండో పతకం. ఆమె 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో రజతం గెలిచింది. గతంలో మహిళల 5000 మీటర్ల విభాగంలో భారత్ తరఫున సునీతా రాణి (1998–రజతం; 2002–కాంస్యం), ఓపీ జైషా (2006–కాంస్యం), ప్రీజా శ్రీధరన్ (2010–రజతం), కవితా రౌత్ (2010–కాంస్యం) పతకాలు నెగ్గారు. తాజా స్వర్ణ పతకంతో ఉత్తరప్రదేశ్ పోలీసు విభాగంలో తనను డీఎస్పీగా నియమిస్తారని పారుల్ ఆశిస్తోంది. యూపీ ప్రభుత్వ క్రీడా పాలసీ ప్రకారం ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన వారికి డీఎస్పీ ఉద్యోగం ఇస్తారు.

మూడో ప్రయత్నంలో...

వరుసగా మూడోసారి ఆసియా క్రీడల్లో పోటీపడ్డ జావెలిన్ త్రోయర్ అన్ను రాణి తొలిసారి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్ను రాణి కాంస్యం సాధించింది. 2018 జకార్తా క్రీడల్లో ఆరో స్థానంతో నిరాశపరిచింది. మూడో ప్రయత్నంలో 31 ఏళ్ల అన్ను రాణి ఏకంగా బంగారు పతకాన్ని మెడలో వేసుకుంది. 11 మంది పోటీపడ్డ ఫైనల్లో అన్ను రాణి జావెలిన్‌ను తన నాలుగో ప్రయత్నంలో గరిష్టంగా 62.92 మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని ఖరారు చేసుకుంది. నదీషా దిల్హాన్ (శ్రీలంక; 61.57 మీటర్లు) రజతం, హుయ్‌హుయ్ లియు (చైనా; 61.29 మీటర్లు) కాంస్యం గెలిచారు. 'ఏడాది మొత్తం ఎంతో ప్రయత్నించినా నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోయా. ప్రభుత్వం నాపై ఎంతో డబ్బు వెచ్చించి విదేశాల్లో శిక్షణకు పంపించింది. ఫలితాలు రాకపోవడంతో కాస్త నిరాశకు గురయ్యా. అయితే ఆసియా క్రీడల్లో ఈ సీజన్‌లోనే ఉత్తమ ప్రదర్శనతో స్వర్ణం సాధించడంతో చాలా ఆనందంగా ఉంది' అని అన్ను రాణి వ్యాఖ్యానించింది. ఆసియా క్రీడల మహిళల జావెలిన్ త్రోలో గతంలో బార్బరా వెబ్‌స్టర్ (1951; కాంస్యం), ఎలిజబెత్ డావెన్‌పోర్ట్ (1958; రజతం... 1962; కాంస్యం), గుర్మీత్ కౌర్ (1998; కాంస్యం) పతకాలు గెలిచారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విత్యా రామ్‌రాజ్ కాంస్య పతకాన్ని సాధించింది. హీట్స్‌లో 55.42 సెకన్ల సమయం నమోదు చేసి పీటీ ఉష జాతీయ రికార్డును సమం చేసిన విత్యా ఫైనల్లో దానిని పునరావృతం చేయలేకపోయింది. తమిళనాడుకు చెందిన 25 ఏళ్ల విత్యా 55.68 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది.

పురుషుల 800 మీటర్ల విభాగంలో మొహమ్మద్ అఫ్జల్ రజత పతకం గెలిచాడు. తొలిసారి ఆసియా క్రీడల్లో పోటీపడ్డ ఈ కేరళ అథ్లెట్ ఒక నిమిషం 48.43 సెకన్లలో రేసును ముగించి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల ప్రవీణ్ 16.68 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచాడు.


విత్యా


ప్రవీణ్


అఫ్జల్

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	161	90	46	297
జపాన్	33	47	50	130
దక్షిణ కొరియా	32	42	65	139
భారత్	15	26	28	69
ఉజ్బెకిస్తాన్	14	15	21	50
చైనీస్ తైపీ	12	10	18	40
థాయ్‌లాండ్	10	11	19	40
ఉత్తర కొరియా	7	10	6	23
బహ్రెయిన్	7	1	4	12
హాంకాంగ్	6	15	24	45

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

49 ఏళ్ల తర్వాత...


తేజస్విన్

పది క్రీడాంశాల (100 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్లు) సమాహారమైన డెకాథ్లాన్‌లో 49 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం లభించింది. ఢిల్లీకి చెందిన తేజస్విన్ శంకర్ 7666 పాయింట్లతో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకాన్ని సాధించాడు. 2011 నుంచి భారతీందర్ సింగ్ (7658 పాయింట్లు) పేరిట ఉన్న డెకాథ్లాన్ జాతీయ రికార్డును తేజస్విన్ సవరించాడు. 1974 టెహ్రాన్ ఆసియా క్రీడల్లో విజయ్ సింగ్ చౌహాన్ స్వర్ణం, సురేశ్ బాబు కాంస్యం గెలిచాక ఈ క్రీడల్లో మళ్లీ భారత్‌కు పతకం అందించిన డెకాథ్లెట్‌గా తేజస్విన్ గుర్తింపు పొందాడు.

సెమీఫైనల్లో భారత్

యశస్వి జైస్వాల్ మెరుపు సెంచరీ



హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో పాల్గొన్న తొలిసారే భారత పురుషుల క్రికెట్ జట్టు పతకాన్ని ఖాయం చేసుకుంది. ర్యాంకింగ్ ద్వారా నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్టు ఈ దశలో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 23 పరుగుల తేడాతో నేపాల్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. శతకంతో చెలరేగిన యశస్వి జైస్వాల్ (49 బంతుల్లో 100; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) భారత్ తరఫున టి20ల్లో సెంచరీ సాధించిన పిన్న వయస్కుడిగా నిలిచాడు. జైస్వాల్, కెప్టెన్ రుతురాజ్ (25) తొలి వికెట్‌కు 59 బంతుల్లో 103 పరుగులు జోడించారు. చివర్లో శివమ్ దూబే (25 నాటౌట్), రింకూ సింగ్ (15 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. అనంతరం నేపాల్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులే చేయగలిగింది. దీపేంద్ర సింగ్ (15 బంతుల్లో 32; 4 సిక్స్‌లు), సందీప్ జోరా (12 బంతుల్లో 29; 1 ఫోర్, 3 సిక్స్‌లు), కుశాల్ మల్లా (29), కుశాల్ భుర్తెల్ (28) పోరాడారు. రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్ చెరో 3 వికెట్లు తీయగా, అర్ష్‌దీప్‌కు 2 వికెట్లు దక్కాయి.

29 ఏళ్ల తర్వాత కనోయింగ్‌లో పతకం



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత క్రీడాకారులు అర్జున్ సింగ్–సునీల్ సింగ్ ఆసియా క్రీడల కనోయింగ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకం అందించారు. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ కనోయ్ 1000 మీటర్ల స్ప్రింట్‌లో అర్జున్–సునీల్ 3ని:53.329 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచారు. 1994 హిరోషిమా ఆసియా క్రీడల్లో ఇదే విభాగంలో సిజీ సదానందన్–జానీ రోమెల్ భారత్‌కు కాంస్యం అందించారు.

సెమీస్‌లో భారత మహిళల హాకీ జట్టు


వందన కటారియా

తమ లీగ్ దశను అజేయంగా ముగించిన భారత మహిళల హాకీ జట్టు ఆసియా క్రీడల్లో సెమీఫైనల్ చేరి పతకం రేసులో నిలిచింది. మంగళవారం జరిగిన పూల్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 13–0 గోల్స్ తేడాతో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. భారత్ తరఫున వందన కటారియా (2వ, 16వ, 48వ ని.లో), దీప్ గ్రేస్ ఎక్కా (11వ, 34వ, 42వ ని.లో), దీపిక (4వ, 54వ, 58వ ని.లో) మూడు చొప్పున గోల్స్ సాధించారు. సంగీత కుమారి (27వ, 55వ ని.లో) రెండు గోల్స్, మోనిక (7వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (58వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. లీగ్ దశ తర్వాత భారత్, దక్షిణ కొరియా జట్లు 10 పాయింట్లతో సమంగా నిలిచినా... మెరుగైన గోల్స్ అంతరం కారణంగా భారత్‌కు అగ్రస్థానం, కొరియాకు రెండో స్థానం దక్కాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనాతో భారత్; జపాన్‌తో కొరియా తలపడతాయి.

పసిడి 'పంచ్'కు లవ్లీనా

కాంస్యాలు గెలిచిన ప్రీతి, నరేందర్

ఆసియా క్రీడల బాక్సింగ్ ఈవెంట్‌లో మంగళవారం భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్... పురుషుల ప్లస్ 92 కేజీల విభాగంలో నరేందర్ సెమీఫైనల్ బౌట్‌లలో ఓడిపోయి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ప్రీతి 0–5తో చాంగ్ యువాన్ (చైనా) చేతిలో... నరేందర్ 0–5తో కున్‌కబయేవ్ (కజకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశారు. మహిళల 75 కేజీల విభాగంలో భారత బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ ఫైనల్లోకి దూసుకెళ్లి స్వర్ణ, రజత పతకం రేసులో నిలిచింది. అంతేకాకుండా పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో లవ్లీనా 5–0తో బైసన్ మనికోన్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. పురుషుల 57 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ సచిన్ సివాచ్ 1–4తో లియు పింగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.


లవ్లీనా

మన బాణం మెరిసింది

ఆర్చరీలో భారత్‌కు మూడు పతకాలు ఖరారు • ఫైనల్లో సురేఖ, అభిషేక్, ప్రవీణ్


జ్యోతి సురేఖ


అభిషేక్


ప్రవీణ్

ఆసియా క్రీడల ఆర్చరీలో భారత క్రీడాకారులు మూడు పతకాలను ఖరారు చేసుకున్నారు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ... పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కే చెందిన ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ ఫైనల్లోకి దూసుకెళ్లారు. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 149–146తో భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామిని ఓడించింది. సెమీస్‌లో ఓడిన అదితి కాంస్యం కోసం పోటీపడుతుంది. పురుషుల కాంపౌండ్ సెమీఫైనల్స్‌లో ప్రపంచ చాంపియన్ ఓజస్ ప్రవీణ్ 150–146తో యాంగ్ జేవన్ (దక్షిణ కొరియా)పై, అభిషేక్ వర్మ 147–145తో జేహూన్ జూ (దక్షిణ కొరియా)పై గెలిచి స్వర్ణ, రజత పతకాల కోసం తలపడనున్నారు. పురుషుల రికర్వ్ విభాగంలో భారత ఆర్చర్లు అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్ నిరాశపరిచారు. క్వార్టర్ ఫైనల్లో అతాను దాస్ 5–6తో జింగ్షువో కి (చైనా) చేతిలో, ధీరజ్ 5–6తో ఇల్ఫాత్ అబ్దులిన్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో భారత స్టార్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21–10, 21–15తో వి చి సు (చైనీస్ తైపీ)పై, శ్రీకాంత్ 21–16, 21–11తో లీ యున్ జియు (కొరియా)పై, ప్రణయ్ 21–9, 21–12తో బత్‌దవా ముంఖ్‌బత్ (మంగోలియా)పై గెలిచారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–14, 21–12తో నబీహా–ఫాతిమత్ (మాల్దీవులు) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.



స్క్వాష్ 'మిక్స్‌డ్'లో పతకం ఖాయం

స్క్వాష్ 'మిక్స్‌డ్ డబుల్స్' విభాగంలో దీపిక పల్లికల్–హరీందర్ పాల్ సింగ్ జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దాంతో ఈ ఈవెంట్‌లో భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. క్వార్టర్ ఫైనల్లో దీపిక–హరీందర్ 7–11, 11–5, 11–4 స్కోరుతో ఫిలిప్పీన్స్‌కు చెందిన అరిబాడో–ఆండ్రూ గారికాపై గెలిచారు.


మ్యాక్స్‌వెల్

ఆసీస్‌దే విజయం

రెండో 'వామప్'లోనూ ఓడిన పాకిస్తాన్

సాక్షి, హైదరాబాద్: వరల్డ్ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌లు ఆడాల్సిన వేదికపై పాకిస్తాన్ తమ రెండు 'వామప్' మ్యాచ్‌లనూ కోల్పోయింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో గత శుక్రవారం కివీస్ చేతిలో ఓడిన పాక్ మంగళవారం ఆసీస్ చేతిలోనూ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 14 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. అయితే ఫలితంతో సంబంధం లేకుండా ఇరు జట్లకూ మంచి బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించింది. తొలి 'వామప్' లాగే ఈసారీ భారీ స్కోర్లు నమోదయ్యాయి. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. మ్యాక్స్‌వెల్ (71 బంతుల్లో 77; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), కామెరాన్ గ్రీన్ (40 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), ఇన్‌గ్లిస్ (48), వార్నర్ (48), లబుషేన్ (40), మిచెల్ మార్ష్ (31) జట్టు భారీ స్కోరులో తలా ఓ చేయి వేశారు. అనంతరం పాకిస్తాన్ 47.4 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (59 బంతుల్లో 90 రిటైర్డ్ అవుట్; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇఫ్తికార్ అహ్మద్ (85 బంతుల్లో 83; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), మొహమ్మద్ నవాజ్ (42 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ ఇన్నింగ్స్ చాలా చాలా ముందుగా ముగిసేదే కానీ ఆసీస్ పార్ట్‌టైమ్ బౌలర్లకు కూడా 'వామప్' అవకాశం కల్పించింది. లబుషేన్, స్మిత్, వార్నర్ కలిపి 14.4 ఓవర్లు వేసి ఏకంగా 159 పరుగులిచ్చారు. పాక్ తమ తొలి మ్యాచ్‌ను హైదరాబాద్‌లోనే శుక్రవారం నెదర్లాండ్స్‌తో, ఆస్ట్రేలియా తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం భారత్‌తో చెన్నైలో ఆడుతుంది.

అఫ్గానిస్తాన్ ఘన విజయం

గువహటిలో జరిగిన మరో 'వామప్' మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. శ్రీలంక 46.2 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌట్ కాగా... వర్షంతో అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని 42 ఓవర్లలో 257 పరుగులుగా నిర్దేశించారు. అఫ్గాన్ 38.1 ఓవర్లలో 4 వికెట్లకు 261 పరుగులు చేసి విజయాన్నందుకుంది. దీంతో ప్రధాన పోరుకు ముందు అన్ని వామప్ మ్యాచ్‌లు ముగిశాయి.

'వామప్' లేకుండానే...

• భారత్ రెండో మ్యాచ్ కూడా వర్షంతో రద్దు
• ఒక్క బంతి కూడా ఆడేందుకు దక్కని అవకాశం



తిరువనంతపురం: శ్రీలంక గడ్డపై ఆసియా కప్ నుంచి భారత్‌ను వెంటాడుతున్న వర్షం స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ సమయంలోనూ వీడలేదు. ప్రధాన పోరుకు ముందు టీమిండియా రెండు వామప్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా... రెండూ వర్షంలో కొట్టుకుపోయాయి! గువహటిలో శనివారం ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి మ్యాచ్ రద్దు కాగా, ఇప్పుడు తిరువనంతపురంలో అదే పునరావృతమైంది. మంగళవారం భారత్, నెదర్లాండ్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా పూర్తిగా రద్దయింది. తిరువనంతపురంలో నిరంతరాయంగా కురిసిన వర్షంతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం మొత్తం నీటితో నిండిపోయింది. మధ్యలో కొద్దిసేపు వాన తెరిపినిచ్చినా... మైదానాన్ని చక్కదిద్ది మ్యాచ్‌ను నిర్వహించే పరిస్థితి లేకపోయింది. దాంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమ దిశ రాజ్‌కోట్‌లో ఆస్ట్రేలియాతో చివరి వన్డే ఆడిన తర్వాత టీమిండియా ఈశాన్య ప్రాంతమైన గువహటి చేరింది. ఆపై నైరుతి దిశన తిరువనంతపురానికి ప్రయాణించింది. దాదాపు 6 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసిన తర్వాత భారత్‌కు ఒక్క బంతి కూడా బౌలింగ్ కానీ బ్యాటింగ్ కానీ చేసే అవకాశం రాలేదు. వరల్డ్ కప్‌లో పాల్గొంటున్న పది జట్లలో ఒక్క భారత్‌కు మాత్రం ఇలాంటి స్థితి ఎదురైంది. ప్రపంచకప్‌లో తమ తొలి మ్యాచ్‌లో ఈ ఆదివారం జరిగే చెన్నైలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
4-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	316	65,512
నిఫ్టీ ▽	110	19,529

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,102	▽	206
డోజోన్స్	33,072	▽	361
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,470	▽	41
డాక్స్	15,085	▽	162
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	31,238	▽	522

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,675
బంగారం (22 క్యారెట్)	56,448
వెండి (కేజీ)	67,037

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	82.46	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	85.67	88.74
€	యూరో	ఎకటి	98.94	102.28
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	54.74	56.44
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	51.78	54.07
S$	సింగపూర్ డాలర్	ఎకటి	59.66	61.58
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్‌టీటీ	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్‌టీటీ	21.76	23.55
¥	చైనా యువాన్	ఫారెక్స్‌టీటీ	10.27	12.35

నేటి నుంచి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష

శుక్రవారం కీలక నిర్ణయాల వెల్లడి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడురోజుల కీలక ద్వైమాసిక సమావేశాలు నేటి నుంచి (4వ తేదీన) ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరుగుతాయి. అక్టోబర్ 6వ తేదీన (శుక్రవారం) ఈ భేటీ కీలక నిర్ణయాలను గవర్నర్ మీడియాకు వెల్లడిస్తారు. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు రెపోను ఆర్‌బీఐ ఈ సమావేశాల్లో కూడా యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ఇదే జరిగితే వరుసగా నాలుగు ద్వైమాసిక సమావేశాల నుంచి యథాతథ రేటును కొనసాగించినట్లు అవుతుంది. ధరల స్పీడ్‌ను కట్టడి చేసే విషయంలో రాజీ పడేదే లేదని ఆర్‌బీఐ గవర్నర్ ఉద్ఘాటిస్తున్న సంగతి తెలిసిందే. ఉక్రేయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్షసహా గడచిన మూడు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. జూలైలో నమోదయిన 15 నెలల గరిష్ట స్థాయి (7.44 శాతం) రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 6.83 శాతానికి తగ్గినప్పటికీ ఈ స్థాయి సైతం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న స్థాయికన్నా 83 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) అధికంగా ఉండడం గమనార్హం.

ఇక అన్ని హ్యుందాయ్ కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు

న్యూఢిల్లీ: ఇకపై తమ అన్ని కార్లలోనూ ఆరు ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరిగా ఉంటాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా తెలిపింది. ముందుగా 3 మోడల్స్‌తో దీన్ని ప్రారంభించనున్నామని, తర్వాత మిగతా మోడల్స్‌కూ వర్తింపచేస్తామని సంస్థ ఎండీ ఉన్సూ కిమ్ తెలిపారు. వాహన భద్రతా ప్రమాణాలపరమైన దేశీ క్రాష్ టెస్టులకు సంబంధించి ఇటీవల ప్రవేశపెట్టిన భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రామ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని కూడా నిర్ణయించుకున్నట్లు వివరించారు. టెస్టుల ఆధారంగా వాహనానికి 0–5 వరకు స్టార్ రేటింగ్స్ లభిస్తాయి. కొనుగోలుదారులు ఈ రేటింగ్ ప్రాతిపదికన వివిధ కార్లలో భద్రతా ప్రమాణాలను పోల్చి చూసుకుని తగు నిర్ణయం తీసుకోవచ్చు. తమ మధ్య స్థాయి సెడాన్ కారు వెర్నాకు గ్లోబల్ ఎన్‌క్యాప్ టెస్టులో 5 స్టార్ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.



భారత్ వృద్ధి 6.3 శాతం



- 2023–24పై ప్రపంచ బ్యాంక్ అంచనా
- సేవల రంగం దన్నుగా ఉంటుందని భరోసా..

న్యూఢిల్లీ: భారత్ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6.3 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటుందన్న తన అంచనాలను ప్రపంచ బ్యాంక్ పునరుద్ఘాటించింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితి నెలకొన్నప్పటికీ, భారత్ సేవల రంగం పటిష్టంగా ఉంటుందని ఇండియా డెవలప్‌మెంట్ తాజా అక్టోబర్ అవుట్‌లుక్‌లో స్పష్టం చేసింది. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సేవల రంగం మెజారిటీ వాటాను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. 2022–23 భారత్ వృద్ధి రేటు 7.2 శాతం. కాగా, దక్షిణాసియా వృద్ధి రేటు 5.8 శాతంగా ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. ఇతర వర్ధమాన మార్కెట్, అభివృద్ధి చెందుతున్న దేశాల ఎకానమీ (ఈఎండీఈ)ల వృద్ధి రేటు 2023–24లో 6.3 శాతం, 2024–25లో 6.4 శాతం నమోదుకావచ్చని అంచనా వేస్తోంది. ప్రపంచ బ్యాంక్ తాజా అంచనాల ప్రకారం...

- 2023–24లో వ్యవసాయ రంగం 3.5 శాతం పురోగమిస్తుంది. పరిశ్రమల రంగం 5.7 శాతం, సేవల రంగం 7.4 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటాయి.
- పెట్టుబడుల్లో వృద్ధి 8.9 శాతంగా ఉంటుంది.
- ప్రభుత్వ చర్యల వల్ల ద్రవ్యోల్బణం నెమ్మదిగా దిగివస్తుంది. ఆర్థిక సంవత్సరంలో సగటును రిటైల్ ద్రవ్యోల్బణం 5.9 శాతం ఉంటుందని అంచనా.
- ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు జీడీపీలో లక్ష్యాల మేరకు 6.4 శాతం నుంచి (2022–23లో జీడీపీతో పోల్చి) 5.9 శాతానికి దిగివస్తుంది.
- ప్రభుత్వ రుణ భారం జీడీపీలో 83 శాతం వద్ద స్థిరంగా ఉంటుంది. ప్రభుత్వ స్థూల రుణం జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.159.54 లక్షల కోట్లుగా నమోదయ్యింది. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోల్చితే (రూ.156.08 లక్షల కోట్లు) ఈ పరిమాణం 2.2 శాతం పెరిగింది. మొత్తం రుణాల్లో పబ్లిక్ డెట్ 89.5 శాతంగా ఉంది. భారత్ విదేశీ రుణ భారం జూన్ ముగిసే నాటికి 629.1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.52 లక్షల కోట్లు) చేరింది.
- దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ కరెన్సీ అకౌంట్‌కు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) జీడీపీలో దేశం భరించగలిగిన స్థాయిలోనే 1.4 శాతంగా ఉంటుంది.
- షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకుల రుణ నాణ్యత మెరుగుపడుతుంది. అధిక రుణ వృద్ధి, మొండిబకాయిలు తగ్గడం, చక్కటి రికవరీలు, మొండి బకాయిల రైటాఫ్స్ దీనికి కారణం. 2022 మార్చిలో 5.9 శాతంగా ఉన్న షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకుల స్థూల మొండిబకాయిల నిష్పత్తి, 2023 మార్చి నాటికి 3.9 శాతానికి తగ్గడం గమనార్హం.

కొన్ని సంస్థల అంచనా ఇలా.. (వృద్ధి శాతాల్లో)

సంస్థ	2023-24
ఆర్‌బీఐ	6.5
ఎస్‌అండ్‌పీ	6.0
ఫిచ్	6.3
మూడీస్	6.1
ఏడీబీ	6.3
ఇండియా రేటింగ్స్	6.2
ఓఈసీడీ	6.3

సెప్టెంబర్‌లో 'తయారీ' నిరాశ

- ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ 57.5కు డౌన్
- ఐదు నెలల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం సెప్టెంబర్‌లో నెమ్మదించింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఆగస్టులో 58.6 వద్ద ఉంటే, సెప్టెంబర్‌లో 57.5కు పడింది. అంతక్రితం ఐదు నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో ఇండెక్స్ నమోదు కావడం ఇదే తొలిసారి. అయితే సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఆ స్థాయి దిగువకు పడిపోతేనే దానిని క్షీణతగా పేర్కొంటారు. ఈ ప్రాతిపదికన సూచీ 27 నెలల నుంచి వృద్ధి బాటనే పయనిస్తోంది. తాజా సమీక్షా నెల సెప్టెంబర్‌లో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి నెమ్మదించినట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.

ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే...



- ఆసియా మార్కెట్ల బలహీనతలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం
- సెన్సెక్స్‌కు 316 పాయింట్ల నష్టం

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ఆసియా మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ మార్కెట్ మంగళవారం అరశాతం పతనమైంది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒకశాతానికి పైగా క్షీణించి సూచీలను నష్టాల వైపు నడిపించాయి. సెన్సెక్స్ 316 పాయింట్లు క్షీణించి 65,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయి 19,529 వద్ద నిలిచింది. 3 రోజుల వరుస సెలవుల తర్వాత స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 484 పాయింట్లు పతనమై 65,345 వద్ద, నిఫ్టీ 158 పాయింట్లు క్షీణించి 19,480 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ప్రైవేట్ బ్యాంకింగ్, ఆటో, ఐటీ స్టాకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, మీడియా, రియల్టీ, కన్స్యూమర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,034 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,361 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్‌బీఐ పాలసీ, కార్పొరేట్ క్యూ2 ఫలితాల ప్రకటనకు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకు షేర్లకు భారీ డిమాండ్ లభించింది. యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, మహారాష్ట్ర బ్యాంక్, పీఎస్‌బీ, పీఎస్‌బీ, ఐఓబీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 5–3% ర్యాలీ చేశాయి. యుకో బ్యాంక్, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2% లాభపడ్డాయి. ఎస్‌బీఐ బ్యాంక్ షేరు ఒక శాతం పెరిగింది. ఎన్‌ఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిథ్యం వహించే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు ఇండెక్స్ రెండున్నర శాతం ర్యాలీ చేసింది
- కేంద్ర పెట్రోలియం శాఖ దేశీయ సహజ వాయువు ధరలు 7% పెంచడంతో ఓఎన్‌జీసీ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల అనూహ్య రికవరీ సైతం ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా ఈ షేరు బీఎస్‌ఈలో 4% నష్టపోయి రూ.185 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.50% క్షీణించి రూ.184 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఇండెక్సుల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- ఐషర్ మోటార్స్ షేరు 3% నష్టపోయి రూ.3351 వద్ద స్థిరపడింది. మోటార్ సైకిళ్ల అమ్మకాలు సెప్టెంబర్లో తగ్గిపోవడం షేరు పతనానికి కారణమైంది.

హిట్... ఫ్లాట్

నష్టాల మార్కెట్లోనూ జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిస్టింగ్ బంపర్ హిట్ కొట్టింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.119)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.143 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ ఆద్యంతం కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా షేరు 32.18% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.157 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.33,033 కోట్లుగా స్థిరపడింది. ఎక్సే్ఛంజీలో మొత్తం 57.99 లక్షల ఈక్విటీ షేర్లను చేతులు మారాయి.

- మనోజ్ వైభవ్ జెమ్స్ ఎన్ జ్యువెలర్స్ షేరు ఫ్లాటుగా లిస్టయింది. ఇష్యూ ధర (రూ.215)తో పోలిస్తే బీఎస్‌ఈలో లాభ, నష్టాలు లేకుండా రూ.215 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.210–222 మధ్య ట్రేడైంది. చివరికి 0.30% స్వల్ప లాభంతో రూ.216 వద్ద క్లోజైంది. మార్కెట్ విలువ రూ.1,053 కోట్లుగా నమోదైంది.

వీ గార్డ్ నుంచి ప్రీమియం బీఎల్‌డీసీ ఫ్యాన్లు



ముంబై: ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ సంస్థ వీ–గార్డ్ 'ఇన్‌సైట్ –జీ' పేరుతో ప్రీమియం బీఎల్‌డీసీ ఫ్యాన్లు ఆవిష్కరించింది. వీటిలో ఆర్‌ఎంపీ 370 హై స్పీడ్ మోటార్ ఉంది. 5 స్టార్ రేటింగ్‌తో ఐదేళ్ల వారెంటీ కలిగి ఉన్నాయి. కనీసం 35 వాట్ల కంటే తక్కువ విద్యుత్‌ను వినియోగించుకుంటూ వార్షికంగా రూ.1518 ఆదా చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. డస్ట్ రిప్లెంట్ కోటింగ్, రివర్స్ మోడ్ ఆపరేషన్, వినియోగానికి అనుకూలమైన రిమోట్ కంట్రోల్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. బూస్ట్ మోడ్, బ్రీజ్ మోడ్, స్లీప్ మోడ్, స్టాండర్ మోడ్, కస్టమ్ మోడ్‌తో సహా పలు ఆపరేషన్ మోడ్‌లను కూడా అందిస్తుంది. భారతీయ గృహాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఫ్యాన్లు తయారు చేశామని కంపెనీ ఎండీ రామచంద్రన్ తెలిపారు.

భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ తెలివికి పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. –ఆల్ ది బెస్ట్..

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో 70 పారా మెడికల్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో పారామెడికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోసుల వివరాలు:** ఈసీజీ టెక్నీషియన్–08, జూనియర్ రేడియోగ్రాఫర్–27, జూనియర్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్–13, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్–01, ఓటీ అసిస్టెంట్–15, ఫార్మసిస్ట్(ఆయుర్వేద)–01, రేడియోగ్రాఫర్–02, సోషల్ గైడ్/సోషల్ వర్కర్–03.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో 10+2, డిప్లొమా, సర్టిఫికేట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్/డేటా ఎంట్రీ టెస్ట్(పోస్టుకు అవసరమైతే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** టెక్నికల్/ప్రొఫెషనల్ నాలెడ్జ్(50 ప్రశ్నలు–100 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు–10 మార్కులు), జనరల్ ఇంటెలిజెన్స్(20 ప్రశ్నలు–20 మార్కులు), అర్థమెటిక్ ఎబిలిటీ(20 ప్రశ్నలు–20 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 100 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.10.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.10.2023
» **వెబ్‌సైట్:** esic.gov.in

నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో 43 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ).. కాంట్రాక్టు/రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్/డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 43
» **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్(స్కేల్ 7)–01, డిప్యూటీ జనరల్ మేనేజర్(స్కేల్4)–01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(స్కేల్ 5)–01, డిప్యూటీ మేనేజర్(స్కేల్ 2)–04, అసిస్టెంట్ మేనేజర్(స్కేల్ 1)–17, కాంట్రాక్టు పోస్టులు(చీఫ్ ఎకనామిస్ట్/ఎస్‌పీడీ/ఎస్‌పీఎఫ్‌వో/పీఎఫ్‌వో)–19.
» **అర్హత:** పోస్టును అనుసరించి సీఏ, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**18.10.2023
» **వెబ్‌సైట్:** https://nhb.org.in

విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో 40 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ.. వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 40
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–16, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు–24.
» **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా 2020/2021/2022 సంవత్సరాలలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు నెలకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు నెలకు రూ.8000. **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
» **ఎంపిక విధానం:** గ్రాడ్యుయేట్/డిప్లొమా మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.10.2023
» **వెబ్‌సైట్:** https://vizagport.com

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **విభాగాలు:** టెస్టింగ్/మెయింటెనెన్స్/రిపేర్ ఆఫ్ కంట్రోల్–ఇన్‌స్ట్రుమెంటేషన్ సిస్టమ్స్/ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ సిస్టమ్స్ తదితరాలు.
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 నుంచి రూ.31,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** సుభద్ర హోటల్, కైగా రోడ్.కుర్నిపేటి, కైగా, మల్లాపూర్, ఉత్తర కన్నడ (జిల్లా), కర్ణాటక–581400.
» **ఇంటర్వ్యూ తేది:** 05.10.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9.30 నుంచి 11.30 వరకు.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

అవుతారా.. సర్కారీ టీచర్

» టీఎస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయ పోస్టుల దరఖాస్తు ప్రక్రియ
» ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు.. 11 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) ప్రకటన విడుదల చేసింది. మొత్తం 5,089 టీచర్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో నియామకాలు నిర్వహిస్తుంది. టీఆర్‌టీ సిలబస్‌లో స్వల్పమార్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో.. టీఆర్‌టీ నోటిఫికేషన్ వివరాలు, పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ తదితర వివరాలు..

- **మొత్తం పోస్టులు:** 5089 (ఎస్‌జీటీ–2,575, స్కూల్ అసిస్టెంట్–1739, లాంగ్వేజ్ పండిట్–611, పీఈటీ–164)

అర్హతలు

- పోస్టులను అనుసరించి ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అయిదేళ్ల వయోసడలింపు లభిస్తుంది. దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ పరీక్షలు

టీఆర్‌టీ పరీక్షలను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్–సీబీటీ) విధానంలో మొత్తం 11 రోజులపాటు (నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు) నిర్వహిస్తారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) పోస్టులకు ఆరు రోజులపాటు పరీక్షలు ఉంటాయి. అలాగే ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠాలు చెప్పేందుకు అవసరమైన స్కూలు అసిస్టెంట్ (ఎస్ఏ) కొలువులకు మూడు రోజుల పాటు పరీక్షలు జరుపుతారు. పీఈటీలు, భాషా పండితులకు ఒక్కో రోజు చొప్పున పరీక్షను నిర్వహిస్తారు. రోజుకు రెండు విడతల చొప్పున ఈ పరీక్షలుంటాయి. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు; అలాగే రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు.

పరీక్ష విధానం

స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, భాషా పండితులకు నిర్వహించే పరీక్ష 160 ప్రశ్నలకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు అర మార్కు చొప్పున 80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. దీంతోపాటు టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. అంటే.. మొత్తం 100 మార్కులకు పరిగణలోకి తీసుకుని తుది ర్యాంకు కేటాయిస్తారు. ఇక పీఈటీ, పీఈడీలకు టెట్ అవసరం లేదు. కాబట్టి వారికి 100 మార్కులకు టీఆర్‌టీ నిర్వహిస్తారు.

ఎస్‌జీటీ

ఈ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20 ప్రశ్నలు–10 మార్కులు, లాంగ్వేజ్–1(ఇండియన్ లాంగ్వేజెస్) 18 ప్రశ్నలు–9 మార్కులు, లాంగ్వేజ్–2(ఇంగ్లిష్) 18 ప్రశ్నలు–9 మార్కులు, మ్యాథమేటిక్స్ 18 ప్రశ్నలు–9 మార్కులు, సైన్స్ 18 ప్రశ్నలు–9 మార్కులు, సోషల్ స్టడీస్18 ప్రశ్నలు–9 మార్కులు, టీచింగ్ మెథడాలజీ(స్ట్రాటజీ పేపర్స్) 30 ప్రశ్నలు–15 మార్కులుంటాయి.

స్కూల్ అసిస్టెంట్

ఈ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. అవి..జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు–10 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20ప్రశ్నలు–10 మార్కులు, సంబంధిత సబ్జెక్టు 88 ప్రశ్నలు–44 మార్కులు, టీచింగ్ మెథడాలజీ 32 ప్రశ్నలు–16 మార్కులకు పరీక్ష ఉంటుంది.

మారిన సిలబస్

ఎస్‌జీటీ పోస్టులకు పరీక్ష రాసే వారికి 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు; స్కూల్ అసిస్టెంట్ పరీక్ష రాసేవారికి 1వ తరగతి నుంచి 10వ తరగతితోపాటు ప్లస్ టూ నుంచి ప్రశ్నలు ఇస్తామని విద్యాశాఖ పేర్కొంది. ఎస్‌జీటీలకు ఇచ్చే ప్రశ్నలు నిర్ణీత తరగతులను దాటి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ప్రశ్నకు అర మార్కు కేటాయిస్తారు. కాబట్టి ప్రతి ప్రశ్నను కీలకంగానే భావించాలి.

పరీక్ష కేంద్రాలు

మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 21.10. 2023
- **పరీక్ష తేదీలు:** 2023నవంబర్ 20నుంచి 30వరకు
- **వెబ్‌సైట్ :** www.schooledu.telangana.gov.in

కోల్ ఇండియాలో.. మేనేజ్‌మెంట్ ట్రెయినీ

560 ఉద్యోగాలకు ప్రకటన విడుదల



భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖకు చెందిన మహారత్న సంస్థ.. కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్). కోల్‌కతా ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ సంస్థ 560 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. సంబంధిత పోస్టులను అనుసరించి డిగ్రీ, ఎమ్మెస్సీ, ఎంఈ, ఎంటెక్ అభ్యర్థులు ఈ పోస్టులకు పోటీ పడవచ్చు. గేట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 560 (మైనింగ్ ఇంజనీరింగ్–351, సివిల్ ఇంజనీరింగ్–172, జియాలజీ–37)

అర్హతలు

- **మైనింగ్ ఇంజనీరింగ్:** కనీసం 60 శాతం మార్కులతో మైనింగ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి.
- **సివిల్ ఇంజనీరింగ్:** కనీసం 60 శాతం మార్కులతో సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **జియాలజీ:** జియాలజీలో ఎమ్మెస్సీ/ఎంటెక్ పూర్తి చేసి ఉండాలి. లేదా అప్లయిడ్ జియాలజీ/జియోఫిజిక్స్ లేదా 60 శాతం మార్కులతో అప్లయిడ్ జియోఫిజిక్స్ విద్యార్హత ఉండాలి.
- **వయసు:** 31.08.2023 నాటికి 18–30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కోల్ ఇండియా నిబంధనల ప్రకారం–వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

ఎంపికైన అభ్యర్థులు ఇ–2 గ్రేడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి ఇ–2 గ్రేడ్‌కు అందించే పే స్కేల్ ప్రకారం -రూ.50,000–1,60,000 వేతనంగా చెల్లిస్తారు.

ఎంపిక ప్రక్రియ

గేట్–2023 స్కోర్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోస్టింగ్

ఎంపికైన అభ్యర్థులు దేశంలోని కోల్‌ఫీల్డ్ ప్రాంతాల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలి. మేనేజ్‌మెంట్ నిర్ణయం ప్రకారం–ఖాళీల లభ్యతను బట్టి మూడు పోస్టింగ్ చాయిస్ ఆప్షన్ కూడా ఇస్తారు. అభ్యర్థులు ఈ మూడింటిలో తమ ఎంపికను తెలియజేయాల్సి ఉంటుంది.

సర్వీస్ బాండ్

ఎంపికైన అభ్యర్థులు 60 నెలల పాటు సంస్థలోనే పనిచేస్తామనే హామీతో సర్వీస్ అగ్రిమెంట్ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. రూ.3లక్షల విలువైన ఈ బాండ్ జాయినింగ్ సమయం నుంచి అమలులోకి వస్తుంది. ఇందుకోసం అభ్యర్థుల వేతనం నుంచి ప్రతి నెల రూ.5000 తీసుకుంటారు. 60 నెలల సమయం పూర్తైన తర్వాత వడ్డీ లేకుండా సంబంధిత మొత్తాన్ని చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 12.10.2023
- **వెబ్‌సైట్:** https://www.coalindia.in

క్లుప్తంగా...

‘ఉమెన్ ఇన్ కెమిస్ట్రీ’గా ఉమామహేశ్వరి



తిరుపతి తుడా: శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ, స్విమ్స్ యూనివర్సిటీ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమినేని ఉమామహేశ్వరి ఉమెన్ ఇన్ కెమిస్ట్రీగా ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, న్యూఢిల్లీ, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ద్వారా ఏర్పాటు చేసిన జ్యూరీ కెమిస్ట్రీ విభాగంలో అగ్రశ్రేణి 75 మంది భారతీయ మహిళల్లో ఒకరిగా అమినేని ఉమామహేశ్వరిని ఎంపిక చేశారు. ఆమె విజయాలను ‘షీ ఈజ్ సిరీస్ షీ ఈజ్ 75 ఉమెన్ ఇన్ కెమిస్ట్రీ’ పుస్తకంలోని నాల్గవ ఎడిషన్లో చేర్చనున్నారు. భారతదేశ 75 ఏళ్ల స్వాతంత్రోత్సవాన్ని పురస్కరించుకొని స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్–మ్యాథమెటిక్స్)లో మహిళా నాయకత్వం, సుస్థిర అభివృద్ధిలో 75 మంది మహిళల విజయపథ ఘట్టాలను ఈ పుస్తకంలో పొందుపరుస్తారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు, బ్రిటిష్ హైకమిషన్ ఆఫ్ ఇండియా మద్దతుతో కూడిన ఈ పుస్తకం లిఖిత పూర్వకంగా విడుదల చేయనున్నారు. కాగా, ఉమెన్ ఇన్ కెమిస్ట్రీగా ఎంపికైన ఉమామహేశ్వరిని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు.

గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా దొరబాబుకు మరో చాన్స్



సాక్షి, అమరావతి: ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా మరోసారి దవులూరి దొరబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తున్న కార్పొరేషన్‌కు చైర్మన్‌గా మరోమారు తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని దొరబాబు ఈ సందర్భంగా తెలిపారు.

రేవంత్‌రెడ్డి పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఓటుకు కోట్లు కేసు ..



సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటుకు కోట్లు కేసు ఏసీబీ పరిధిలోకి రాదని, ఈ వ్యవహారంలో ఐదుగురు సాక్షుల్ని ఒకేసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం విచారించింది. ఈ అంశంలో హైకోర్టు నిర్ణయం తీసుకోవాలని గతంలోనే ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో ఈ పిటిషన్ విచారణ అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కేసు ముగిస్తున్నట్టు పేర్కొంది. అయితే ఈ కేసు నుంచి తనను తప్పించాలంటూ సండ్ర వేంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను డిసెంబర్ 4తో ప్రారంభమయ్యే వారంలో విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

పుంగనూరు అల్లర్ల కేసులో జోక్యం చేసుకోం

సాక్షి, న్యూఢిల్లీ : చిత్తూరు జిల్లా పుంగనూరు అల్లర్ల కేసులో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు చెప్పింది. టీడీపీ నేతలు దేవినేని ఉమా మహేశ్వరరావు, పులివర్తి నాని, నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, చల్లా బాబులకు హైకోర్టు ముందస్తు బెయిలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం మంగళవారం విచారించింది. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు కదా అని జస్టిస్ త్రివేది ప్రశ్నించగా.. ఘటనలో కొందరు గాయపడ్డారని, వారిలో పోలీసులూ ఉన్నారని, రెండో ఫిర్యాదుదారు కానిస్టేబుల్ అని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈ దశలో జోక్యం చేసుకోబోమంటూ జస్టిస్ అనిరుద్ధ బోస్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు తెలిపారు.

3 రాజధానుల కేసుతోనే శివరామకృష్ణన్ కమిటీ కేసు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన అనంతరం ఏపీ రాజధాని ఏర్పాటుపై కేంద్రం నియమించిన శివరామకృష్ణ కమిటీ సూచనలు అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు 3 రాజధానుల కేసుతో జత చేసింది. గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు మస్తాన్ వలీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందుకువచ్చింది. ఈ పిటిషన్‌ను 3 రాజధానులపై దాఖలైన ప్రధాన పిటిషన్‌కు జత చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరపున న్యాయవాది శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు.

సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం నంబర్లు


రీ సర్వేతో పూర్తిగా మారనున్న భూమి రికార్డుల స్వరూపం


- ఇప్పటికే సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్లు కేటాయింపు
- ఈ నంబర్లతోనే ఆ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు
- త్వరలో మరో 2 వేల గ్రామాలకు ఎల్‌పీఎం నంబర్లు
- ప్రతి భూకమతానికి ఎల్‌పీఎం నంబరు, ఐడీ నంబరు, జియో కోఆర్డినేట్స్



సాక్షి, అమరావతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో రాష్ట్రంలోని భూమి రికార్డుల స్వరూపం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్లు కనుమరుగై, వాటి స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నంబర్లు రానున్నాయి. ఇప్పటికే సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్లతోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. భూముల రిజిస్ట్రేషన్లు కూడా కొత్త నంబర్లతోనే జరగనున్నాయి.

బ్రిటిష్ కాలంలో భూములను సర్వే చేసి ఇచ్చిన నంబర్లే ఇప్పటికీ రికార్డుల్లో ఉన్నాయి. ఒక సర్వే నంబరులో 2 నుంచి 10 అంతకంటె ఎక్కువ మంది భూయజమానులు ఉన్నారు. ఒక సర్వే నంబరులో 30 ఎకరాల భూమి ఉంటే అందులో 10, 15 మంది పేర్లు కూడా ఉన్నాయి. దీనివల్ల లెక్కలేనన్ని భూ సమస్యలు, వివాదాలు ఏర్పడ్డాయి. భూముల రీ సర్వే ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపింది. ప్రతి భూ కమతానికి ఎల్‌పీఎం నంబరు, ప్రతి యజమానికి ఆధార్ తరహాలో ఒక ఐడీ నంబరు ఇస్తోంది.





మారనున్న 1.96 కోట్ల సర్వే నంబర్లు

రాష్ట్రంలో 17,460 రెవెన్యూ గ్రామాలు, వాటి పరిధిలో 90 లక్షల మంది పట్టాదారులు (భూ యజమానులు) ఉన్నారు. ఈ పట్టాదారులకు చెందిన 2.26 కోట్ల ఎకరాల భూమి 1.96 కోట్ల సర్వే నంబర్లుగా రికార్డుల్లో విభజించి ఉంది. రీ సర్వేలో ఈ మొత్తం విస్తీర్ణాన్ని డ్రోన్, ఏరియల్ సర్వే, అవి చేయలేని చోట డీజీపీఎస్ సర్వే ద్వారా కొలుస్తున్నారు. కొలిచిన తర్వాత ప్రతి ల్యాండ్ పార్సిల్‌కు ఎల్‌పీఎం నంబరు, ఆధార్ మాదిరిగానే భూదార్ పేరుతో విశిష్ట గుర్తింపు సంఖ్య, జియో కోఆర్డినేట్స్‌ను ప్రభుత్వం కేటాయిస్తోంది. సర్వే అనంతరం ప్రతి రైతుకి ప్రభుత్వం ఇచ్చే భూ హక్కుపత్రంలో ఆ వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందులోనే యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్, యజమాని ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ రైతుకు సంబంధించిన భూమి కొలతలు, భూ విస్తీర్ణం వంటి వివరాలన్నీ కనపడతాయి. ఈ ఎల్‌పీఎం నంబర్ల ప్రకారమే క్రయ విక్రయ రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్లు జరుగుతాయి. దీనివల్ల మోసపూరిత రిజిస్ట్రేషన్లకు, రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు.

రీ సర్వే ద్వారా కొత్తగా తయారు చేస్తున్న డిజిటల్ రెవెన్యూ రికార్డుల్లో ఇకపై ఎల్‌పీఎం నంబర్లే ఉంటాయి. సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లోని రెవెన్యూ రికార్డులన్నీ ఇప్పటికే ఎల్‌పీఎం నంబర్లతో అప్‌డేట్ చేశారు. ఆ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు వీటి ద్వారానే నిర్వహిస్తున్నారు.

వెబ్‌ల్యాండ్-2లో ఎల్‌పీఎం నంబర్లు

రెవెన్యూ శాఖ రీ సర్వే పూర్తయిన గ్రామాల వివరాలతో ఇప్పటికే వెబ్‌ల్యాండ్-2 ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆ రికార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానించారు. సర్వే పూర్తయ్యే గ్రామాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఆ గ్రామాల్లో ఎల్‌పీఎం ఆధారిత రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. త్వరలో మరో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తవుతోంది. ఆ గ్రామాలను కూడా వెబ్‌ల్యాండ్-2కి మార్చనున్నారు. ఇలా విడతల వారీగా రాష్ట్రమంతా వెబ్‌ల్యాండ్-2కి మారిపోతుంది. భవిష్యత్తులో ఎల్‌పీఎం నంబర్ల ద్వారానే భూముల్ని గుర్తిస్తారు.

‘ప్రగతి రథం’పై ‘పిచ్చి’ కథ

ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బ తీసేలా అవాస్తవాలతో రామోజీ కథనం

52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు అండగా సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలు చూసి ఆవేదన చెందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని పాదయాత్ర సందర్భంగా చెప్పారు. ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే చెప్పిన మాట ప్రకారం 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కలను నిజం చేస్తూ ప్రభుత్వంలో విలీనం చేశారు. దీని ద్వారా ఆర్టీసీ ఉద్యోగులు అనేక ప్రయోజనాలు పొందుతున్నారు. ప్రజల నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. స్వప్రయోజనాలే పరమావధిగా పనిచేసే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సాధ్యం కాదని చెప్పడమే కాదు.. ఆ సంస్థను అడగడుగునా నీరుగార్చే ప్రయత్నం చేశారు. ఇవి వాస్తవాలు.

కానీ, రామోజీరావుకు చంద్రబాబు ప్రయోజనాల పరిరక్షణ ఓ ‘పిచ్చి.’ చంద్రబాబు తప్ప ప్రజలు, ఉద్యోగులు సంతోషంగా ఉంటే సహించలేరు. అందుకే వాస్తవాలను విస్మరించి ఆర్టీసీ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఓ విష కథనాన్ని ఈనాడులో ప్రచురించారు. అవాస్తవాలు, అభూతకల్పనలతో కథనాన్ని అల్లారు. విలీన ప్రక్రియ సందర్భంగా వివిధ దశల్లో ఉన్న అంశాలను వక్రీకరిస్తూ ఉద్యోగులను తప్పుదారి పట్టించేందుకు కుట్రలు పన్నారు. కానీ వాస్తవాలు ఆర్టీసీ ఉద్యోగులకు తెలుసు. వారి సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనబరుస్తున్న నిబద్ధత తెలుసు. ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం నుంచి ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన కార్యాచరణ చేపట్టింది. ఆర్టీసీ ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలను ఓసారి పరిశీలిద్దాం..

కార్పొరేట్ శాలరీ (ప్రమాద బీమా) ప్యాకేజీ

ఆర్టీసీ ఉద్యోగులకు కార్పొరేట్ శాలరీ (ప్రమాద బీమా) ప్యాకేజీని మొదట రూ.45 లక్షలకు అనంతరం ఏకంగా రూ.1.10 కోట్లకు ప్రభుత్వం పెంచడం విశేషం. అందుకోసం ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకుంది. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచింది.

కోవిడ్‌లో అండగా

కోవిడ్ మహమ్మారి సృష్టించిన సంక్షోభ సమయంలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలిచింది. కోవిడ్ సమయంలో నెలల తరబడి బస్సులు నడవలేదు. అప్పటికే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు జీతాల కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి రాలేదు. అదే ప్రభుత్వంలో విలీనం చేయకపోయి ఉంటే జీతాలే కాదు.. ఉద్యోగాలు కూడా కోల్పోవాల్సి వచ్చేదని ఆర్టీసీ ఉద్యోగులే అంగీకరించే వాస్తవం. కోవిడ్‌తో మరణించిన 1,016 మంది ఉద్యోగుల వారసులకు ప్రభుత్వం కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కూడా ఇచ్చింది.

జీతాలతోపాటు అలవెన్స్‌లు

డ్యూటీ సంబంధిత అలవెన్స్‌లను ఆర్టీసీ గతంలో జీతంతో కలిపి ఇచ్చేది. కానీ ప్రభుత్వ శాఖల్లో ఆ విధానం అమలులో లేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ, ఆ సంస్థ ఉద్యోగులకు మాత్రం జీతంతోపాటే అలవెన్స్‌లను కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం విశేషం. ఆ ఫైల్ ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద ఉంది. త్వరలోనే ఉత్తర్వులు వెలువడతాయని ప్రభుత్వం చెప్పింది.


ఆర్టీసీ ఉద్యోగులకు సర్కారు దగా

సమగ్రంగా సర్వీసు నిబంధనలు

ఆర్టీసీ ఉద్యోగుల సర్వీసు నిబంధనలపైనా ఈనాడు వక్రభాష్యం చెప్పింది. గతంలో ఆర్టీసీ రెగ్యులేషన్ నిబంధనలు అమలులో ఉండేవి. ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత ఆర్టీసీ ఉద్యోగుల సర్వీసు నిబంధనలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కసరత్తు చేసింది. ఉద్యోగుల ప్రవర్తన, క్రమశిక్షణ నిబంధనలకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఆచరణలోకి తెచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ ప్రక్రియ తుది దశలో ఉంది. త్వరలోనే సర్వీసు నిబంధనలను ఖరారు చేయనున్నారు. ఆ నిబంధనలు విడుదలైన తరువాత ఆ ప్రకారం ప్రస్తుతం పెండింగులో ఉన్న అప్పీళ్లు అన్నీ పరిష్కరిస్తారు.

మెరుగైన పింఛన్ విధానం

ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ–2022 ను ఆర్టీసీ ఉద్యోగులకు కూడా సీఎం వైఎస్ జగన్ వర్తింపజేశారు. అదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు పీఎఫ్ సంస్థ ద్వారా అమలయ్యే పింఛన్‌ను కొనసాగించాలని నిర్ణయించారు. ఎందుకంటే అప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న సీపీఎస్ పింఛన్ విధానంలో కూడా మార్పులు చేసేందుకు ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. జీపీఎస్‌ను అమలులోకి తేవడానికి సర్వం సిద్ధమైంది. జీపీఎస్ అమలుపై తుది ఆదేశాలు వచ్చిన తరువాత ఆర్టీసీ ఉద్యోగుల పింఛన్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

మెరుగైన రీతిలో ఈహెచ్‌ఎస్

ప్రభుత్వ ఉద్యోగుల వైద్య సదుపాయం కోసం ఈహెచ్‌ఎస్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆర్టీసీ ఉద్యోగుల పనివేళలు, ఉండే ప్రదేశాలు కాస్త భిన్నంగా ఉంటాయి. అందుకే ఆర్టీసీ ఉద్యోగులకు అమలు చేసే ఈహెచ్‌ఎస్ విధానంలో తగిన మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయి.

పథకాలు

ఆర్టీసీ ఉద్యోగులకు గతంలో వర్తించిన ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ పథకాలను నిపుణుల కమిటీ రద్దు చేసింది. ఎందుకంటే ఆ పథకాలకు సరిసమానమైన పథకం ఏపీజీఎల్ఐ ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతోంది. వాటినే ఆర్టీసీ ఉద్యోగులకూ వర్తింపజేసింది. అందువల్ల 2026 ఏప్రిల్ వరకు ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకు ‘ఎస్ఆర్ఎంబీ’ లో జమ అయిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించారు. 2030 ఏప్రిల్ వరకు ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకు ‘ఎస్‌బీటీ’లో జమ అయ్యే మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించారు. మిగతా ఉద్యోగులకు కూడా చెల్లించాల్సిన మొత్తాన్ని వడ్డీతో సహా వారి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరిన వేళ

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది దీర్ఘకాలిక డిమాండ్. దశాబ్దాలు గడిచిపోతున్నా ఆ డిమాండ్ కలగానే మిగిలిపోతుందా అని ఆర్టీసీ ఉద్యోగులు నిర్వేదంలో కూరుకుపోయిన వేళ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విధాన నిర్ణయం వారి జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడుతూ వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. ప్రజా రవాణా విభాగంగా మార్చారు. అంతకు ముందు సీఎంగా ఉన్న చంద్రబాబు ఆర్టీసీ విలీనం సాధ్యం కాదని నిర్ద్వందంగా తిరస్కరించిన అంశాన్ని వైఎస్ జగన్ సుసాధ్యం చేసి చూపించారు. ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచే నెలనెలా జీతాలు అందుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల జీతాల కోసం ప్రతి నెలా రూ.275 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ఆ విధంగా ఇప్పటివరకు రూ.10,336 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది. దాంతో ఆర్టీసీపై ఆర్థిక భారం తగ్గి, దీర్ఘకాలికంగా ఉన్న అప్పులను తీరుస్తూ ఆ సంస్థ లాభాల బాటలో ప్రయాణిస్తోంది. సీసీఎస్ వంటి సంస్థల నుంచి తీసుకున్న రూ.2,415 కోట్ల అప్పులు తీర్చింది. ఆర్టీసీ ఉద్యోగులకు రూ.307 కోట్ల ఎరియర్స్‌ను కూడా చెల్లించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే సంస్థను మూసుకోవాల్సిందే అని హేళన చేసిన తెలంగాణ సీఎం కేసీఆర్.. నాలుగేళ్ల తరువాత తన మాటను వెనక్కి తీసుకున్నారు. ఏపీ సీఎం జగన్ బాటను అనుసరించి తెలంగాణ ఆర్టీసీని కూడా ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పారు. అదీ సీఎం వైఎస్ జగన్ దార్శనికత. ఇతర రాష్ట్రాలకు ఆదర్శం అంటే ఇదే అని వేల మంది ఆర్టీసీ ఉద్యోగులతో పాటు యావత్ రాష్ట్ర ప్రజలు గర్వంగా తమ ముఖ్యమంత్రి గురించి చెప్పుకునేలా చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఉద్యోగుల ప్రయోజనాలే కాదు ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలోనూ ఆర్టీసీది అగ్రస్థానం. కొత్త విద్యుత్ బస్సులు కొనడంతోపాటు డీజిల్ బస్సులను విద్యుత్ బస్సులుగా మారుస్తోంది. 1,500 కొత్త డీజిల్ బస్సుల కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టింది. 2023–24లో కొత్తగా వేయి విద్యుత్ బస్సులు కొనాలని నిర్ణయించింది. దేశంలో వివిధ పుణ్య క్షేత్రాల సందర్శన, పుష్కరాల కోసం కొత్త బస్సులు నడుపుతోంది. రెండు వైపులా టికెట్లు తీసుకునే ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తోంది. ఇలా ప్రయాణికులకు అనేక మెరుగైన సేవలతో వారి మన్ననలు పొందుతోంది.

యూరప్‌లో వైభవంగా మలయప్ప స్వామి కల్యాణం

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో యూరప్, యూకేలో మలయప్ప స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15వ తేదీ వరకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఫ్రాంక్‌ఫర్ట్, ఉట్రేచ్ట్–నెదర్లాండ్స్‌లో టీటీడీ అర్చకులు, వేద పండితులు వైఖానస ఆగమం ప్రకారం కల్యాణ క్రతువు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఎన్ఆర్ఐలు హాజరై భక్తి పారవశ్యంతో పులకించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రపంచ వ్యాప్తంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి సమన్వయంతో ప్రపంచంలోని తెలుగు, భారతీయ, ధార్మిక సంస్థల సహకారంతో శ్రీవారి కల్యాణాలు కనుల విందుగా సాగుతున్నాయన్నారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులందరికీ లడ్డూ ప్రసాదం పంపిణీ చేస్తున్నామన్నారు. యూరప్‌లో స్వామి వారి కల్యాణానికి శివరామ్ తడిగొట్ల, ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ కార్తీక్ యార్లగడ్డ, జి.వెంకట కృష్ణ, సూర్య ప్రకాష్ తదితరులు ఏర్పాట్లు చేశారని వివరించారు.




మలయప్ప స్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

‘దిశ’.. పెళ్లికి ఒప్పించింది..

- ప్రేమించి మొహం చాటేసిన ప్రియుడు
- పోలీసుల కౌన్సెలింగ్‌తో దిగొచ్చిన వైనం

ఒంగోలు టౌన్: ప్రేమించాడు...పెళ్లి చేసుకుంటానన్నాడు. కలిసి తిరిగాడు... తీరా పెళ్లి మాట ఎత్తేసరికి మావాళ్లు అంగీకరించడం లేదని తప్పుకున్నాడు. మోసపోయానని గ్రహించిన ఆ యువతి కన్నీళ్లు పెట్టుకుంటూ కూర్చోలేదు. వెంటనే దిశ ఎస్ఓఎస్‌కు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు సదరు ప్రేమికుడికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో దిగొచ్చిన అతడి కుటుంబం పెళ్లికి అంగీకరించింది. ఒంగోలు ప్రగతి నగర్‌కు చెందిన చక్కా అజిత్ కృష్ణ, అల్లూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని రెండు సంవత్సరాలపాటు ఆ యువతితో ప్రేమాయణం నడిపాడు. పెళ్లి చేసుకుందామనే సరికి తమ పెద్దలు అంగీకరించడంలేదంటూ చేతులెత్తేశాడు. దీంతో సదరు యువతి సోమవారం దిశ యాప్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన కొత్తపట్నం పోలీసులు యువతి ఇంటికి వెళ్లి ఆమె తలిదండ్రులతో మాట్లాడారు. బాధిత యువతి ఇచ్చిన సమాచారం మేరకు ఒంగోలులోని కృష్ణ ఇంటికి చేరుకుని పెద్దలతో చర్చించారు. కృష్ణను కొత్తపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో కృష్ణ, అతడి కుటుంబం పెళ్లికి అంగీకరించింది. తమకు న్యాయం చేసిన దిశకు జీవితాంతం రుణపడి ఉంటామని బాధిత యువతి, ఆమె తల్లిదండ్రులు చెప్పారు.

న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఏ దాడులు హేయం

ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): న్యాయవాదుల ఇళ్లు, కార్యాలయాలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాడులు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడకు చెందిన న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయుల ఇళ్లలో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేయడాన్ని ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ప్రాంగణంలో నిరసన దీక్ష చేపట్టారు. చలసాని అజయ్ మాట్లాడుతూ.. న్యాయవాదులకు, క్లయింట్లకు మధ్య జరిగే సంభాషణలను పోలీసులకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. న్యాయవాదులకే ఇలా జరిగితే.. ఇక సామాన్యులకు న్యాయం ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించారు. బీబీఏ అధ్యక్షుడు కేబీ సుందర్ మాట్లాడుతూ.. న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఏ దాడులను ఖండిస్తూ బుధవారం కోర్టు విధుల్ని బహిష్కరించి.. నిరసన తెలియజేస్తామన్నారు. సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సోదాల సమయంలో తమ వారికి మద్దతుగా వెళ్లిన న్యాయవాదులను కూడా అరెస్టు చేస్తామంటూ పోలీసులు హంగామా సృష్టించారని మండిపడ్డారు. న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయులు, ఏఎస్ఎస్ రామ్ ప్రసాద్, బీబీఏ పూర్వ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, పిళ్లా రవి, సంపర శ్రీనివాస్, మన్మధరావు, జున్ను శ్రీనివాస్, కార్యదర్శి జ్యోతి, పుప్పాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో పాల్గొన్న బీబీఏ అధ్యక్షుడు సుందర్, న్యాయవాదులు

టీటీడీ బస్సు చోరీ కేసు నిందితుడి అరెస్ట్

ఏఎస్పీ విమలకుమారి

తిరుమల/తిరుపతి లీగల్ : టీటీడీ ఉచిత ధర్మరథం ఎలక్ట్రిక్ బస్సు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు నేరవిభాగం ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలం అనంజపూర్ గ్రామంలోని నీలావర్ గణపతి కుమారుడు నీలావర్ విష్ణు (20) గతనెల 24వ తేదీన తిరుమల బ్రహ్మోత్సవాలకు వచ్చాడు. టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం దగ్గర ఉంచిన రూ.1.44 కోట్ల విలువైన టీటీడీ ఉచిత ధర్మరథం ఎలక్ట్రిక్ బస్సును చోరీ చేసి తీసుకెళ్లాడు. నిందితుడు అదేరోజు పోలీసులకు భయపడి నాయుడుపేట చెన్నై రహదారిపై బస్సును వదిలి పారిపోయాడు. అతని కోసం పోలీసులు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో గాలించి సోమవారం సాయంత్రం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అరెస్ట్ చేశారు. కాగా, ఈ కేసులో అరెస్టయిన నిలావర్ విష్ణు తల్లిదండ్రులు మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వలసి వచ్చి జీవిస్తున్నారు. 2015లో విష్ణు తండ్రి భార్యను హత్యచేసి జైలుకు వెళ్లాడు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి రివార్డులను ప్రకటించగా.. ఏఎస్పీ వారికి అందజేశారు.ఇదిలా ఉండగా నిందితుడు నీలావర్ విష్ణుకు ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ ఏఎస్పీ విమలకుమారి


నిందితుడు నీలావర్ విష్ణు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.